# ప్రతిపక్షం
www.prathipaksham.in

మంగళవారం 04.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 224 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu




మహిళల వన్డే జట్టుకు బీసీసీఐ భారీ నజరానా 12



## టిప్పర్ రాంగ్ రూట్‌లో రావడంతోనే ప్రమాదం

- బాధిత కుటుంబాలను సర్కారు ఆదుకుంటుంది
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



## ప్రజాప్రతినిధులకు నిరసన సెగ



## చేవెళ్ల దుర్ఘటన బాధాకరం

చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాద సంఘటన స్థలాన్ని స్పీకర్, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ పరిశీలించారు.

..:: 5లో





కోఠి ఉమెన్స్ కాలేజీలోనే డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న సాయిప్రియతో పాటు అదే కళాశాలలో చదువుతున్న ముస్కాన్ అనే యువతి కూడా బస్సు ప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయింది. ఇద్దరు స్నేహితులు ఒకే బస్సు ప్రమాదంలో చనిపోవడంతో మిత్రులు తట్టుకోలేక శోకసంద్రంలో మునిగిపోయారు. ఇద్దరూ కళాశాల విద్యార్థినులకు ఆత్మరక్షణకు తైక్వాండో యుద్ధ విద్యను నేర్పేవారంటూ చెబుతూ కన్నీటి పర్యంతమయ్యారు. యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన అఖిలారెడ్డి అనే యువతి కూడా ఈ బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఎంబీఏ చదువుతున్న కుమార్తె మృతితో ఆమె తల్లి, కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. తమ కుమార్తె ఇక లేదనే విషయం తెలిసి వారి రోదన ఆకాశాన్ని అంటింది.

## తెలతెలవారుతుండగానే
# తెల్లారిన బతుకులు
## చేవెళ్ల మీర్జాగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### 19 మంది ప్రయాణికుల దుర్మరణం, 35 మందికి తీవ్ర గాయాలు: కొందరి పరిస్థితి విషమం

- మృత్యు శకటంగా దూసుకొచ్చిన టిప్పర్
- కండ్లు మూసి తెరిచేలోగా తీరని విషాదం
- వెంటనే రంగంలోకి దిగిన సహాయక బృందాలు
- మృతులలో ఐదుగురు యువతులు, ఇద్దరు చిన్నారులు
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెండ్ల మృతి
- తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన పిల్లలు
- బాధితుల రోదనలతో దద్దరిల్లిన సంఘటనా స్థలం
- తీరని విషాదాన్ని చూసి చలించిపోయిన స్థానికులు
- చూస్తుండగానే టిప్పర్ వచ్చి ఢీకొట్టిందన్న కండక్టర్
- ప్రమాదంలో ఇరు వాహనాల డ్రైవర్లు కూడా మృతి
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసి ప్రధాని మోడీ, సీఎం రేవంత్ రెడ్డి
- హుటాహుటిన ఘటనా స్థలానికి మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు, రాజనర్సింహ ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, సబితాఇంద్రారెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిపై ప్రజల ఆగ్రహం
- సంఘటనపై న్యాయ విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

**చేవెళ్ల నుంచి ప్రతిపక్షం ప్రత్యేక ప్రతినిధులు**

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాపూర్ వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర బస్సు ప్రమాదం పలు కుటుంబాలలో అంతులేని విషాదాన్ని నింపింది. అయిన వారిని పోగొట్టుకున్న కుటుంబసభ్యుల బాధ వర్ణణాతీతంగా ఉంది. ఇద్దరు చిన్నారుల తల్లిదండ్రులు ప్రమాదంలో చనిపోగా, పిల్లల రోదన ప్రతి ఒక్కరినీ కదిలించింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కచెల్లెండ్లు చనిపోవడం స్థానికులను కలిచివేసింది. బిడ్డల మృతితో తండ్రి విలపించిన తీరు తీవ్ర విషాదాన్ని నింపింది. అక్కడ బాధితులను ఎవ్వరిని కదిలించినా కన్నీటి బాధలే వినిపించాయి. ఏం జరుగుతుందో తమకు తెలియలేదని కండక్టర్ రాధ తెలిపారు. ఆ ప్రమాదాన్ని గ్రహించేలోపే కంకర లారీ బస్సును ఢీకొట్టిందని విలపించారు. ఎదురుగా టిప్పర్ వేగంగా రావడం గమనించిన డ్రైవర్ బస్సును రోడ్డు కిందకు దింపినట్లు తెలిపారు. అయినా, వేగంగా వచ్చిన టిప్పర్ బస్సును ఢీకొట్టిందని చెప్పారు. చిట్టెంపల్లి వద్ద ఓ ప్రయాణికురాలిని ఎక్కించుకుని ఆమెకు టికెట్ ఇచ్చి కూర్చోగానే ప్రమాదం సంభవించినట్లు రాధ వెల్లడించారు. బస్సులో విద్యార్థులు, పోలీసులు, ఉద్యోగులు సహా మొత్తం 72 మంది ఉన్నారని కండక్టర్ వెల్లడించారు. ఈ ప్రమాదంలో 19 మంది చనిపోగా, అనేకమంది గాయపడ్డారు.

**తెలతెలవారక ముందే ప్రమాదం**

'ప్రమాదం ఉదయం 6:40 నుంచి 7 గంటల మధ్యలో జరిగింది. మేము ప్రయాణించే బస్సు నెమ్మదిగానే వెళుతోంది. టిప్పర్ వేగంగా వచ్చి కళ్లు తెరిచేలోగానే బస్సును ఢీ కొట్టిందని కండక్టర్ తెలిపారు. టిప్పర్ లోని

..:: మిగతా 5లో





## ప్రైవేట్ రంగంలో పరిశోధనలకు ప్రోత్సాహం

ప్రైవేట్ రంగంలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించే వాతావరణం కల్పించేందుకు రూ. లక్ష కోట్ల నిధిని ఉపయోగించనున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలిపారు.

11



## ఢిల్లీలో కోట్లు ఖర్చు పెట్టినా దక్కని ఫలితం

భుత్వాలు పెట్టుబడి పెడితే, ప్రజలకు ప్రయోజనం చేకూరాలని, ఆదాయం రావాలని, పర్యాటకులను ఆకర్షించాలని భావిస్తాయి. ఈ మేరకు ప్రణాళిక రూపొందిస్తాయి. బడ్జెట్ అంచనా వేస్తాయి.

11



## అమెరికాకు 62 వేల కోట్ల నష్టం

ఏ ముహూర్తంలో డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయ్యాడో తెలియదు గానీ, ఆ దేశానికి ఏది కూడా కలిసి రావడం లేదు. ఆంక్షలు, సుంకాలు అంటూ ట్రంప్ ప్రపంచ దేశాలను అనేక విధాలుగా ఇబ్బంది పెడుతున్నాడు.

11



## రాజస్థాన్ లో ఘోర రోడ్డు ప్రమాదం

రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో సోమవారం మరో రోడ్డు ప్రమాదం జరిగింది. హర్మారా రాణా పరిధిలోని లోహామండీ రహదారిపై వేగంగా వస్తున్న ఓ టిప్పర్ బీభత్సం సృష్టించింది.

11

# కమీషన్లు రావనే ఎస్ఎల్బీసీ పనులు ముట్టలే




- కృష్ణా నది మీద కేసీఆర్ ఒక్క ప్రాజెక్టూ కట్టలే
- కేసీఆర్ నిర్వాకంతోనే ఏపీకి అలుసైపోయాం
- నల్గొండ, పాలమూరు ప్రజల కండ్లలో మట్టిగొట్టిండ్రు
- తప్పులు చేసి, అప్పులు చేసి దోపిడీ చేసిండ్రు
- ఎన్ని ఆటంకాలు వచ్చినా టన్నెల్ పూర్తి చేస్తాం
- గ్రావిటీ ద్వారా 30 టీఎంసీల నీటి తరలింపు
- తాగునీటితో పాటు 3 లక్షల ఎకరాలకు సాగునీరు
- ముంపు గ్రామాల సమస్యలను పరిష్కరిస్తా
- 'మాగ్నెటిక్ జియోఫిజికల్ సర్వే' ను ప్రారంభించిన సీఎం రేవంత్

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో**

**హైదరాబాద్, నవంబర్ 3:** ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రజలకు అన్నింటా అన్యాయం జరుగుతోందని కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను పదేండ్ల పాటు పాలించిన కేసీఆర్ దోపిడీ చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. కమీషన్ల కోసం కక్కుర్తి పడుతూ కొత్త ప్రాజెక్టులు, పథకాలు చేపట్టారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులను పూర్తి చేస్తే తనకేంటీ లాభం అని పట్టించుకోలేదన్నారు. నేడు ఆ ప్రాజెక్టుల వ్యయం భారీగా పెరిగిందన్నారు. తప్పులు చేసి, అప్పులు చేసి దోపిడీ చేశారనే కారణంతోనే ప్రజలు బీఆర్ఎస్‌ని పక్కన బెట్టారని విమర్శించారు. కృష్ణా నది మీద చేపట్టిన అన్ని ప్రాజెక్టులను కేసీఆర్ నిర్లక్ష్యం

..:: మిగతా 2లో



## డిజిటల్ అరెస్టు కేసులలో కఠిన శిక్షలు

- లేకపోతే మోసగాళ్లు పేట్రేగిపోతారు
- బాధితులు 3 వేల కోట్లు కోల్పోయారు
- ఇది ఆందోళన కలిగించే విషయం
- సీనియర్ సిటిజన్లను లక్ష్యంగా చేసుకుంటున్నారు
- విచారణలో సుప్రీం ధర్మాసనం ఆగ్రహం

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో**

**న్యూఢిల్లీ, నవంబర్ 3:** డిజిటల్ అరెస్టు కేసులలో కఠిన శిక్షలు విధించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. చాలా విస్తృత స్థాయిలో జరుగుతున్న సైబర్ నేరాలను కట్టడి చేయాలని పేర్కొంది. బాధితులు సుమారు దాదాపు మూడు వేల కోట్లు కోల్పోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. సైబర్

..:: మిగతా 2లో

# మరో ఆరు నెలలు కాల్పుల విరమణ



- తెలంగాణ సమాజం శాంతిని కోరుకుంటోంది
- ప్రజల ఆకాంక్షలను మా పార్టీ గౌరవిస్తోంది
- ప్రభుత్వం కూడా సంయమనం పాటించాలి
- శాంతిని భగ్నం చేసేందుకు కేంద్రం యత్నిస్తోంది
- ప్రజాస్వామికవాదులు వ్యతిరేకంగా పోరాడాలి
- మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ లేఖ

**ప్రతిపక్షం ప్రతినిధి, వరంగల్**

**నవంబర్ 3:** కాల్పుల విరమణపై మావోయిస్టు పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో మరో ఆరు నెలల పాటు కాల్పుల విరమణను పొడిగించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో లేఖ విడుదలైంది. తెలంగాణలో శాంతియుత వాతావరణం కొనసాగాలని పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయని, అందుకు తెలంగాణ సర్కార్ కూడా స్పందించిందని పేర్కొంది. ఈ క్రమంలో గత మే నెలలో ఆరు నెలల పాటు కాల్పుల విరమణను ప్రకటించామని తెలిపింది. ఇదే విధంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరో ఆరు నెలల పాటు కాల్పుల విరమణను ప్రకటిస్తున్నట్లు వెల్లడించింది. శాంతియుత వాతావరణం కొనసాగాలని తెలంగాణ సమాజం కోరుకుంటోంది కావున ప్రజల

..:: మిగతా 2లో

రాష్ట్రీయం



# కొడంగల్‌లో ఇక 'అక్షయపాత్ర'

- 14 న గ్రీన్ ఫీల్డ్ కిచెన్ ప్రారంభానికి రండి
- సీఎం రేవంత్ రెడ్డికి ఫౌండేషన్ ఆహ్వానం

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 3 :** సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ బడుల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు అక్షయ పాత్ర ఫౌండేషన్ ముందుకు వచ్చింది. సోమవారం ఉదయం ఫౌండేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిశారు. ఈ నెల 14వ తేదీన కొడంగల్ లో నిర్మించతలపెట్టిన గ్రీన్ ఫీల్డ్ కిచెన్ ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు. భోజనం తయారు చేసేందుకు కొడంగల్ సమీపంలోని ఎన్కేపల్లిలో రెండెకరాల విస్తీర్ణంలో ఫౌండేషన్ గ్రీన్ ఫీల్డ్ కిచెన్ నిర్మించనుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనానికి ఒక్కో విద్యార్థికి ఏడు రూపాయల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. నాణ్యమైన భోజనం తయారు చేసి అందించేందుకు అక్షయ ఫౌండేషన్ దాదాపు రూ.25 వరకు ఖర్చు పెడుతుంది. ప్రభుత్వం చెల్లించే నిధులకు అదనంగా అయ్యే ఖర్చును ఫౌండేషన్ భరిస్తుంది. కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధుల సాయంతో ఈ పథకం అమలుకు ఏర్పాట్లు చేసుకుంటోంది. నిరుడు డిసెంబర్ నుంచి ఈ నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ అందించే పథకం విజయవంతంగా అమలవుతోంది. 312 పాఠశాలలలో దాదాపు 28వేల మంది విద్యార్థులకు ప్రతి రోజు ఉదయాన్నే అల్పాహారం అందిస్తున్నారు.

# కమీషన్లు రావనే ఎస్ఎల్బీసీ పనులు ముట్టలే

మొదటిపేజీ తరువాయి



చేశారన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి కాకపోతే మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలకు తీవ్ర నష్టం కలుగుతుందని అన్నారు. ఆర్మీలో నిపుణులైన అధికారులను డిప్యుటేషన్‌పై తీసుకు వచ్చామని వివరించారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయకపోతే తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ నేతలను క్షమించరని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితులలోనూ ఎస్ఎల్బీసీ టన్నెల్‌ని తమ ప్రభుత్వం హయాంలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఎస్ఎల్బీసీ విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు చిల్లర మాటలు మానుకోవాలని హితవు పలికారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం 'మాగ్నెటిక్ జియోఫిజికల్ సర్వే'ను మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. తర్వాత మన్నెవారిపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

**కాళేశ్వరం కాంట్రాక్టర్లకే రూ.1.06 లక్షల కోట్లు**

కేసీఆర్ నిర్వాకం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు తాము అలుసైపోయామని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలలో సాగునీటి ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు కేసీఆర్ ప్రభుత్వం రూ.1.86 లక్షల కోట్లు చెల్లించిందని తెలిపారు. ఆ మొత్తంలో కాళేశ్వరం కాంట్రాక్టర్లకే రూ.1.06 లక్షల కోట్లు చెల్లించారని, గత పది సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా నదిపై ఎన్నో ప్రాజెక్టులు చేపట్టి పూర్తి చేసిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా నదిపై ప్రాజెక్టులు పూర్తి చేయలేదని సీఎం వివరించారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉండి ఉంటే టన్నెల్ పనులు ఎప్పుడో పూర్తయ్యేవన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పది కిలోమీటర్లు కూడా టన్నెల్ పనులు పూర్తికాలేదని పేర్కొన్నారు. టన్నెల్ పూర్తి చేస్తే కాంగ్రెస్‌కు పేరొస్తుందనే కారణంతోనే గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2004లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎస్ఎల్బీసీ టన్నెల్ 1, టన్నెల్ 2 పనులను ప్రారంభించారని అన్నారు.

**ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరిస్తా**

తాము అధికారంలోకి వచ్చాక ఎస్ఎల్బీసీ పనులను తిరిగి మొదలు పెట్టామని సీఎం తెలిపారు. అయితే, ఈ పనుల నేపథ్యంలో దురదృష్టవశాత్తూ ఎనిమిది మంది కార్మికులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు బాధ ఉన్నా, ఆ కుటుంబాలను ఆదుకుని పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆర్మీలో ఉన్న పరిచయాలతో ఎస్ఎల్బీసీ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ముంపునకు గురవుతున్న మర్లపాడు, కేశ్యతండా, నక్కలగండి తండా ప్రజలను ఆదుకుని, డిసెంబర్ 31వ తేదీలోగా సమస్యలని పరిష్కరిస్తామని మాటిచ్చారు. ఇప్పుడు కాకపోతే ఈ ప్రాజెక్టును ఇంకెప్పుడూ పూర్తి చేసుకోలేమన్నారు. మీడియా సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీ కృష్ణ, బాలు నాయక్, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# నిత్యం ఆహారంలో చేపలు ఉండాలి

- ప్రచార ప్రణాళికలు రూపొందించండి
- సమీక్ష సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 3 :** మాంసం తినడంలో మొదటి స్థానంలో ఉన్న తెలంగాణ చేపల వినియోగంలో వెనుకబడి ఉందని మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం ఆయన అంబేద్కర్ సచివాలయంలో చేపపిల్లల పంపిణీపై కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నవంబర్ చివరికల్లా చేపపిల్లల పంపిణీ పూర్తి కావాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులను కలుపుకొని పంపిణీ చేసేవిధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయంలో చేప పిల్లల పంపిణీలో అక్రమాలు జరిగాయని, ప్రతి చెరువు వద్ద చేపపిల్లల పంపిణీ వివరాలు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. చేప పిల్లల పంపిణీ ప్రక్రియను ప్రభుత్వం టి మత్స్య యాప్లో అప్లోడ్ చేయాలన్నారు. చేపల భుజించడంతో కలిగే ఆరోగ్యపర లాభాలపై విస్తృత ప్రచార ప్రణాళికలు రూపొందించాలన్నారు. వివిధ రాష్ట్రాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో చేపల వంటకం అమలును పరిశీలిస్తున్నామన్నారు. తెలంగాణలో అమలుకు సీఎం రేవంత్ రెడ్డితో చర్చిస్తామని తెలిపారు. సమావేశంలో మత్స్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్, ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## డిజిటల్ అరెస్టు కేసులలో
# కఠిన శిక్షలు

మొదటిపేజీ తరువాయి

నేరాలకు పాల్పడుతున్న మోసగాళ్లు తమకు తాము భద్రతా సిబ్బందిగా, కోర్టు అధికారులుగా, ప్రభుత్వాధికారులు పరిచయం చేసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఆడియో, వీడియో కాల్స్‌తో బాధితులను పీడిస్తున్నారని వివరించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, ఉజ్వల్ భుయాన్, జోయ్‌మాలా బాగ్చితో కూడిన ధర్మాసనం డిజిటల్ అరెస్టు కేసుల మీద సోమవారం విచారణ జరిపింది. ఈ విషయంలో కోర్టుకు సూచనలు చేసేందుకు అమికస్ క్యూరీని నియమించారు. కేంద్ర హోమ్ శాఖ, సీబీఐ సమర్పించిన రెండు నివేదికలను కోర్టు పరిశీలించింది. బాధితులలో సీనియర్ సిటిజన్లు ఉన్నారని, ఇలాంటి కేసులలో కఠినమైన ఆదేశాలు ఇవ్వకుంటే, ఈ సమస్య మరింత జఠిలంగా తయారు అవుతుందని ధర్మాసనం పేర్కొంది. భద్రతా ఏజెన్సీలను బలోపేతం చేయాలని, ఇలాంటి కేసులపై ఉక్కుపాదం మోపాలని చెప్పింది. విచారణను ఈ నెల పదికి వాయిదా వేసింది.



# మరో ఆరు నెలలు కాల్పుల విరమణ

మొదటిపేజీ తరువాయి

ఆకాంక్షలకు అనుగుణంగా పాటు కాల్పుల విరమణను ప్రకటిస్తున్నామని పార్టీ వివరించింది. గతంలో కొనసాగిన విధంగానే తమ వైపు నుంచి శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకు కృషి చేస్తామని, ప్రభుత్వం వైపు నుంచి కూడా గతంలో వ్యవహరించిన విధంగానే ఉండాలని కోరింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న శాంతియుత వాతావరణాన్ని భంగం చేసేందుకు ప్రయత్నాలు చేస్తోందని, ఇటువంటి ప్రయత్నాలకు వ్యతిరేకంగా అన్ని పార్టీలు, అన్ని సామాజిక వర్గాలు, సంఘాలు, విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు పోరాడాలని కోరుతున్నట్లు మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ కోరారు.



# హస్తకళలను ప్రోత్సహించాలి

- తద్వారా గ్రామీణ కళాకారులకు ఉపాధి
- వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 3 :** హస్తకళలను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ కార్మికులకు ఉపాధి పెరుగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పీపుల్స్ ప్లాజా వద్ద గల హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో భారత ప్రభుత్వ వస్త్ర సంస్థ, తెలంగాణ రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'గాంధీ శిల్ప బజార్' ప్రదర్శనను మంత్రి తుమ్మల సోమవారం ప్రారంభించారు. ఈనెల పది వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శన లో రాష్ట్రంలోని చేనేత హస్తకళల కళాకారుల వస్తువులను ప్రదర్శన,అమ్మకాలకు ఉంచారు. నిర్మల్ బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు సహా వివిధ ప్రాంతాలకు చెందిన చీరలు, వస్త్రాలను ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగామంత్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేతను, హస్తకళాలను ప్రోత్సహించాలన్నారు. వ్యాపార అభివృద్ధి జరిగి గ్రామీణ ఉపాధి పెరుగుతుందన్నారు. గ్రామీణ హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకోసం అన్ని ఒకే దగ్గర లభించేలా ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు.



**బాధితులను ఆదుకుంటాం.. మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం..**

చేవెళ్ల మీర్జాగూడలో జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో క్షతగాత్రులను మంత్రులు పొన్నం ప్రభాకర్, రాజన్సింహ, శ్రీధర్‌బాబు పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూస్తామని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.



# నాగర్ కర్నూల్ కళాశాలపై సమగ్ర నివేదిక

- కాలేజీని ఆకస్మికంగా సందర్శించిన చిన్నారెడ్డి

**ప్రతిపక్షం, షాద్‌నగర్, నవంబర్ 3 :** విద్యార్థులు ఆందోళనకు దిగిన నాగర్ కర్నూల్ సాంఘిక సంక్షేమ కళాశాల స్థితిగతులపై, ప్రిన్సిపాల్ వ్యవహారంపై రాష్ట్ర ముఖ్యమంత్రికి సమగ్ర నివేదికను అందించనున్నట్లు ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన షాద్ నగర్ లోని నాగర్ కర్నూల్ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. ప్రిన్సిపాల్ వైఖరికి నిరసనగా ఆదివారం 400 మంది విద్యార్థినులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ప్రిన్సిపాల్ శైలజ ప్రవర్తించిన తీరును, సిబ్బంది, విద్యార్థినులను చిన్నారెడ్డి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి సహ పంక్తి భోజనం చేశారు. సమస్యలను తెలుసుకున్నారు. సీఎంకు ఇచ్చే నివేదికలో అన్ని విషయాలు ప్రస్తావిస్తానని తెలిపారు.

# గోదావరి పుష్కరాలకు సకల ఏర్పాట్లు చేయండి

- సమీక్షలో మంత్రులు కొండా సురేఖ, అడ్లూరి



**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 3 :** జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని దేవాదాయ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. గోదావరి పుష్కరాలకు సంపూర్ణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధర్మపురి ఆలయ మాస్టర్ ప్లాన్ పై మంత్రి కొండా సురేఖ సోమవారం సమీక్ష నిర్వహించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ ప్రిన్స్ పల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, ఎండోమెంటు డైరెక్టర్ హరీశ్ ఆలయ ఈఓ పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి పనులను ఆగమశాస్త్రం, వేద పండితులు, స్థానికుల, భక్తులు మనోభావాలకు అనుగుణంగా చేపట్టాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. 2027 జులైలో రానున్న గోదావరి పుష్కరాలను దక్షిణ భారత కుంభమేళాగా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. రూ. 50 కోట్లతో చేపట్టే నిర్మాణాలలో ఎక్కడా రాజీ పడకుండా చూడాలన్నారు. తన సొంత నియోజకవర్గంలోని స్వామి వారి ఆలయాన్ని విస్తృతంగా అభివృద్ధి చేస్తున్న మంత్రి కొండా సురేఖకు మంత్రి అడ్లూరి ధన్యవాదాలు తెలిపారు. అందరి సహకారంతో పుష్కరాలను విజయవంతం చేస్తామన్నారు.

“



దశాబ్దాలపాటు ఆర్జేడీ బిహార్‌ను కష్టాల్లో ఉంచింది. ఆ పార్టీకి అభివృద్ధి వ్యతిరేక చరిత్ర ఉంది. రోడ్లు నిర్మిస్తే ప్రమాదాలు జరుగుతాయని, కరెంటు సరఫరా చేస్తే షాక్‌కు గురై చనిపోతారని ప్రజలకు ఆర్జేడీ నాయకులు చెప్పేవాళ్లు. నితీశ్ కుమార్ ఆధ్వర్యంలో సుపరిపాలన అందించాం. రాష్ట్రానికి వందే భారత్ రైళ్లు, రోడ్లు తీసుకొచ్చాం.

- బిహార్‌ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ





# తుఫాన్‌తో పత్తి రైతులకు అపార నష్టం

- 25 తేమ ఉన్నా పత్తిని కొనుగోలు చేయాలి
- కొరటా ప్రాజెక్ట్ పనుల ఆలస్యం ఎందుకు?
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నవంబర్ 3:** జనం బాట కార్యక్రమంలో భాగంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సోమవారం నాడు ఆదిలాబాద్ జిల్లాలోని పత్తి మార్కెట్లు, కొరటా ప్రాజెక్ట్ ప్రాంతాలు, తరుణం బ్రిడ్జి, కొమరం భీమ్ కాలనీని పరిశీలించారు. ఆదిలాబాద్ పత్తి మార్కెట్ యార్డులో పత్తి రైతులతో మాట్లాడారు. తుఫాన్ కారణంగా పత్తి తేమ శాతం 20-25 శాతం వరకు పెరిగిందని, 12 శాతం కంటే ఎక్కువ తేమ ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేయనందున బండికి 50 వేల రూపాయల నష్టం వస్తోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగిన చర్యలు చేపట్టాలని కోరారు. అన్నారు. కలెక్టర్ తో మాట్లాడుతూ 'ప్రస్తుత సీజన్‌లో తేమ ప్రమాణాలలో సడలింపు ఇవ్వడం లేదా, కనీసం రెండు రోజుల మార్కెట్ షట్ డౌన్ చేయడం ద్వారా రైతులు పత్తిని ఆరబెట్టుకునే అవకాశం కల్పించాలని సూచించారు. 25 శాతం తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేయాలని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ కు విజ్ఞప్తి చేశారు. చనాకా కొరటా ప్రాజెక్ట్ 90 శాతం పూర్తయిందని, 10 శాతం పని మాత్రం ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పూర్ణం చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఆదివాసీలను అడవుల నుంచి తరలించి పారిశ్రామికవేత్తలకు వనరులు కేటాయించటం అన్యాయమన్నారు.

# కరీంనగర్ పెద్దాసుపత్రి తరలింపునకు కుట్రలు?

- హుజురాబాద్ కు మార్చేందుకు ప్రయత్నాలు
- రోజురోజుకు పెరుగుతున్న రాజకీయ నేతల ఒత్తిడి
- ప్రధాన ఆసుపత్రిని తరలించ వద్దని ప్రతిపక్షాలు



**ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 3:** కరీంనగర్ ప్రభుత్వ ప్రధానాసుపత్రి తరలింపునకు కుట్రలు.. జరుగుతున్నాయి. వందల యేండ్ల చరిత్ర ఉండి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఈ ఆసుపత్రి ని హుజురాబాద్ కు తరలించేందుకు ప్రయత్నాలు జరుతున్నాయి. రోజురోజుకూ రాజకీయ నేతల ఒత్తిడి పెరుగుతోంది. ప్రతిపక్షాలు ఈ తరలింపును వ్యతిరేకిస్తున్నాయి. కరీంనగర్ కు ప్రస్తుతం మెడికల్ కళాశాల కేటాయించినందున, అక్కడి ఆసుపత్రిని హుజురాబాద్ కు తరలించడానికి చర్యలు తీసుకుంటున్నారని సమాచారం. కాగా, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి భవనాన్ని మెడికల్ కళాశాలకు కేటాయించినందున, ఆసుపత్రిని హుజురాబాద్ కు తరలించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణా రెడ్డి డిమాండ్ చేశారు. హుజురాబాద్ తో పాటు చుట్టుపక్కల ప్రజలందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా హుజురాబాద్ మీదుగా వెళుతున్న నేషనల్ హైవే ప్రయాణికులకు కూడా అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇక్కడి ప్రాంతంలోని పేద మధ్యతరగతి ప్రజల ను దృష్టిలో ఉంచుకొని మెరుగైన వైద్య సేవలు అందించడానికి , రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నీ హుజురాబాద్ కు తరలించే విషయంలో కూడా ఆలోచన చేసి , ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. హుజురాబాద్ అస్పత్రి అభివృద్ధి కి కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషి చేశారని ఆయన అన్నారు.ఇప్పటి కే హుజురాబాద్ అస్పత్రిని పరిశీ లించామని పేర్కొన్నారు. .రూ.1 కోటి 50 లక్షల సి ఎస్ ఆర్ నిధులతో 15 రకాల విలువైన వైద్య పరికరాలు సామాగ్రిని ఇటీవల కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అందించారని తెలిపారు.



# డిసెంబర్ 19 నుండి 21 వరకు లఘు చిత్రోత్సవం

- లోగోను ఆవిష్కరించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 3:** ఈ యేడాది డిసెంబర్ 19 నుండి 21 వరకు ప్రసాద్ ఐమాక్స్‌లో జరగనున్న హైదరాబాద్ తొలి అంతర్జాతీయ లఘు చిత్రోత్సవం లోగోను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సోమవారం దర్బార్ హాలులో ఆవిష్కరించారు. ప్రముఖ సినీ దర్శకులు సి ఉమా మహేశ్వరరావు, లఘు చిత్రోత్సవ నిర్వాహకులు దాదా సాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిలిం స్టడీస్ ప్రిన్సిపల్ నందన్ బాబు, రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ కార్యనిర్వహక అధికారి ప్రియాంక పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ లఘు చిత్రాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. లోగో హైదరాబాద్ సంస్కృతీ సాంప్రదాయాలకు దర్పణం పడుతోందని ప్రశంసించారు.ఈ లఘుచిత్రోత్సవాల ద్వారా నగరం కొత్తదనాన్ని సంతరించుకోవాలని ఆకాంక్షించారు.



# చేవెళ్ల బస్సు ప్రమాదం దురదృష్టకరం

- జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ఆజహరుద్దీన్

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 3:** చేవెళ్ల సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకున్న భయంకర బస్సు ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని రేపింది. ఈ ఘటనలో పలు అమూల్య ప్రాణాలు కోల్పోవడం పట్ల జమాతే ఇస్లామీ హింద్ తెలంగాణ అధ్యక్షులు మహమ్మద్ అజహరుద్దీన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబాలు ప్రియమైన వారిని కోల్పోయి వల్ల పూడ్చలేని నష్టాన్ని ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి భద్రత కోసం ప్రభుత్వం మరింత సమర్థవంత చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ రహదారుల మరమ్మత్తు, ట్రాఫిక్ క్రమశిక్షణ మెరుగుదల, వాహనాల ఫిట్‌నెస్‌పై కఠిన పర్యవేక్షణ ఉండాలని సూచించారు. అలాగే, ప్రమాదాల నివారణ కోసం ప్రధాన రహదారులపై ఆధునిక పరికరాలు మరియు అప్రమత్తమైన సిబ్బందిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. మరణించినవారి కుటుంబాలకు సానుభూతి తెలియజేసి, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

# ఓవర్ లోడ్, ఓవర్ క్రౌడ్ ఎప్పటికీ ప్రమాదమే

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహా



**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 3 :** లారీ ఓవర్ లోడ్, బస్సులో అధిక ప్రయాణికులు ఉన్నందునే ప్రమాదంలో మృతుల సంఖ్య భారీగా నమోదైందని మంత్రి దామోదర నర్సింహా అన్నారు. హద్దులు మీరితే కుదరదని, ప్రయాణాలు ముఖ్యమే కానీ, వాటితో ప్రమాదాలు తెచ్చుకోవద్దన్నారు. కంకరతో నిండిన లారీ, కిక్కిరిసిన బస్సు ఎవర్ని తప్పుపట్టినా ప్రాణం తిరిగి రానిదని పేర్కొన్నారు. 'రోడ్డు నిబంధనలు పాటిస్తే ఏ సమస్యా ఉండదు. కానీ, హైవే నాలెడ్జ్ లేకుంటే ఎవరూ ఏమీ చేయలేరు. మన స్వీయ నియంత్రణే మనకు రక్ష. ఇక్కడ ఇంకో విషయం కూడా ఆలోచించాలి. రద్దీకి తగ్గ బస్సులను నడపక పోవడం, రోడ్లు అధ్వాన్నంగా ఉండటం కూడా ప్రమాదాలకు కారణం కావచ్చు. 50 మంది ఎక్కాల్సిన బస్సులో 70 మంది ఎందుకు ఎక్కుతారు. జనం రద్దీకి తగ్గ బస్సులు నడపకపోతే ఇలాగే ఉంటది. టిప్పర్ కూడా ఓవర్‌లోడ్‌తోనే ఉంది. అసలు ఆ టైంలో టిప్పర్‌కు ఆ రోడ్డుపైన అనుమతి ఉందా అనేది తెలియాల్సి ఉంది. ఇంత పెద్ద ప్రమాదానికి ఇవన్నీ కారణాలే అనేది అందరూ ఆలోచించాల్సిన విషయం' అని మంత్రి వివరించారు.

# పరిమితులు లేకుండా సీఎం విమర్శలు

- ఉప ఎన్నికకు పాకిస్తాన్ కు లింకేమిటి?
- మండిపడిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 3:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి మీద కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. రాజకీయ విమర్శలకు పరిమితులు ఉండాలని, జూబ్లీహిల్స్‌కు పాకిస్తాన్‌తో లింక్ పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో తెలంగాణలో అధికారంలో వచ్చిందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని, ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా అమలు చేయకుండా జూబ్లీహిల్స్‌లో తమ అభ్యర్థిని గెలిపించాలంటూ మంత్రులు ప్రచారం చేయడం సిగ్గు చేటని పేర్కొన్నారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఓడిపోతే రేషన్ బియ్యం ఆగిపోతుందని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. తాము ఎలాంటి సర్వే చేయకపోయినా, తమ అభ్యర్థి లంకల దిలీప్ రెడ్డికి అనూహ్య స్పందన వస్తున్నదని తెలిపారు. అజహరుద్దీన్‌కి మంత్రి పదవి ఇవ్వడం తమకు రాజకీయంగా ప్లస్ పాయింట్ అయిందన్నారు. ఇక నగరంలో మెట్రో విస్తరణకు సంబంధించి ఇప్పటివరకు రాష్ట్రం నుంచి ఎలాంటి ప్రతిపాదన రాలేదని, ఎల్ అండ్ టి నుంచి ప్రభుత్వం టేకోవర్ చేసిన కొత్త డీపీఆర్ ఇంకా పంపలేదని తెలిపారు.



# అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

- రెండు సంవత్సరాలుగా 49 దొంగతనాలు
- 9.66 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్న

**ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట నవంబర్ 3:** గత రెండేండ్లుగా పలు జిల్లాలలో వరుసగా దొంగతనాలకు పాల్పడిన అంతర్ జిల్లా దొంగల ముఠాను సిద్దిపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వివరాలను పోలీస్ కమిషనర్ ఎంఎస్ విజయ్ కుమార్ సోమవారం విలేకరులకు వెల్లడించారు. ఈ ముఠా సభ్యులు సిద్దిపేట జిల్లాలోని వివిధ గ్రామాల్లో ఉన్న సెల్ టవర్‌లను లక్ష్యంగా చేసుకుని బ్యాటరీలు, డీజిల్ దొంగలించేవారని చెప్పారు. అంతేకాక, రాచకొండ, జగిత్యాల, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, వరంగల్, జనగాం, మహబూబాబాద్ జిల్లాలలోనూ కూడా ఇదే తరహా దొంగతనాలకు పాల్పడ్డారని వివరించారు. సిద్దిపేట జిల్లాలో 16, మిగిలిన జిల్లాలలో 33 దొంగతనాలు చేసారని చెప్పారు. ప్రధాన నిందితుడు బత్తుల గురుస్వామి (31), వృత్తి బైక్ మెకానిక్, బద్రాద్రి కొత్తగూడెం జిల్లా అయ్యనపాలెం గ్రామానికి చెందినవాడు. తన తమ్ముడు బత్తుల సాయిరామ్ (26) తో కలిసి దొంగతనాలు ప్రారంభించాడు. తన గ్రామస్తుడు బత్తుల శ్రీను (36)తో పరిచయం ఏర్పడిన తర్వాత, స్క్రాప్ వ్యాపారి పుట్ట ఆంజనేయులు, కిరాణా వ్యాపారి బండారి శ్రీనివాస్‌లతో సంబంధాలు ఏర్పరచుకున్నాడు. వీరే దొంగతనాల సొత్తును కొనుగోలు చేసేవారని తెలిపారు. మొత్తం 48 దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. సీపీ పర్యవేక్షణలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు, తొగుట సీఈ ఎస్‌కే లతీఫ్, సీసీఎస్ సీఐ అంజయ్య, ఎస్ఐలు రవికాంత్ రావు, మానస, అరుణ్ కుమార్ తో కూడిన ప్రత్యేక బృందాలు ముఠాను పట్టుకునేందుకు కృషి చేశాయి.

# కిషన్ రెడ్డి మాటలు నవ్వు తెప్పిస్తున్నాయి



- మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 3 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట వింటే పెద్ద జోక్ గా అనిపించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్ సభ నియోజకవర్గంలో జూబ్లీహిల్స్ అంతర్భాగంగా ఉందని గుర్తు చేశారు. 'గతంలో కూడా జూబ్లీహిల్స్‌లో బీజేపీ అభ్యర్థి పోటీ చేశారు. అప్పుడు 25 వేల ఓట్లు వచ్చాయి. ఇప్పుడు 10 వేల కంటే ఎక్కువ ఓట్లు రావు' అని పొన్నం సవాల్ చేశారు. నేరుగా బీఆర్ఎస్ తో కుమ్మక్కై, తిరిగి అదే అభ్యర్థికి టికెట్ ఇచ్చి ప్రచార సరళిని, బీజేపీ వ్యవస్థను అంత బీఆర్ఎస్ కు అప్పగించారని ఆరోపించారు. పదేండ్లుగా సంవత్సరాలుగా ఈ నియోజకవర్గానికి కిషన్ రెడ్డి ఏం చేసారో చెప్పగలరా? అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ గురించి కనీసం శ్రద్ధ లేనివారు, పట్టించుకోనివారు ఉప ఎన్నికలలో ప్రగల్భాలు పలుకుతూ గెలుస్తామంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఇప్పటికైన నిజాయితీగా అభ్యర్థిని మోసం చేయకుండా, రాజాసింగ్ చెబుతున్నట్టుగా వ్యవహరించాలని డిమాండ్ చేసారు.

# ప్రభుత్వ డాక్టర్ 4.50 కోట్లు మింగేశాడు

- బాధ్యలందరినీ వెంటనే సస్పెండ్ చేయాలి
- డా. కృష్ణ ప్రసాద్ నుండి రూ. 4.50 కోట్లు రికవరీ చేయాలి
- ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు
- తెలంగాణా ఆరోగ్య శాఖ కార్యదర్శికి కూడా ఫిర్యాదు



**ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 3:** ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో పని చేసే డాక్టర్ కృష్ణప్రసాద్ రూ.4.50 కోట్ల ను మింగేశాడని ప్రజావాణిలో పలువురు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఆరోపణలపై చట్టపర చర్యలు తీసుకోవాలని, దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేసి ఆ డబ్బులను రికవరీ చేయించాలని కోరారు. బాధ్యులను చట్టపరమైన సస్పెండ్ చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఫిర్యాదు చేశారు. తెలంగాణా ఆరోగ్య శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేస్తామన్నారు. 2021 నుంచి 2024 వరకు జరిగిన అవినీతి అక్రమాలపై అప్పటి జిల్లా వైద్యాధికారి లలితాదేవి ఎంక్వయిరీ రిపోర్టు ప్రకారం, సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్, ఇతర డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2021 నుంచి 2024 వరకు సమగ్రంగా ఆడిట్ చేయాలన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ కు వచ్చే నిధులలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఎంక్వైరీ రిపోర్టు ప్రకారం చర్యలు తీసుకోకుండా కేవలం బదిలీ మాత్రం చేయడం దుర్మార్గమని అన్నారు. అవినీతి కంప్యూటర్ ఆపరేటర్ను సస్పెండ్ చేయడం, ఉద్యోగం నుండి తొలగించడం జరిగిందన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని కృష్ణ ప్రసాద్, డాక్టర్లు మహ్మద్ అలీం, రత్నమాల, శ్రీనివాస్, జ్యోతి, నవీనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

# హైదరాబాదులో వాన్ గార్డ్ గ్లోబల్ సెంటర్

- తెలంగాణ టెక్నాలజీ, ఆవిష్కరణలకు గుర్తింపు
- డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 3 :** ప్రపంచ ప్రసిద్ధి చెందిన వాన్ గార్డ్ గ్లోబల్ టెక్నాలజీ సెంటర్ నగరంలో ప్రారంభం అంటే రాష్ట్రంలో టెక్నాలజీ, ఆవిష్కరణలకు ఒక గుర్తింపుగా భావిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం సాయంత్రం నాలెడ్జ్ సెంటర్ లో మంత్రి శ్రీధర్ బాబు తో కలిసి వాన్ గార్డ్ గ్లోబల్ టెక్నాలజీ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచ స్థాయి కంపెనీలకు హైదరాబాద్ ఒక కేంద్రంగా మారిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రజల తరపున వాన్ గార్డ్ బృందానికి స్వాగతం తెలిపారు. పెట్టుబడుల నిర్వహణలో వాన్ గార్డ్ ఒక విశ్వసనీయ గ్లోబల్ నాయకుడని అన్నారు. కొత్త ఆవిష్కరణలు, నైతికత, మరియు దీర్ఘకాలిక విలువ సృష్టి పట్ల కట్టుబాటుతో ప్రసిద్ధి చెందింది అన్నారు. ఫ్యూచర్ సిటీలో వాన్ గార్డ్ సొంత కేంద్ర నిర్మాణానికి సంబంధిత మంత్రులు చొరవ చూపాలని కోరారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, కంపెనీ ప్రతినిధులు నితిన్ థండన్, వెంకటేష్, జాన్, కిమ్ పాల్గొన్నారు.



ఇరుకు రోడ్డు కావడం, డివైడర్ లేకపోవడం వల్లే చేవెళ్ల బస్సు ప్రమాదం జరిగింది. ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా కఠినంగా వ్యవహరిస్తేనే యాక్సిడెంట్లను నియంత్రించవచ్చు. వాహనాల స్పీడ్ లాక్ ఎంత వరకు అమలవుతుందో చూడాలి. దాన్ని బ్రేక్ చేస్తే ట్రిపుల్ పెనాల్టీ వేయాలి. ఫిట్‌నెస్ పర్మిట్లపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి.
- రవాణా శాఖ అధికారులతో మంత్రి పొన్నం

ఓపెన్ వాయిస్

# ఎవరు దోషులు! ఎవరు బాధ్యులు!!

చేవెళ్ల సమీపంలో సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం పలు ప్రశ్నలను మన ముందుకు తీసుకువచ్చింది. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు పాలకులు, సమాజము, మీడియా, సోషల్ మీడియా హడావిడి చేయడం తప్పిస్తే శాశ్వత పరిష్కారాల దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు మనకు సాధారణంగా కనిపించవు. మనం సాంకేతికంగా ఎంతో ముందుకు వెళుతున్నామని చెప్పుకుంటున్నప్పటికీ, ఇలాంటి ప్రమాదాలను చవిచూడాల్సి రావడం దురదృష్టకరం. ఒకచోట సజీవ దహనం, మరోచోట వాహనంలో ఇరుక్కుని ప్రాణాలు కోల్పోవడం మన బలహీనతనే బయట పెడుతోంది. దీనంతటికీ కేవలం నిర్లక్ష్యమే కారణమని స్పష్టంగా తెలుస్తున్నప్పటికీ, విచారణ పేరుతో కమిటీల పేరుతో కాలయాపన చేసి సమస్యను 'మసిపూసి మారేడు కాయ చేయడానికి' ప్రయత్నిస్తున్నారు తప్పితే, అసలు నిజాలను నిర్ధారించి దోషులను శిక్షిస్తామన్న ఆలోచన పాలకులకు ఏమాత్రం లేదనేది చాలా స్పష్టంగా కనిపిస్తూ ఉంది. కర్నూలు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో గానీ, చేవెళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలోగానీ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని కట్టినట్టుగా కనిపిస్తోంది. అయినప్పటికీ, దాని మీద మాట్లాడడానికి పాలకులకు ధైర్యం చాలడం లేదు. ట్రాఫిక్ పోలీసులు జనాన్ని బెదిరించడం, చలాన్లు రాయడం చాటున ఉండి కెమెరాలతో ఫోటోలు తీయడానికి ఇచ్చిన ప్రాధాన్యం రోడ్డు మీద ట్రాఫిక్ ని సరిదిద్దడానికి ఇవ్వడం లేదనేది చాలా సుస్పష్టం. అనేకసార్లు సోషల్ మీడియాలో నెటిజనులు ఈ సమస్యను ఎత్తి చూపారు కూడా. ఎవరైనా ధైర్యం చేసి ట్రాఫిక్ పోలీసులను ఇలా ఎందుకు చేస్తున్నారని అడిగితే వాళ్ల మీద దౌర్జన్యం చేసిన సంఘటనలు కూడా మనం ఎన్నోసార్లు చూశాం. కారణం ఏమిటంటే, 'మేమేం చేసినా చెల్లుతుంది' అనే ఒక భావన వారికి ఉంటుంది. ఇక ఉన్నతాధికారులు తీరు మరీ విచిత్రంగా ఉంటుంది. 'మేము మాత్రమే నీతిమంతులము. మేము మాత్రమే నిజాయితీపరులము. కిందిస్థాయి వాళ్లంతా అవినీతిపరులు, అక్రమాలు చేస్తారని' భావించి, ఓ చిన్న తప్పు దొరికితే చాలు దొరకబట్టి వాళ్లని సస్పెండ్ చేయడం, వాళ్ల మీద కఠిన చర్యలు తీసుకోవడానికి ఇచ్చిన ప్రాధాన్యం వాళ్లలో మార్పు తీసుకువచ్చి శాఖను సరిదిద్దుదామని ఆలోచన కనిపించదు. ఇంకా విచిత్రమేమిటంటే, అలా కింది స్థాయి అధికారులను సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులను ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో ప్రశంసలు రావడం. కిందిస్థాయి సిబ్బంది తప్పు చేశారు కావచ్చు, దానికి సస్పెన్షన్ మాత్రమే పరిష్కారమా! సస్పెన్షన్ ద్వారా కింది స్థాయి ఉద్యోగి కుటుంబము సమస్యలలో పడ్డ పడడం తప్ప జరిగే మేలేమిటి? ఎందుకీ కాలం చెల్లిన శిక్షలు. రోడ్డు మీద ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ ని ఎలా నియంత్రించాలి. తాము డ్యూటీలో ఉండే ఎనిమిది గంటలు విధి నిర్వహణ ఎలా చేయాలనే అంశాల మీద ఏ ఉన్నతాధికారైనా తన కింది సిబ్బందికి ఎప్పుడైనా మార్గదర్శనం చేశారా! ఎప్పుడో ఒకసారి ఏదో కార్యక్రమం జరిగినప్పుడు 'మీరు బాగా విధులు నిర్వహించాలి. మీ ద్వారానే శాఖకు పేరు వస్తుంది. తెలంగాణ పోలీసులంటే దేశమంతా పేరు ఉంది' అని ఢంకా బజాయించడం తప్పితే నిజమైన శిక్షణ వాళ్లకి ఇచ్చిన దాఖలాలు లేవనే చెప్పాలి. కానిస్టేబుల్ నుంచి మొదలుకొని ఐపీఎస్ వరకు ఏం శిక్షణ ఇస్తున్నారో ఎవరికి అర్థం కాని విషయం. ఆ శిక్షణ అంతా ఒక బ్రహ్మపదార్థం. జడ పదార్థం. నిజంగా మానవతా దృక్పథంతో విధులు నిర్వర్తించాలన్న ఆలోచన హోమ్ గార్డు నుంచి మొదలుకుని డీజీపీ వరకు కూడా లేదనే చెప్పాలి. నిజం ఎప్పుడు చేదుగానే ఉంటుంది. నిజాలు మాట్లాడితే చాలామందికి బాధ కలుగుతుంది. వాస్తవాలను మాట్లాడుకోకపోతే సమస్యలను పరిష్కరించుకోలేము. సమస్యలను పరిష్కరించుకోకపోతే కర్నూలు, చేవెళ్ల లాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయి. జరిమానాలు, చాలానులు విధించడం కాదు, ప్రజా రక్షణ, వాహనదారుల సంరక్షణ ముఖ్యమనేది మన పోలీసులు ముందుగా తెలుసుకోవాలి. వారికి ఆ రకంగా వారు విధిని నిర్వహించే స్వేచ్ఛ ఇవ్వాలి. ఎవరో ఒకరు రాంగ్ రూటులో బండి నడిపారని, నిబంధనలు ఉల్లంఘించారని అరెస్టు చేస్తే వార్డు మెంబరు, కార్పొరేటర్ నుంచి మొదలుకొని మినిస్టర్ వరకు ఫోన్లు చేస్తుంటే పోలీసులు మాత్రం ఏం చేయగలరు! వాళ్ల మీద కూడా తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. ఈ ఒత్తిడిని తొలగించాలి. ట్రాఫిక్ ను నియంత్రించడం అంటే ప్రయాణికుల సంరక్షణ అని పోలీసులకు అర్థం అయ్యేటట్టుగా వాళ్లకు మానవీయ దృక్పథం కలిగిన శిక్షణ ఇవ్వాలి. రోడ్డు మీద వాహనాలు నడిపే డ్రైవర్లకు వాళ్లకు చాలా మందికి చదువు తక్కువ. కుటుంబ పోషణ కోసం వాహనాలు నడపడం నేర్చుకుంటారు. ఎలా నడిపితే ఏం జరుగుతుందో వాళ్లకంతా అవగాహన ఉండకపోవచ్చు. వాళ్లకు అవగాహన కలిగించాల్సిన బాధ్యత రవాణా శాఖ రవాణా శాఖ ఉన్నతాధికారులదే.

ప్రతిపక్షం
హైదరాబాద్
మంగళవారం
04.11.2025

# అమ్మాళ్ కృషితోనే దేశీయ చెరుకుకు తీపి

**20వ శతాబ్దం ప్రారంభంలో, భారతదేశం చెరకు సాగుచేసినప్పటికీ అది పపువా న్యూ గినియా, ఆగ్నేయాసియాలో పండించే సాచరమ్ అఫిసినారమ్ రకం అంత తీపిగా ఉండకపోవడంతో దేశీయ డిమాండ్‌ను తీర్చడానికి, తియ్యటి చెరకును దిగుమతి చేసుకోవలసి వచ్చేది. చెరకు సాగులో స్వయంసమృద్ధి సాధించేందుకు, బలమైన, అధిక దిగుబడినిచ్చే స్వదేశీ రకాన్ని అభివృద్ధి చేయడానికి బ్రిటిష్ వలస ప్రభుత్వం కోయంబత్తూరులో చెరకు బ్రీడింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించింది. 1930లలో కోయంబత్తూరు ఇనిస్టిట్యూట్‌లో జన్యు శాస్త్రవేత్తగా, జానకి అమ్మాళ్ సైటోజెనెటిక్స్‌లో క్రోమోజోమ్‌లు, కణాలను అధ్యయనం చేయడం ద్వారా దేశీయ చెరకు పంటను బలోపేతం చేయడానికి తన నైపుణ్యాన్ని ఉపయోగించారు.**



యేచన్ చంద్రశేఖర్
8885050822

ఈకే జానకి అమ్మాళ్ ఒక ప్రఖ్యాత భారతీయ వృక్ష శాస్త్రజ్ఞురాలు, మొక్కల సైటాలజిస్ట్. ఆమె జన్యుశాస్త్రం, పరిణామం, ఫైటోజియోగ్రఫీ, ఎథ్నోబోటనీ రంగాలలో గణనీయమైన కృషి చేశారు. దేశీయ చెరకు పరిశ్రమ అభివృద్ధి కోసం ఆమె చేసిన అవిరళ కృషికి గుర్తింపుగా జానకి అమ్మాళ్ ను 'భారతదేశం చెరకును తీపి చేసిన మహిళ' అని అంటారు. ఆమె అభివృద్ధి చేసిన అధిక దిగుబడినిచ్చే చెరకు జాతులు భారతదేశాన్ని దిగుమతిదారు నుండి ప్రధాన ప్రపంచ ఉత్పత్తిదారుగా మార్చాయి. ఈ విజయం దేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద చెరకు ఉత్పత్తిదారుగా అవతరించడానికి పునాది వేసింది. జానకీ అమ్మాళ్ 4 నవంబర్ 1897న కేరళలోని తలస్సేరిలో జన్మించారు.

**విద్య, వృత్తి జీవితం**

తెల్లిచెరిలో పాఠశాల విద్య తర్వాత, ఆమె మద్రాసులో క్వీన్ మేరీస్ కళాశాల నుండి బ్యాచిలర్ డిగ్రీ, 1921లో ప్రెసిడెన్సీ కళాశాల నుండి వృక్షశాస్త్రంలో ఆనర్స్ డిగ్రీ పొందారు. ఆ తర్వాత ఆమె మద్రాస్ వుమెన్స్ క్రిస్టియన్ కాలేజీలో బోధించారు. అమెరికాలోని మిచిగాన్ విశ్వవిద్యాలయం నుండి బార్బర్ స్కాలర్‌గా 1925లో మాస్టర్స్ డిగ్రీని పొంది తరువాత స్వదేశానికి తిరిగి వచ్చి డబ్ల్యూసీసీలో బోధన కొనసాగించారు. 1931లో మొదటి ఓరియంటల్ బార్బర్ ఫెలోగా మళ్లీ మిచిగాన్‌కు వెళ్లి అక్కడ డాక్టరేట్ ఇన్ సైన్స్ పొంది, తిరిగి వచ్చిన తర్వాత, 1932 నుండి 1934 వరకు త్రివేండ్రంలోని మహారాజా కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో వృక్షశాస్త్రం ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1934-1939 వరకు ఆమె కోయంబత్తూరులోని చెరకు పెంపకం సంస్థలో జన్యు శాస్త్రవేత్తగా పనిచేశారు. ఆ తర్వాత ఇంగ్లాండ్‌కు వెళ్లి 1940-45 మధ్యకాలంలో లండన్‌లోని జాన్ ఇన్నెస్ హార్టికల్చరల్ ఇన్‌స్టిట్యూషన్‌లో అసిస్టెంట్ సైటాలజిస్ట్‌గా, 1945-51 మధ్యకాలంలో విస్లీలోని రాయల్ హార్టికల్చరల్ సొసైటీలో సైటాలజిస్ట్‌గా పనిచేశారు. అప్పటి భారత ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియాను పునర్వ్యవస్థీకరించడానికి ప్రత్యేక అధికారిగా ఆహ్వానించిన మీదట ఆమె 1951లో భారతదేశానికి తిరిగి వచ్చారు. బీఎస్ఐ పునర్వ్యవస్థీకరణతో పాటు, అలహాబాద్ సెంట్రల్ బొటానికల్ లాబొరేటరీ అధిపతిగా, జమ్మూకాశ్మీర్ ప్రాంతీయ పరిశోధనా ప్రయోగశాలలో ఓఎస్డీగా కొనసాగారు. ట్రోంబేలోని బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌లో కొంతకాలం పని చేసిన తరువాత నవంబర్ 1970లో మద్రాస్‌లో స్థిరపడ్డారు. మద్రాసు విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీ ఇన్ బోటనీలో ఎమెరిటస్ సైంటిస్ట్‌గా పనిచేశారు. మధురవోయల్‌లోని సెంటర్ ఫీల్డ్ లాబొరేటరీలో పని చేశారు.

**వినూత్న వంగడాలతో అధిక దిగుబడి**

20వ శతాబ్దం ప్రారంభంలో, భారతదేశం చెరకు సాగుచేసినప్పటికీ అది పపువా న్యూ గినియా, ఆగ్నేయాసియాలో పండించే సాచరమ్ అఫిసినారమ్ రకం అంత తీపిగా ఉండకపోవడంతో దేశీయ డిమాండ్‌ను తీర్చడానికి, తియ్యటి చెరకును దిగుమతి చేసుకోవలసి వచ్చేది. చెరకు సాగులో స్వయంసమృద్ధి సాధించేందుకు, బలమైన, అధిక దిగుబడినిచ్చే స్వదేశీ రకాన్ని అభివృద్ధి చేయడానికి బ్రిటిష్ వలస ప్రభుత్వం కోయంబత్తూరులో చెరకు బ్రీడింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించింది. 1930లలో కోయంబత్తూరు ఇనిస్టిట్యూట్‌లో జన్యు శాస్త్రవేత్తగా, జానకి అమ్మాళ్ సైటోజెనెటిక్స్‌లో క్రోమోజోమ్‌లు, కణాలను అధ్యయనం చేయడం ద్వారా దేశీయ చెరకు పంటను బలోపేతం చేయడానికి తన నైపుణ్యాన్ని ఉపయోగించారు. వివిధ జాతుల ప్రజననం (క్రాస్‌బ్రీడింగ్) చేయడం ద్వారా ఆమె అధిక దిగుబడినిచ్చే, తియ్యటి హైబ్రిడ్ చెరకు రకాలను అభివృద్ధి చేశారు. ఎంతో శ్రమకోర్చి క్రాస్ బ్రీడింగ్ ప్రయోగాలు, పాలీప్లాయిడ్ కణాలను మార్చడం ద్వారా, దిగుమతి చేసుకున్న రకాలతో పోల్చదగిన రీతిలో తీపిని పెంచే స్వదేశీ చెరకు సంకర జాతులను ఆమె అభివృద్ధి చేశారు. ఆమె చేపట్టిన జన్యుపర పరిశోధనల ఫలితంగా భారతీయ నేలలలో స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అధిక దిగుబడినిచ్చే మెరుగైన దేశీయ రకాలు అభివృద్ధి చెంది, దిగుమతులను తగ్గించాయి. ఆమె పరిశోధన భారతదేశం అంతటా చెరకు భౌగోళిక పంపిణీని విశ్లేషించడంతో పాటు సచ్చరమ్ స్పాంటేనియం రకం దేశంలో ఉద్భవించడానికి సహాయపడింది.

**చెరకు ఉత్పత్తిలో రెండవ స్థానం**

ప్రపంచ చెరకు ఉత్పత్తిలో ఐదోవంతు సాగు చేస్తూ బ్రెజిల్ తరువాత భారత్ రెండవ స్థానంలో ఉంది. అధిక దిగుబడితో పాటు అత్యంత తీపి కలిగిన చెరకు ఉత్పత్తి చేయగల సామర్థ్యాన్ని సాధించడం, ఖరీదైన దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంలో జానకి అమ్మాళ్ వినూత్న మొక్కల పెంపకం పద్ధతులు, సైటోజెనెటిక్ పరిశోధనల సుదీర్ఘ కృషి ఉంది. ప్రపంచంలోని ప్రముఖ చెరకు ఉత్పత్తిదారులలో ఒకటిగా భారతదేశం ఎదగడానికి ఆమె అంకితభావం చరిత్రలో ఎప్పటికీ నిలిచి ఉంటుంది. భారతదేశంలోని ముఖ్యమైన వాణిజ్య పంటలలో ఒకటిగా ఉండే చెరుకు సాగు ప్రత్యక్షంగా, పరోక్షంగా పది లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తూ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమకు గణనీయ మద్దతు ఇస్తుంది. దేశంలో చెరుకు ప్రధానంగా రెండు ప్రాంతాలలో పండిస్తారు. ఉత్తరప్రదేశ్, బిహార్, హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలోనూ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఎక్కువగా సాగు చేస్తారు.

**పర్యావరణ పరిరక్షణకు మద్దతు**





జానకి అమ్మాళ్ జీవితంలో పశ్చిమ కనుమలతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఇక్కడ కనిపించే దట్టమైన, పొడవైన ఉష్ణమండల సతత హరిత అడవులు దేశంలో పర్యావరణ వారసత్వం పరిణతి చెందిన దశకు ఉదాహరణగా ఆమె భావించేవారు. ఈ సమతుల్యత, స్థిరత్వం ఎలా సాధ్యమయ్యిందో అర్థం చేసుకోవడానికి, సుదీర్ఘ చరిత్రతో పాటు తక్షణ వర్తమానంలో ఈ ప్రాంత ప్రజలు, మొక్కల మధ్య సంబంధాన్ని అధ్యయనం చేసే ఒక గొప్ప, మార్గదర్శక ప్రాజెక్టును చేపట్టారు. తన విస్తృత శాస్త్రీయ నైపుణ్యాన్ని ఉపయోగించి సైటోజెనెటిక్ సర్వేకు నాయకత్వం వహించారు. కేరళ ప్రభుత్వం చేపట్టిన జలవిద్యుత్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడారు. బాల్యం నుండే అనేక సవాళ్లను ఎదుర్కొన్న జానకి అమ్మాళ్ వాటితో దీటుగా పోరాడారు. ఆమె పరిశోధనల ఫలితంగా ఉద్భవించిన ప్రకాశవంత తెల్లని పూరేకులు, ఊదా రంగు కేసరాలు కలిగిన మాగ్నోలియా జాతి పుష్పాలకు 'మాగ్నోలియా కోబస్ జానకి అమ్మాళ్' అని ఆమె పేరు పెట్టారు. ఆమె సేవలకు గౌరవసూచకంగా 1977లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' అవార్డుతో సత్కరించింది. 7 ఫిబ్రవరి 1984న మద్రాసులోనే తన 86 యేండ్ల వయస్సులో తుది శ్వాస విడిచారు.

**(నేడు డాక్టర్ జానకీ అమ్మాళ్ జయంతి)**

(వ్యాస రచయిత భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, తెలంగాణ రాష్ట్ర మాజీ కార్యదర్శి)

# జపాన్ 'ఆహార' విధానాలను ఆచరిద్దాం



సుధాకర్ ఏవీ
9000674747

మనలో చాలా మంది దీర్ఘకాలం పాటు స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యకర జీవితాన్ని గడపాలని కోరుకుంటారు. అయితే, చెడు ఆహారపు అలవాట్లు, ఒత్తిడి, కాలుష్యం వంటి కారణాలతో 60 యేండ్లు నిండకుండానే ఎక్కువ మంది తనువు చాలిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య లెక్కల ప్రకారం భారతీయుల సగటు ఆయుర్దాయం 69.16 సంవత్సరాలు. జపాన్ ప్రజలు మాత్రం ప్రపంచంలోనే అత్యధిక ఆయుర్దాయంతో జీవిస్తున్నారు. ఆ మధ్య జపాన్ వాసి ఒకరు 112 సంవత్సరాల 344 రోజుల వయస్సుతో ప్రపంచంలోనే ఎక్కువ కాలం జీవించిన వ్యక్తిగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. జపాన్‌లో ప్రజల సగటు ఆయుర్దాయం 83.7 సంవత్సరాలుగా ఉంది. ఇది మహిళలకు 86.8 సంవత్సరాలు, పురుషులకు 80.5 సంవత్సరాలుగా ఉంది. జపాన్ ప్రజల జీవన విధానం, ఆహారపు అలవాట్లు, వ్యాయామం, సంస్కృతి, జెనెటిక్స్ దీనికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.

**'హరా హాచ్ బన్ మి'**

ఇది జపాన్‌లో ఒక ప్రసిద్ధి చెందిన సామెత. అంటే, తగిన మోతాదులోనే ఆహారం తినాలని అర్థం. కడుపులో 80 శాతం నిండినంత వరకు మాత్రమే తింటే దీర్ఘాయువు కలిగి ఉంటామని అక్కడి ప్రజలు విశ్వసిస్తారు. అందువల్ల ఎక్కువ ఆహారం తినడం మానేయాలి. అవసరమైన దానికంటే ఎక్కువ తినడం ద్వారా కడుపుపై భారం పెరుగుతుంది. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ పరిశుభ్రత: జపనీయులకు విస్తృతస్థాయి హెల్త్‌కేర్ సిస్టమ్ ఉంది. అక్కడ చిన్న పిల్లలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని తప్పనిసరిగా అమలు చేస్తారు. ఎప్పటికప్పుడు ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకునేందుకు ఆరోగ్య సంస్థలు చక్కగా పనిచేస్తాయి. ఆరోగ్యకర జీవన శైలిని పెంపొందించడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాయి. వీటితో పాటు జపనీయులు అధిక పరిశుభ్రతను పాటిస్తారు. అక్కడి చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం, పర్యావరణ అనుకూల పార్కులు ప్రజలను ఎక్కువ కాలం జీవించేలా చేస్తాయి. జపాన్ ప్రజలు నెమ్మదిగా తినే శైలిని ప్రోత్సహిస్తారు. ఒకే ప్లేట్‌లో కాకుండా, చిన్న చిన్న ప్లేట్లలో లేదా బౌల్స్‌లో తినడానికి ప్రాధాన్యం ఇస్తారు. కుటుంబ సభ్యులంతా ఒకే దగ్గర కలిసి తింటారు. భోజనం చేసే సమయంలో టీవీ చూడటం, సెల్ ఫోన్ వాడటం వంటి వాటికి దూరంగా ఉంటారు. నేలపై కూర్చొనే భోజనం చేయడానికి ప్రాధాన్యమిస్తారు.

**ఎలాంటి ఆహారాన్ని తీసుకుంటారు.**

జపనీస్ ప్రజలు సమతుల ఆహారాన్ని తీసుకుంటారు. పండ్లు, ఒమేగా ఫాటీ ఆమ్లాలు అధికంగా ఉండే చేపలు,



బియ్యం, తృణధాన్యాలు, టోఫు, సోయా, మిసో, ఆకుపచ్చ కూరగాయలు ఎక్కువగా తీసుకుంటారు. ఈ ఆహారాలన్నీ తక్కువ మొత్తంలో కొవ్వులు, చక్కెరలను కలిగి ఉంటాయి. వీటిలో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా లభిస్తాయి. తద్వారా కాన్సర్, గుండె జబ్బుల నుంచి బయటపడొచ్చు. ఈ ఆహారం కారణంగానే జపాన్‌లో ఊబకాయం రేటు చాలా తక్కువగా ఉందని చెప్పవచ్చు. జపనీస్ ప్రజలు టీ తాగడాన్ని ఇష్టపడతారు. అది వారి సంస్కృతిలో భాగంగా భావిస్తారు. జపాన్ ద్వీప సమూహంలో మాచా టీ చాలా ప్రాచుర్యం పొందింది. టీ తయారీలో ఉపయోగించే టీ ఆకులు అధిక పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. తద్వారా ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు కాన్సర్‌తో పోరాడే శక్తినిస్తాయి.

**నడవడానికి ప్రాధాన్యం**

జపాన్ ప్రజలు నిశ్చల జీవనశైలిని ద్వేషిస్తారు. యువకుల నుంచి వృద్ధుల వరకు నడవడానికే ఇష్టపడతారు. కుర్చీలు, సోఫాల కంటే నేలపై కూర్చోవడానికే ప్రాధాన్యమిస్తారు. తద్వారా ఇది ప్రేగులకు, కండరాలకు ఆరోగ్యాన్ని చేకూర్చుతుంది. విద్యార్థులు, ఉద్యోగులు సమీపంలోని రైల్వే స్టేషన్‌కు నడవడం లేదా సైక్లింగ్ చేయడం వంటివి చేస్తారు. ఇవన్నీ వారి ఆయుర్దాయం పెరగడానికి దోహదం చేస్తాయి. ఇతర దేశాలలా జపాన్ ప్రజలు వయసు పైబడిన తమ కుటుంబ సభ్యులను ఓల్డ్ ఏజ్ హోమ్‌లకు పంపించరు. కుటుంబ సభ్యుల సంరక్షణ బాధ్యతను చూసుకోవడం అక్కడి వారి సాంప్రదాయం. వృద్ధాప్యంలో కుటుంబంతో కలిసి జీవిస్తే మానసికంగా అనేక ప్రయోజనాలు ఉంటాయని, సంతోషంగా జీవిస్తారని వారు నమ్ముతారు. జపనీయులు 'ఇకిగై' అనే సిద్ధాంతంతో జీవిస్తారు. ఆనందంతో జీవించాలని ఈ పురాతన తత్వశాస్త్రం బోధిస్తుంది. ఎందుకు జీవిస్తున్నామనే దానిపై వారు స్పష్టతతో ఉంటారు. జీవితానికి లక్ష్యాన్ని ఏర్పర్చుకోవడం, ఇతరులకు సహాయం చేయడం, సమతుల ఆహారాన్ని తీసుకోవడం, స్నేహితులు, కుటుంబ సభ్యులతో ప్రేమతో కలిసి ఉండటం వంటి అంశాలు వారి ఆయుర్దాయాన్ని రెట్టింపు చేస్తాయి.

(వ్యాస రచయిత స్టేట్ టీచర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి)

# రోడ్డు నియమం ప్రాణాల రుణం



ముహమ్మద్ ముజాహిద్
9640622076

ఈ ఉదయం మీరు ఇంటి నుండి బయలుదేరారు. మీ కోసం ఆశగా ఎదురుచూసేవారు ఒకరు ఉన్నారు. అది తల్లి కావచ్చు, జీవిత భాగస్వామి కావచ్చు, అల్లరి చేసే పిల్లలు కావచ్చు. కానీ, నిన్న రోడ్డుపై జరిగిన ఒక ప్రమాదం. ఈ రోజు మీరు తిరిగి ఇంటికి చేరుకుంటారనే హామీని ఎక్కడో ప్రశ్నార్థకం చేసింది. ఈ రోజులలో వార్తా పత్రికలు కేవలం కాగితాలు కాదు, అవి రక్తపు అక్షరాలతో రాసిన విషాద గాథలు! ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, నిస్సారమైన తొందరపాటు. ఇవి మనల్ని కేవలం నేరస్తులను మాత్రమే కాదు, మన ప్రియమైనవారికి ద్రోహులుగా మారుస్తున్నాయి.

**ఆ కన్నీటి లెక్క ఎవరిది?**

చట్టాలు, ప్రభుత్వాలు, ట్రాఫిక్ పోలీసుల గురించి మాట్లాడటం ఆపండి. మీ కారు వేగాన్ని నియంత్రించేది మీ కుడి కాలు మాత్రమే కాదు, మీ హృదయం కూడా వేగంగా వెళ్లడానికి మీరు ఎంత తహతహలాడుతున్నారంటే, ఆ చివరి సెకన్లలో మీరు చేరుకోవాలనుకుంటున్న లక్ష్యం, మీ కోసం ఇంటి వద్ద ఎదురుచూస్తున్న నవ్వుల కంటే ముఖ్యమైనదా? ఆ అతివేగం, ఆ దుందుడుకు స్వభావం కారణంగా జరిగే ఒక్క ప్రమాదం. అది ఆగిపోయేది కేవలం ఒక గుండె చప్పుడు మాత్రమే కాదు. అనాథలయ్యే బిడ్డల భవిష్యత్తు, ఒంటరిగా మిగిలిపోయే జీవిత భాగస్వామి ఆశలు, కడుపుకోతతో కుమిలిపోయే తల్లిదండ్రుల జీవితాలు. ఆ లెక్కను ఏ చట్టం కట్టగలదు? ఏ జరిమానా దాన్ని పూరించగలదు?

**ధర్మం నేర్పిన 'వినయం'**

మన ధార్మిక గ్రంథాలు ఆత్మ రక్షణ గురించి మాత్రమే కాదు, ఈ శరీరం, ఈ జీవితం ఎంత పవిత్రమైనవో బోధిస్తున్నాయి. దైవం మనకు ఇచ్చిన ఈ ప్రాణం, సంపద మన సొంతం కాదు, వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. ట్రాఫిక్ నియమాలు ఈ ప్రాణ రక్షణ అనే పవిత్ర ధార్మిక బాధ్యతలో భాగమే. మరి, రోడ్డుపై ఆ అహంకారం ఎందుకు? 'నా కారు ముందు ఉండాలి! నేను తప్పించుకోవాలి!' అనే ఆ దురహంకారం మన కళ్లకు కట్టిన పొర కాదా? 'భూమిపై అహంకారంతో నడవకు' అని అంటుంది ఖురాన్. మీరు మీ కారులో ఉన్నప్పుడు మరొకరి కంటే గొప్పగా భావించడం, అనవసరంగా హారన్ మోగించి వారిని బెదిరించడం, ఇది పొగరు కాదా? నిజమైన విశ్వాసి లక్షణం ఏమిటంటే, వినయంతో ఉండటం. మీ కంటే వెనుక ఉన్నా, వేగంగా వెళ్లాలనుకుంటున్న వ్యక్తికి దారి ఇవ్వడం. అది మీ ఔదార్యం (త్యాగం)! అహం అడ్డుపడినప్పుడు, గుర్తుంచుకోండి. మీరు మీ మనస్సు ముందు ఓడిపోతున్నారు.

**శాంతం శక్తి**

రోడ్డుపై అత్యంత కఠినమైన పరీక్ష ఎదురైనప్పుడు, అంటే, ఓ అజ్ఞాని, తప్పు చేసి మిమ్మల్ని నిందించినప్పుడు. ఆ క్షణం, మన ఉడుకు రక్తం పగ తీర్చుకోవాలని ప్రేరేపిస్తుంది. కానీ, ఇక్కడే మన ధర్మం నిజమైన బలం కనిపిస్తుంది. 'వారు అజ్ఞానులు మాట్లాడినప్పుడు, శాంతి (సలాం) చెప్పి, ముందుకు సాగిపోతారు' మీరు కోపాన్ని నియంత్రించుకొని, శాంతంగా ఉండిపోవడం అనేది ఆ వ్యక్తికి భయపడటం కాదు. అది మీ హృదయంలోని దైవ భయానికి నిదర్శనం. ఒక చిన్న సహనం, ఘర్షణను ఆపుతుంది. రక్తపాతాన్ని నివారిస్తుంది. మీరు ఆ క్షణం సహనం చూపితే, మీరు కేవలం ట్రాఫిక్‌ను కాపాడటం లేదు, ఆ వ్యక్తిని, మిమ్మల్ని, ఆ ప్రాంతంలోని శాంతిని కాపాడుతున్నారు!





**మీ ఇల్లు మీ గమ్యం**

దయచేసి గుర్తుంచుకోండి, మీ గమ్యం ఆ ఫ్లైఓవర్ కాదు, ఆఫీస్ డెస్క్ కాదు, మీరు వేగంగా చేరుకోవాలనుకుంటున్న షాప్ కాదు. నిజమైన గమ్యం, కుటుంబసభ్యులందరూ సురక్షితంగా ఉన్న మీ ఇల్లు మాత్రమే. మీరు వేగాన్ని తగ్గిస్తే, మీరు జీవితాన్ని పొడిగిస్తున్నారని అర్థం. మీరు హారన్ మోగించడం ఆపితే, మీరు ప్రేమను పంచుతున్నారని అర్థం. మీరు నియమాన్ని పాటిస్తే, మీరు మీ ప్రియమైనవారికి ఇచ్చిన రుణం చెల్లిస్తున్నారని అర్థం. ఈ క్షణం నుండి, వాహనం నడిపే విధానాన్ని మార్చుకోండి. అది కేవలం చట్టాన్ని కాపాడటం కాదు, మీ హృదయాన్ని, మానవత్వాన్ని కాపాడటం అవుతుంది. దారిలో సహనంతో, వినయంతో ప్రయాణించండి. ఎందుకంటే, మీ జీవితం మీకు మాత్రమే కాదు, మీ కోసం ఆశగా ఎదురుచూస్తున్న ఆ ముఖాలకు కూడా చెందింది. రోడ్డు నియమం ప్రాణాల రుణం! ఒక చిన్న నిర్లక్ష్యం ఒక జీవితకాలపు కన్నీళ్లు! మన గమ్యం ప్రేమ వైపు, వేగం వైపు కాదు!!

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్)

**రచయితలకు మనవి**

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

**రచనలు పంపాల్సిన చిరునామా**

ppbahula@gmail.com



# తెలతెలవారుతుండగానే
# తెల్లారిన బతుకులు

మొదటిపేజీ తరువాయి

కంకర బస్సు ప్రయాణికుల మీద పడి వారికి ఊపిరి ఆగకుండా చేసిందంటూ' బోరున విలపించారు. టిప్పర్ ప్రమాదంపై బస్సు కండక్టర్ రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేశారు. టిప్పర్ డ్రైవర్ ఆకాశ్‌పై బీఎన్ఎస్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు

**ప్రధాని, ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి**

చేవెళ్ల ఘోర రోడ్డు ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలతెల వారకముందే ప్రమాదం జరగడం, ప్రమాదంలో భారీ ఎత్తున ప్రయాణికులు మృతిచెందడంపై తీవ్ర సంతాపం తెలిపారు. కలెక్టర్, ఎస్పీతో పాటు అందుబాటులో ఉన్న మంత్రులు సంఘటనా స్థలానికి వెళ్లాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. సీఎస్ రామకృష్ణారావు సచివాలయంలో సమాచారం తెలుసుకునేందుకు ఎమర్జెన్సీ నెంబర్ ప్రకటించారు. ఈ ప్రమాదం ఓ కుటుంబంలో తీరని శోకాన్ని నింపింది. చేతికొచ్చిన ఆడపిల్లలకు ఘనంగా వివాహం చేసి అత్తారింటికి పంపించి, వారు సుఖంగా జీవించాలనుకున్నారు. జీవితంలో ఎంతో ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఆశించిన తల్లిదండ్రులకు నిరాశే మిగిలింది. కలలో కూడా ఊహించని విషాదం వారి కుటుంబాన్ని తీవ్రంగా కబళించింది. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం గాంధీనగర్ ప్రాంతానికి చెందిన ఎల్లయ్య గౌడ్ కు ముగ్గురు కుమార్తెలు తనూష, సాయిప్రియ, నందిని ప్రమాదంలో మృతి చెందారు. నగరంలోని కోఠి వుమెన్స్ కాలేజీలో చదువుతున్న ఆ ముగ్గురు అక్కాచెల్లెళ్లు, గత నెల 15న జరిగిన ఓ పెళ్లి వేడుకలో ఆనందంగా గడిపారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులతో పాటు బంధువులు ఘటనా స్థలికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఎల్లయ్య గౌడ్ డ్రైవర్‌గా కష్టపడుతూ తన పిల్లలను చదివిస్తున్నారు. ఆయనకు నలుగురు కుమార్తెలు కాగా, పెద్ద కుమార్తెకు ఇప్పటికే వివాహం చేశారు. మిగిలిన ముగ్గురు కుమార్తెలు బస్సు ప్రమాదంలో విగత జీవులుగా మారడంతో ఆ కుటుంబం, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

**స్నేహితుల ఆవేదన.**

కోఠి ఉమెన్స్ కాలేజీలోనే డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న సాయిప్రియతో పాటు అదే కళాశాలలో చదువుతున్న ముస్కాన్ అనే యువతి కూడా బస్సు ప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయింది. ఇద్దరు స్నేహితులు ఒకే బస్సు ప్రమాదంలో చనిపోవడంతో మిత్రులు తట్టుకోలేక శోకసంద్రంలో మునిగిపోయారు. ఇద్దరూ కళాశాల విద్యార్థినులకు ఆత్మరక్షణకు తైక్వాండో యుద్ధ విద్యను నేర్పేవారంటూ చెబుతూ కన్నీటి పర్యంతమయ్యారు. యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన అఖిలారెడ్డి అనే యువతి కూడా ఈ బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఎంబీఏ చదువుతున్న కుమార్తె మృతితో ఆమె తల్లి, కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. తమ కుమార్తె ఇక లేదనే విషయం తెలిసి వారి రోదన ఆకాశాన్ని అంటింది.

**అనాథలుగా మారిన ఇద్దరు చిన్నారులు**

బస్సు ప్రమాదం ఇద్దరు చిన్నారులను అనాథలుగా మార్చింది. వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం హాజీపూర్‌కు చెందిన బందప్ప, ఆయన భార్య లక్ష్మీదంపతులు బస్సు దుర్ఘటనలో ప్రాణాలు విడిచారు. తల్లిందండ్రుల మరణంతో అనాథలుగా మారిన చిన్నారులు భవానీ, శివలీల ప్రాణాలతో బయటపడ్డారు. ఘటనస్థలిలో నిర్జీవంగా పడివున్న తమ తల్లిదండ్రులను చూసుకుంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. తల్లికి ఆస్పత్రిలో చికిత్స చేయించేందుకు హైదరాబాద్ వెళ్తుండగా చనిపోయారంటూ ఇద్దరు అక్కా చెల్లెళ్లు బోరుమన్నారు. ఆ చిన్నారులను చూసి అక్కడున్న వారి కన్నీటి పర్యంతమయ్యారు. ఈ దుర్ఘటనలో తాండూరుకే చెందిన తాలియా బేగం అనే మహిళ ఆమె పదినెలల కూమార్తె కూడా ప్రాణాలు కోల్పోయారు.



## ప్రమాదం జరిగిందిలా

తాండూరు డిపోకు చెందిన ఎక్స్ ప్రెస్ బస్సు హైదరాబాద్ కు బయలుదేరింది. ఎక్స్ ప్రెస్ బస్సే అయినప్పటికీ పల్లె వెలుగు పేరిట నడపడం, ప్రతి స్టాపులో ఆపుతు రావటంతో విద్యార్థులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో ఎక్కారు. కంకర్ లోడుతో వెళ్తున్న టిప్పర్ మీర్జాగూడ టర్నింగ్ పాయింట్ లో స్పీడును కంట్రోల్ చేయలేకపోవడంతో అదుపుతప్పి బస్సును ఢీ కొట్టింది. ఫస్ట్ ట్రిప్ కావడంతో బస్సులో 72 మంది ప్రయాణికులు ఎక్కారు. బస్సు మిర్జాగూడ మలుపునకు చేరుకోగానే చేవెళ్ల నుండి మన్నెగూడ వైపు వెళుతున్న టిప్పర్ వేగంగా ఢీకొట్టడంతో బస్సు ముందు సగ భాగం ఒకవైపు పూర్తిగా ధ్వంసమయ్యింది. బస్సు, టిప్పర్ డ్రైవర్లు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. కంకరలో కూర్చుకుపోయిన క్షతగాత్రులను బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలం వద్ద దృశ్యాలు హృదయవిధారకంగా కనిపించాయి. తమను కాపాడాలంటూ కంకరలో కూరుకుపోయినవాళ్లు వేడుకోవడం, కొందరు అచేతనంగా పడి ఉండటం కలిచివేసింది. ఆదివారం సెలవు కావడంతో సిటీ నుంచి వెళ్లినవాళ్లు తిరుగు పయనమయ్యారు. మృతులలో పది మంది మహిళలు, ఒక చిన్నారి ఉన్నారు. జేసీబీ సహాయంతో కంకరను పూర్తిగా తొలగించి 15 మంది ప్రయాణికులను కాపాడారు. ఈ ప్రమాదంతో చేవెళ్ల -వికారాబాద్ బీజాపూర్ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అధికారులు, పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

మృతుల కుటుంబీకుల రోదనలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది.

**మృతుల కుటుంబాలకు రూ.7 లక్షల పరిహారం**

ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ. ఐదు లక్షలు, ఆర్టీసీ మరో రూ. రుండు లక్షల పరిహారం ప్రకటించాయి. అయితే, ఈ దుర్ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చలించిపోయారు. కేంద్ర ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు రూ. రెండు లక్షల పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి 5 వేల పరిహారంతో పాటు ఉచితంగా వైద్య సహాయం అందించనున్నట్లు రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి డి. శ్రీధర్ బాబు తెలిపారు. బస్సు సంఘటన స్థలాన్ని శ్రీధర్ బాబుతో పాటు మంత్రి పొన్నం పరిశీలించారు.

**రాజకీయ నాయకులకు నిరసన సెగ**

చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రాజకీయ నాయకులను మృతుల కుటుంబ సభ్యులు నిలదీశారు. ప్రభుత్వ ఆసుపత్రికి ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య చేరుకున్నారు. దీంతో వారిని చూసిన మృతుల కుటుంబసభ్యులు ఒక్కసారిగా ఆగ్రహానికి గురయ్యారు. రోడ్డు నిర్మాణ పనులు ఎందుకు ఆలస్యం చేశారని మండిపడ్డారు. నిత్యం ఈ మార్గంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, రోహిత్ రెడ్డికి కూడా నిరసన సెగ తగిలింది. మీర్జాగూడ బస్సు ప్రమాదం ఘటన స్థలంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. బస్సును ఇక్కడ నుంచి తొలగించవద్దని మండిపడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యపై స్థానికులు రాళ్లు విసిరే ప్రయత్నం చేశారు. 'ఎమ్మెల్యే డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. దీంతో ఎమ్మెల్యే తన కారు ఎక్కి సంఘటనా స్థలం నుంచి వెళ్లిపోయారు.

**ప్రమాదంపై కేటీఆర్ దిగ్భ్రాంతి**

ఘోర రోడ్డు ప్రమాదంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తాండూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొన్న ఈ దుర్ఘటనలో 19 మంది ప్రయాణికులు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడటం పట్ల ఆయన సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సాయం అందించాలని, మృతుల కుటుంబాలను, గాయపడిన వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

**రంగారెడ్డి జిల్లా మీర్జాగూడలో జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో 19 మంది మృతి చెందడం స్థానికులను కలచివేసింది. మృతుల్లో అందులో 15 నెలల పాప కూడా ఉంది. తల్లి, బిడ్డ మృతదేహాలను బస్సులో నుంచి బయటకు తీసి రోడ్డుపై ఉంచిన తీరు కన్నీరు తెప్పించింది. ప్రమాద సమయంలో టిప్పర్ మితిమీరిన వేగంతో వెళ్లినట్లు సమాచారం. ఘటనాస్థలం వద్ద ప్రయాణికుల ఆర్తనాదాలతో భీతావహ వాతావరణం నెలకొంది.**







## చేవెళ్ల దుర్ఘటన అత్యంత బాధాకరం

- స్పీకర్ ప్రసాదరావు తీవ్ర సంతాపం

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 3** : చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాద సంఘటన స్థలాన్ని స్పీకర్, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ పరిశీలించారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, శాసనసభ్యులు కాలే యాదయ్య, రాంమోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, కుమార్తె గడ్డం శ్రీ అనన్య ఆయనతో పాటు ఉన్నారు. అధికారులను అడిగి దుర్ఘటన వివరాలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా స్పీకర్ మీడియాతో మాట్లాడుతూ ప్రమాదంలో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని అన్నారు. పోలీసు అకాడమీ నుండి మన్నెగూడ వరకు ఉన్న జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసి, టెండర్ ప్రాసెస్ పూర్తి చేసినా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం కారణంగానే రోడ్డు విస్తరణ జరుగలేదని ఆరోపించారు. ఈ రోడ్డు పనులు ప్రారంభించాలని తాను రెండు సార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. ప్రకృతి ప్రేమికులు చెట్లను తొలగించవద్దంటూ గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు వేయడంతో పనులు ఆలస్యం అయ్యాయన్నారు.



## టిప్పర్ రాంగ్ రూట్‌రావడంతోనే ప్రమాదం

- బాధిత కుటుంబాలను సర్కారు ఆదుకుంటుంది
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 3** : రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రంగారెడ్డి కలెక్టర్, ఆర్టీసీ ఎండీతో ఫోన్‌లో మాట్లాడారు. గాయపడినవారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. కంకర టిప్పర్‌రాంగ్‌రూట్‌లో వచ్చి బస్సును ఢీకొట్టిందని అధికారులు తెలిపారని చెప్పారు. ఆర్టీసీ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలికి వెళ్లాలని ఆదేశించారు. ఘటనపై విచారణకు ఆదేశించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. 72 మంది ప్రయాణికులతో బస్సు వస్తుండగా కంకర టిప్పర్ ఢీకొట్టిందన్నారు. చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో క్షతగాత్రులను మంత్రి పరామర్శించారు. రహదారిపై ఉన్న గుంతను తప్పించబోయి లారీ బస్సును ఢీకొట్టిందని, ఈ ఘోర ప్రమాదంలో 19 మంది మృతిచెందారు. సహాయక చర్యలలో పాల్గొన్న చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్‌కు గాయాలయ్యాయి. కండక్టర్ రాధకు స్వల్ప గాయాలయ్యాయి. టిప్పర్ డ్రైవర్ మహారాష్ట్రకు చెందిన కమలే ఆకాశ్‌గా పోలీసులు గుర్తించారు. పటాన్‌చెరులోని క్రషర్ మిల్లు నుంచి వికారాబాద్‌కు కంకర సరఫరా చేసేవారు.

## రోడ్డు ప్రమాదంపై టీజీఎస్ ఆర్టీసీ దిగ్భ్రాంతి

- టిప్పర్ అతి వేగమే కారణమని వెల్లడి
- ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించిన అధికారులు



**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 3** : చేవెళ్ల సమీపంలోని ఇందిరారెడ్డి నగర్ వద్ద సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు దుర్ఘటనపై టీజీఎస్ ఆర్టీసీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఈ సంఘటన దురదృష్టకరమైనదిగా పేర్కొంది. ప్రాణాలు కోల్పోయిన 19 మందికి సంతాపం తెలియజేసింది. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించింది టిప్పర్ అతి వేగంగా ఢీ కొట్టడంతో బస్సు ముందు భాగంతో పాటు ఎడమవైపు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కంకర ప్రయాణికులపై పడటంతో ఊపిరాడక ఎక్కువ మంది ప్రయాణికులతో పాటు బస్సు డ్రైవర్ దస్తగిరి చనిపోయారు. గాయపడినవారిని హుటాహుటిన అక్కడి సమీపంలో చేవెళ్లలోని పట్నం మహేందర్ రెడ్డి ఆసుపత్రికి, వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన జరిగిన వెంటనే ఆర్టీసీ యాజమాన్యం స్పందించి, సమీపంలోని డిపో మేనేజర్లను అప్రమత్తం చేసింది. తాండూరు, వికారాబాద్, పరిగి డిపో మేనేజర్లు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సంస్థ ఎండీ వై.నాగిరెడ్డి, హైదరాబాద్ జోన్ ఈడీ ఖుష్రో షా ఖాన్, ఇన్చార్జి ఈడీ (ఆపరేషన్స్) శ్రీధర్, రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత, తదితర సీనియర్ అధికారులు అక్కడికి విచ్చేసి సహాయక చర్యలను ముమ్మరం చేశారు. గాయపడిన 25 మందికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

## ప్రతీది రాజకీయం చేయడమేనా?

- విపక్షాలపై మంత్రి శ్రీధర్‌బాబు మండిపాటు
- 18 నెలలలో విస్తరణ పనులు పూర్తి చేస్తాం



**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 3** : ప్రతి దానికి రాజకీయాలు చేయడం ప్రతిపక్షాలకు బాగా అలవాటుగా మారిందని మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగితే, దాన్ని కూడా రాజకీయం చేయడం సరికాదని అన్నారు. దాన్ని వారి విచక్షణకే వదిలేస్తున్నానన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతల తీరు సరిగా లేదన్నారు. రోడ్డు విస్తరణ పనులలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అలసత్వం లేదిని, వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. ఈ పనులను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు వేసి అడ్డుకున్నారని మంత్రి వివరించారు. ఆ విషయం తెలిసి కూడా తమపై కావాలనే బురద జల్లుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాదనలను ట్రిబ్యునల్ ముందు సమర్థవంతంగా వినిపించడంతో తాజాగా ప్రభుత్వానికి అనుకూలంగా నిర్ణయం వచ్చిందన్నారు. దీంతో ఈ రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టామని, 18 నెలలలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని శ్రీధర బాబు తెలిపారు.



వారసత్వ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి ముప్పు. భారత రాజకీయాలు కుటుంబ వ్యాపారాలుగా మారాయి. దశాబ్దాలుగా ఒకే ఫ్యామిలీ ఆధిపత్యం చెలాయిస్తోంది. నెహ్రూ-గాంధీ డైనస్టీ ప్రభావం స్వతంత్ర పోరాటంతో ముడిపడి ఉంది. కానీ రాజకీయ నాయకత్వం జన్మహక్కు అనే ఆలోచన పాతుకుపోయేలా చేసింది.

- కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్

ప్రాంతీయం



## కాటన్ మిల్లు ముందు పత్తి రైతుల ధర్నా

**ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 3:** పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ... చిట్యాల మండలం పెద్ద కాపర్తి, కావేరి కాటన్ మిల్లు ముందు సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సోమవారం సాయంత్రం నుండి రాత్రి వరకు పత్తి రైతులు ఆందోళన చేపట్టారు. సీసీఐ కొనుగోలు చేసే పత్తి తేమ శాతం ఎక్కువ గా ఉన్నదనే సాకుతో కొనుగోళ్లు నిలిపివేయడంతో రైతులు ఆగ్రహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ మాట్లాడుతూ... ఇప్పటికే అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను సీసీఐ కొర్రీలు పెడుతూ ఇబ్బందులకు గురి చేయడం సరైనది కాదని అన్నారు. సీసీఐ అధికారులు మిల్లు యాజమాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రైతు సంఘం నాయకులు అయితరాజు నరసింహ, మెట్టు నరసింహ, లోడే రాములు, శ్రీను, పొలిమేర శేఖర్, గట్టయ్య, కట్ట సైదులు, స్వామి తదితరులు పాల్గొన్నారు.



## శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- ఎస్పీ శరత్ చంద్ర పవర్

**ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 3:** చిట్యాల పట్టణంలోని హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై రైల్వే బ్రిడ్జి వద్ద నీటి నిలువతో తరచుగా ట్రాఫిక్ జామ్ అవుతున్నందున అక్కడి పరిస్థితిని సోమవారం నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవర్ పరిశీలించారు. వర్షపు నీరు నిలువకుండా ఎప్పటికప్పుడు వెళ్లే విధంగా శాశ్వత చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తిరిగి ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని నేషనల్ హైవే అథారిటీ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, సీఐ నాగరాజు, ఎస్సై మామిడి రవికుమార్ ఉన్నారు.



## ఉద్యోగికి పదవి విరమణ అనేది సహజం

**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 3 :** హోమ్ గార్డ్ సుదర్శనం రిటైర్మెంట్ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో సుదర్శనం హోమ్ గార్డ్ ను ఎస్పీ ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గడిచిన 42 సంవత్సరాలుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ విధులు నిర్వహించి, జిల్లా పోలీసు శాఖకు ఉత్తమ సేవలను అందించడం జరిగిందని అన్నారు. రిటైర్మెంట్ అనంతరం పోలీసు శాఖ తరపున అతనికి, అతని కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ, సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ నరేందర్, ఆర్.ఐ. డానియెల్ మరియు రిటైర్డ్ అవుతున్న సుదర్శనం కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## హంగిర్గా (బి) రైతులకు న్యాయం చేయాలి

**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 3 :** హంగిర్గా (బి) రైతులకు న్యాయం చేయాలని, ఫ్యాక్టరీ పెట్టకపోతే రైతుల భూములు తిరిగి రైతులకు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు. సోమవారం రోజు హంగిర్గా (బి) రైతులు సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ లో అడిషనల్ కలెక్టర్ మాధురి కి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్ మాట్లాడుతూ నారాయణఖేడ్ మండలం హంగిర్గా (బి) గ్రామ 35 మంది రైతుల నుండి 140 ఎకరాల భూమిని 2006 సంవత్సరంలో కొంతమంది స్థానికేతరులు ఫ్యాక్టరీ పెట్టి పర్మినెంట్ ఉద్యోగాలు ఇస్తామని నమ్మించి కొనుగోలు చేశారని అన్నారు. ఉద్యోగాలు వస్తాయని ఆశతో తక్కువ ధరకు ఎకరాకు 15000 నుండి 25 వేల వరకు అమ్మినారా అని అన్నారు. భూమి కొనుగోలు చేసి 20 ఏళ్ల అయినా ఫ్యాక్టరీ పెట్ట లేదు ఉద్యోగాలు ఇవ్వలేదని రైతులే భూములు సాగు చేసుకుంటున్నారని అన్నారు. ఇటీవల వేరే వాళ్ళు భూములోకి వచ్చి సర్వే పేరుతో కబ్జా చేయాలని చూస్తున్నారని అన్నారు. ప్రస్తుతం భూముల రేట్లు రెక్కలు రావడంతో ఎకరా భూమి 25 లక్షల నుండి 50 లక్షల వరకు రెటు పలకడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాలకు పూనుకుంటున్నారని అన్నారు. హంగిర్గా (బి) భూతందపై ఉన్నత రెవెన్యూ అధికారులతో సమగ్ర విచారణ జరపాలని సిపిఎం డిమాండ్ చేస్తుందని అన్నారు. ఫ్యాక్టరీ కోసం కొన్న భూముల్లో ఫ్యాక్టరీ నిర్మించి ఉద్యోగాలు ఇవ్వాలని, లేనిపక్షంలో రైతుల భూములు రైతులకే తిరిగి ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తుంది అని అన్నారు. హంగిర్గా (బి) రైతులకు న్యాయం జరిగే వరకు సిపిఎం ఎర్రజెండా అండగా ఉంటుందని అన్నారు. పోరాటంతోనే న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బాబుశెట్టి శ్రీకాంత్ అంజిరెడ్డి చాంద్ సాబ్ మారుతి భీమ నాయక్ బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.





### రాష్ట్రానికే ఆదర్శవంతంగా

## కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ కాలనీ

- విద్య, వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్య సౌకర్యాల కల్పనకు మొదటి ప్రాధాన్యమిస్తుంది
- సంక్రాంతి నాటికి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభం
- దామోదర్ రాజనర్సింహ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి

**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 3 :** కొల్లూరు కాలనీని తెలంగాణ రాష్ట్రంలోని ఆదర్శవంతమైన కాలనీగా రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అధ్యక్షతన కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ కాలనీలో విఎస్ టి కంపెనీ కి చెందిన సిఎస్ఆర్ నిధులు రూ.8 కోట్లతో నిర్మించనున్న 60 గదుల పాఠశాల, డైనింగ్ హాల్, అంగన్వాడి కేంద్రం నిర్మాణం పనులకు రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, గృహ నిర్మాణ సంస్థ ఎండి గౌతమ్ ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భముగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌరసంబందాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కొల్లూరులోని డబుల్ బెడ్ రూమ్ కాలనీ భవిష్యత్తులో ఎంతగానో అభివృద్ధి చెందే అవకాశం ఉందని అన్నారు. సుమారు 15 వేల కుటుంబాలకు చెందిన లక్షమంది ప్రజలు డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నివాస ఉండేందుకు విలుగా కాలనీలో అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తున్నది అన్నారు. కాలనీలో ప్రహరీ గోడ నిర్మాణం క్రీడా మైదానం ఏర్పాటుకు త్వరలో చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కాలనీ నుండి నాంపల్లి,చార్మినార్, హైదరాబాద్ వైపు బస్సులు సౌకర్యం లేదని కాలనీవాసులు తెలపడంతో నాలుగు రోజుల్లో బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం పనిచేస్తున్నదని అన్నారు. ప్రత్యేక కమ్యూనిటీలకు చెందిన కుటుంబాల చెందిన సుమారు లక్ష మంది ప్రజలు కాలనీలో నివాసం ఉంటున్నారని కాలనీలో నివాసం ఉండే వారికి విద్య వైద్య పరంగా అన్ని రకాల సేవలు అందేలా చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి హామీ ఇచ్చారు. డబుల్ బెడ్ రూమ్ కాలనీలో ఇల్లు మంజూరు అయిన లబ్ధిదారులు తొందరపడి తమ ఇండ్లను అమ్ముకోవద్దని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండి గౌతమ్ అన్నారు. కాలనీలో ప్రభుత్వపరంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని కోట్ల రూపాయలైనా ఖర్చు చేయడానికి వెనుకడుగు వేయడం లేదన్నారు. కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ కాలనీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందడానికి పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు రాష్ట్ర మంత్రులు సహకారంతో కాలనీ అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీ లో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ పి ప్రావీణ్య లతో కలిసి పరిశీలించారు. ఈకార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



## హరీష్ ను పరామర్శించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 3 :** మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మరణించడంతో హైదరాబాద్ లోని వారి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఇలాంటి కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని, సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్ భూపాల్ రెడ్డి కట్ట బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



## పటాన్ చెరు పెద్దాసుపత్రి నాణ్యమైన సేవలకు చిరునామా

- ప్రతి వైద్యుడు సేవా దృక్పథంతో పనిచేయాలి
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 3 :** ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరెందిన పటాన్ చెరు పట్టణంలో టంగుటూరి అంజయ్య ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నాణ్యమైన సేవలకు చిరునామాగా నిలుస్తోందని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆసుపత్రిని ఆధునిక సౌకర్యాలతో ఆధునికరించడంతో పాటు, రోగులకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని తెలిపారు. సోమవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. రోగులను అడిగి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి అత్యధిక శాతం నిరుపేదలే వైద్యం కోసం వస్తున్నారని సేవా దృక్పథంతో వైద్యం అందిస్తూ వారి మన్ననలు పొందాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రి వైద్యులు సిబ్బంది అందించిన సేవల మూలంగానే కేంద్ర ఆరోగ్య శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో పటాన్చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి నాణ్యమైన సేవల విభాగంలో జాతీయస్థాయిలో ఏడవ స్థానం లభించిందని తెలిపారు. ఇదే దృక్పథంతో మరిన్ని అవార్డులను సాధించాలని కోరారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నెలకొన్న పలు సమస్యలను సూపరిండెంట్ చంద్రశేఖర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మరమ్మత్తులకు గురైన ఆక్సిజన్ ప్లాంట్లను వెంటనే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రిలో పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్ ద్వారా ప్రతి నెల 33 మంది రోగులు చికిత్స పొందుతున్నారని తెలిపారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులను నియమించాలని కోరుతూ అతి త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞాపన చేయనున్నట్లు తెలిపారు. అతి త్వరలో మరో అంబులెన్స్ కొనుగోలుకు నిధులు కేటాయిస్తానని తెలిపారు.ఈ సమావేశంలో ఆస్పత్రి సూపరిండెంట్ చంద్రశేఖర్, ఆర్ఎంవో ప్రవీణ, ఆస్పత్రి సలహా సంఘం సభ్యులు రాములు గౌడ్, కంకర సీనయ్య, మాజీ కార్పొరేటర్ అంజయ్య, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

## హైడ్రా ప్రజావాణికి 61 ఫిర్యాదులు

**ప్రతిపక్షం, సిటి బ్యూరో,నవంబర్ 3:** ఒకరిద్దరి ధన దాహానికి ప్రభుత్వ స్థలాలు, పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాలకు గురి అవుతున్నాయని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయడానికి వచ్చిన పలువురు వాపోయారు. ఆర్థిక, అంగ బలంతో చేస్తున్న కబ్జాలను నియంత్రించి.. ఆయా ప్రాంతాల్లో ఉన్న వేలాది మందికి ప్రయోజనం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా హైడ్రా చర్యలను అభినందించారు. అదే భరోసాతో తాము కూడా వచ్చామని పలువురు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలంలోని మల్లాపూర్ విలేజ్‌లో ఏ ఎం ఆర్ టౌన్‌షిప్‌లో 2 పార్కులతో పాటు.. రెండు రహదారులను ఆక్రమించేశారంటూ టౌన్‌షిప్ నివాసితుల ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. అలాగే సంగారెడ్డి జిల్లా రామచంద్రాపూరం సాయినగర్ కాలనీలో నాలా పక్కన ఉన్న ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నాయని శ్రీ సాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అమీర్‌పేట మండలం సంజీవరెడ్డి నగర్ సర్వే నంబరు 102/1, 102/3 లో 1550 గజాల స్థలం పార్కుకోసం కేటాయించగా దానిని కబ్జా చేస్తున్నారంటూ అక్కడి నివాసితులు వాపోయారు. ఇలా నగరం నలుమూలల నుంచి సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 61 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్రా అదనపు కమిషనర్ ఎన్ అశోక్ కుమార్ పరిశీలించి.. వాటి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.



## రోడ్డును బాగుచేయాలని గ్రామస్తుల ధర్నా

**ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 3:** మొయినాబాద్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామ రోడ్డును బాగుచేయాలని ఆ గ్రామ యువకులు, గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... గుంతల రోడ్లతో నిత్యం ప్రయాణం కొనసాగించాలంటే నరకంగా ఉందని తెలిపారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు పెడచెవిన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గుంతల రోడ్డులో ప్రయాణంలో పలుమార్లు కొందరు కిందపడి గాయాపాలైయ్యారని వివరించారు. అధికారులు స్పందించి రోడ్డుకు కొత్త రోడ్డు లేదా మరమ్మత్తులైనా చేయించాలని కోరుతున్నారు.



డ్రగ్స్ సరఫరా చేస్తున్న వైసీపీ స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు కొండారెడ్డిని ఈగల్ టీమ్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. డ్రగ్స్ వద్దని ప్రభుత్వం యుద్ధం చేస్తుంటే వైసీపీ పాత వాసనలు వదులుకోవట్లేదు. చెత్త పనులు చేయడం, రాష్ట్రంలో ఏదో అయిపోతుందంటూ హడావుడి చేయడం పరిపాటిగా మారింది. వైసీపీ ఫేక్ పార్టీ అని అనేది అందుకే. ఆ పార్టీ నడిపేది స్టూడెంట్ వింగ్ కాదు, డ్రగ్స్ వింగ్.

\- ట్విటర్‌లో ఏపీ మంత్రి నారా లోకేశ్

# తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- రైతుల రాస్తారోకో.. నిలిచిపోయిన వాహనాలు
- క్రిమిసంహారక మందు డబ్బాతో రైతు నిరసన
- మొలకలు వచ్చిన ధాన్యంతో నిరసన



**ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 3:** తడిసిన ధాన్యాన్ని వెంటనే కో ఊగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. మొలకెత్తిన ధాన్యాన్ని తహశీల్దార్ కార్యాలయం ఎదుట పోసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రోడ్డు పై బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. గంటన్నర పాటు చేపట్టిన రాస్తారోకోతో సోమవారం రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు స్తంభించిపోయాయి. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతూ నిరసన తెలిపారు. తహశీల్దార్, మండల వ్యవసాయ అధికారి వచ్చి హామీ ఇచ్చేంత వరకు రహదారిపై నుంచి కదిలేది లేదని రైతులు స్పష్టం చేశారు. రాజగోపాల్ పేట పోలీసులు సర్ది చెప్పినప్పటికీ రైతులు ఆందోళన కొనసాగించారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, రాజగోపాల్ పేట ఎస్సై టి.వివేక్, ఘటన స్థలానికి చేరుకుని నచ్చచెప్పినా రైతులు వినలేదు. సంబంధిత అధికారులు వచ్చి హామీ ఇచ్చేంత వరకు రాస్తారోకో విరమించేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. ఓ రైతు క్రిమిసంహారక మందు డబ్బాతో నిరసన తెలిపారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. అంతలోనే అక్కడికి చేరుకున్న తహశీల్దార్ మాధవి రైతులకు నచ్చ చెప్పి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతుల పట్ల అలాగే విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఏవో గీతా పై చర్యలు తీసుకొని తక్షణమే సస్పెండ్ చేయాలని తహశీల్దార్ మాధవి కు వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని కోరుతూ డీ సీ వో వరలక్ష్మికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు చెలికాని మల్లేశం, తుమ్మకోలు మహేందర్ రెడ్డి, రేకులపల్లి వెంకట రెడ్డి, గోనెపల్లి శివ ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ అకాల వర్షాలతో రైతులు ఆగమాగం అవుతుంటే ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ఒక్క అధికారి అటుగా వచ్చి రైతులకు ఎలాంటి హామీ కూడా ఇవ్వలేక పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు సెంటర్ల వద్ద కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని తెలిపారు. ప్రభుత్వం 17 శాతం తేమ శాతం వస్తే కొనుగోలు చేస్తామని చెబుతున్నా సెంటర్ ఇంచార్జులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ 13 శాతం వస్తేనే ధాన్యం కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పంట నష్టంపై అధికారులు ఎక్కడా సర్వే చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన ధాన్యం ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిథ్యం వహిస్తున్న హుస్నాబాద్ నియోజకవర్గంలో కొనుగోలు చేస్తున్న విధంగానే నంగునూరు మండలంలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు వేదికకు ఎప్పుడూ తాళం వేసుకుని పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం త్రాగునీరు అందుబాటులో పెట్టడం లేదని తహశీల్దార్ మాధవికి రైతులు చెప్పారు. స్పందించిన తహశీల్దార్ మాధవి మండల కేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని కొనుగోలు సెంటర్ల ఇంచార్జీలను ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యం వివరాలు ఉన్నతాధికారులకు నివేదించి రైతులకు తగిన న్యాయం చేస్తామని తహశీల్దార్ మాధవి హామీ ఇచ్చారు.



# కార్తిక సోమవారం... నాచగిరి జనసంద్రం

**ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 3:** కార్తీక సోమవారం త్రయోదశి పురస్కరించుకొని వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీ నరసింహ క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయింది. సత్యనారాయణ స్వామి వ్రతములు, స్వామివారి నిత్య కళ్యాణం, అభిషేకములు అధిక సంఖ్యలో జరిపించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ వారి ఉత్తర్వుల అనుసరించి సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా గీతా హైస్కూల్, తూప్రాన్ విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు మరియు శశికాంత్ శర్మ జోషి, నిజాంబాద్ వాస్తవ్యులచే కార్తీక పురాణం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం తరపున మహిళా భక్తులకు దేవస్థాన చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్తా, ధర్మకర్తలు చందా నాగరాజు, కొత్తపల్లి శ్రీనివాస్ పసుపు కుంకుమ అందజేశారు.





# హరీష్ రావుకు సిద్దిపేట జర్నలిస్టుల పరామర్శ

**ప్రతిపక్షం సిద్దిపేట, టౌన్, నవంబర్ 3:** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తండ్రి సత్యనారాయణ రావు ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. సోమవారం సిద్దిపేట జర్నలిస్టులు హరీష్ రావును పరామర్శించారు. సత్యనారాయణ రావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చిటుకుల మైసారెడ్డి, షణ్ముఖ రాజు, అంబటి యాదగిరి, నక్కల రాంరెడ్డి, కాసర్ల మురళీ, జక్కుల శ్రీకాంత్, చెవిటి సంతోష్, బీఆర్ఎస్ నాయకులు జైపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# మిల్లర్లు పౌరసరఫరాల శాఖతో అగ్రిమెంట్ చేసుకోవాలి

- 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపించాలి
- జిల్లా కలెక్టర్ హైమవతి

**ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 3:** రైస్ మిల్లులు వెంటనే బ్యాంకు గ్యారంటీ ఇచ్చి పౌరసరఫరాల శాఖతో అగ్రిమెంట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హైమవతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి జిల్లాలోని మిల్లర్లతో సమావేశం నిర్వహించి ఖరీఫ్ కాలం వరిధన్యం కొనుగోలు పై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలు జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైందని, కొనుగోలు ప్రారంభంలోనే అకాల వర్షాలతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో హుస్నాబాద్ నుండి జిల్లాలోని అన్ని రైస్ మిల్లులకు తడిచిన ధాన్యాన్ని పంపించడం జరిగిందని, సహకరించిన మిల్లర్లకు ధన్యవాదాలు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలనుండి 17 శాతం మాత్రమే తేమ ఉన్న వరిధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపించడం జరుగుతుందని ఎలాంటి ఆలస్యం చేయకుండా ధాన్యాన్ని దించుకోవాలని, హమాలీల సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్లో ఉన్న సీఎంఆర్ ఈ నెల 11వ తేదీలోగా కంప్లీట్ చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్, డీఎం సివిల్ సప్లై ప్రవీణ్, జిల్లా పౌర సరఫరాల అధికారి తనూజా, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ భవ్య, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఏడుపాయల్లో కార్తీక శోభ

- దీపాల కాంతుల్లో వన దుర్గమ్మ

**ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 3:-** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయలలో కార్తీకమాస ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వనదుర్గ ఆనకట్ట నుండి 12,000 క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల అవుతుండడంతో ఆరు రోజులుగా గర్భగుడిని తాత్కాలికంగా మూసివేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో రాజగోపురంలో అమ్మవారు ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. కార్తీక రెండవ సోమవారం సందర్భంగ రాజగోపురంలో అమ్మవారికి ఆలయ అర్చకులు రావికోటి పార్థివ శర్మ, రాజశేఖర్ శర్మ, ప్రత్యేక పూజలు నిర్వహించి ఓం ఆకారంలో దీపాల అలంకరణ చేశారు. అనంతరం పరవాళ్లు తొక్కుతున్న మంజీరాకు ఆలయ అర్చకులు గంగా హారతి, భక్తులకు దివ్యదర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# వృక్షశాస్త్రంలో పీహెచ్‌డీ డాక్టర్ మెరాజ్ ఫాతిమాకు మదీనా బంగారు పతకం

**ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 3:** వృక్షశాస్త్రంలో పీహెచ్‌డీ సాధించిన డాక్టర్ మెరాజ్ ఫాతిమాను మదీనా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో బంగారు పతకంతో సత్కరించారు. తంజీమ్ ఉల్ మసాజిద్ గౌరవాధ్యక్షుడు ఎంఏ. అలీమ్ సర్వర్ కుమార్తె డాక్టర్ మెరాజ్ ఫాతిమా వృక్షశాస్త్రంలో తన అత్యుత్తమ పరిశోధనకు గాను మదీనా ఎడ్యుకేషన్ సొసైటీ, హైదరాబాద్ వారు 'మదీనా బంగారు పతకం'తో డాక్టర్ మెరాజ్ ఫాతిమాను సత్కరించారు. డాక్టర్ మెరాజ్ ఫాతిమా హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి "క్యాన్సర్ వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక ప్రాధాన్యతతో లాండోల్టియా పంక్టాటా యొక్క ఫైటోకెమికల్, ఫార్మకోలాజికల్ స్క్రీనింగ్" అనే అంశంపై ప్రొఫెసర్ సుజాత మార్గదర్శకత్వంలో ఫాతిమా పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రస్తుతం ఆమె సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత 14 సంవత్సరాలుగా వృక్షశాస్త్ర విభాగంలో ఫ్యాకల్టీ సభ్యురాలిగా సేవలందిస్తున్నారు.



# వైన్ షాపులను తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

**ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 3:** సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద ఉన్న మద్యం దుకాణాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎంబీ ఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బైరి వెంకటేశం ఆధ్వర్యంలో వివేకానంద కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణి కార్యక్రమంలో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు మాట్లాడుతూ నర్సాపూర్ చౌరస్తా సమీపంలోని వివేకానంద కాలనికి ఆనుకుని ఉన్న దుర్గా భవాని, రేణుక వైన్స్ ల వల్ల మద్యం తాగేవారి ఆగడాలు పెరిగిపోయాయని అన్నారు. రాత్రివేళల్లో రోడ్డుపైనే తాగి గోల చేస్తూ మహిళలపై దాడి చేసే స్థాయికి చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, చిన్నపిల్లలు రోడ్డుమీదకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఎన్నిసార్లు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా, వారు మద్యం దుకాణదారుల వద్ద లంచాలు తీసుకొని చర్యలు తీసుకోవడం



లేదుఅని విమర్శించారు. ఈ రోజు జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌లకు ఫిర్యాదు చేశామని అన్నారు. వెంటనే ఈ దుకాణాలను ఊరి బయటకు తరలించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు చెందిరెడ్డి రాంరెడ్డి, జిర్ర నాగేందర్, మల్యాల పవన్, మహిళలు సుజాత, వరవ్వ, రహీమున్నిసా, పద్మావతి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావును బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు సుశీలా రెడ్డి సోమవారం పరామర్శించారు. హరీశ్ తండ్రి సత్యనారాయణ రావు చిత్రపటానికి నివాళులు అర్పించారు.**

– ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్



# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్సీ

**ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 3:** ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను సోమవారం నాడు ఉమ్మడి మెదక్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి బాధితులకు పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న వారిలో సిద్దాల అనిత, మల్లాడిపేట మమత లతోపాటు కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు దేవి రవీందర్, మాజీ మార్కెట్ డైరెక్టర్ చీర సాగర్ ప్రవీణ్, మాజీ ఎంపిటిసి బూరుగుపల్లి రాజిరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త గంగాల మల్లేశం పాల్గొన్నారు.

# వినియోగదారుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు

- విద్యుత్తు శాఖ ఎస్ఈ నారాయణ నాయక్



**ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 3:-** మెదక్‌జిల్లాలో విద్యుత్తు వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని విద్యుత్తు శాఖ ఎస్ఈ నారాయణ నాయక్ పేర్కొన్నారు. సోమవారం విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్తు వినియోగదారుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా 102 వినతులు వచ్చాయి. వినియోగదారులు పేర్కొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ఎస్ఈ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువగా ఇళ్లపై విద్యుత్తు తీగలు ఉండటం, కేటగిరీల్లో మార్పులు, విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఉండటంతో పాటు విద్యుత్తు తీగలను మార్చాలని, మీటర్ రీడింగ్ తప్పుగా బిల్లులు వస్తున్నాయని, మీటర్లు కాలిపోయాయని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అలాగే ప్రభుత్వం నాయిబ్రాహ్మణులు, రజకులకు ఉచితంగా అందచేస్తున్న విద్యుత్తు విషయంలో సైతం ఫిర్యాదులు తీసుకున్నామని అన్నారు. అలాగే జిల్లాలో గృహావసర విద్యుత్తుతో పాటు రైతులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్తును అందించేందుకు తమ శాఖ అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఇంచార్జి డీఈ శ్రీనివాస్ విజయ్, ఏడీఈ మోహన్ బాబు, ఎమ్ఆర్టీ డీఈ సోమేశ్వరరావు, విజిలెన్స్ డీఈ శ్రీనివాస్ రెడ్డి, మెదక్‌టౌన్ ఏఈ నవీన్, మెదక్ రూరల్‌ఏఈ రాజ్‌కుమార్, చిన్న శంకరంపేట ఏఈ, సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

**ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 3:** నాలుగు సంవత్సరాల బాలుడు సోమవారం సాయంత్రం నాచారంలో ఆర్టీసీ బస్సు ఎక్కి గజ్వేల్ బస్టాండ్లో దిగాడు. ఆర్టీసీ సిబ్బంది గమనించి బాలునితో ఆరా తీయగా వివరాలు చెప్పకపోడంతో గజ్వేల్ పోలీసులకు అప్పగించారు. దీంతో గజ్వేల్ పోలీసులు నాచారం, ఇతర గ్రూపులలో అతని వివరాలు పెట్టగా, అతని తల్లిదండ్రులు తెలుసుకొని పోలీస్ స్టేషన్ కి వచ్చారు. దీంతో గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవికుమార్ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించడంతో పాటు కౌన్సిలింగ్ ఇచ్చారు.



రాజకీయ విమర్శలకు పరిమితులు ఉండాలి. జూబ్లీహిల్స్‌కు పాకిస్థాన్‌కు లింక్ పెట్టడం సరికాదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది ఫ్రీ బస్సు ఒక్కటే. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి మంచి స్పందన వస్తోంది. అజహరుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడం బీజేపీకే ప్లస్. కేసీఆర్‌రెండేళ్లుగా ఎక్కడా కనిపించలేదు. ప్రజల మధ్యకు రాని ఆయన మళ్లీ సీఎం ఎలా అవుతారు?

- మీడియాతో చిట్‌చాట్‌లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



# దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

- చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

**ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 3:** ధాన్యం విక్రయాలలో అపోహలు నమ్మవద్దని రైతులు పండించిన పంట చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. సోమవారం పాపన్నపేట మండల పరిధిలోని ఎల్లాపూర్, అన్నారం, యూసఫ్ పేట గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వరి ధాన్యం విక్రయ కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని చెప్పారు. ప్రతి రైతు ధైర్యంగా ఉండాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, తాలు లేకుండా, ప్రభుత్వం నిర్ణయించిన తేమ శాతం దాటకుండా రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం మల్లంపేటలో పార్టీ సీనియర్ నాయకులు ప్రశాంత్ రెడ్డి సహోదరుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తరుణ్ రెడ్డి దశదినాకర్మలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు గోవింద్ నాయక్, నాయకులు మల్లప్ప, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్,నరేందర్ గౌడ్, మురళి, గౌస్, సతీష్, బాపురెడ్డి, మోహన్ రెడ్డి, రాజశేఖర్లతో పాటు వివిధ గ్రామాల కార్యకర్తలు,రైతులు తదితరులు ఉన్నారు.

# జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ సత్తా చాటాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఎస్జీఎఫ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ట్రాక్ సూట్ల పంపిణీ

**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 3 :** త్వరలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్ర సత్తాను చాటాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇటీవల పటాన్ చెరులో జరిగిన ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్ 14 బాలురు బాలికల కబడ్డీ, అండర్ 17 బాలుర వాలీబాల్ పోటీలలో విజేతలు ఆదరించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు, కోచ్ లకు సోమవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ సొంత నిధులతో కొనుగోలు చేసిన ట్రాక్ సూట్లను ఆయన పంపిణీ చేశారు. జాతీయస్థాయి పోటీల్లోనూ మెరుగైన ప్రదర్శన అందించి తెలంగాణ రాష్ట్ర కీర్తిని ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు డిఎస్పి ప్రభాకర్, మాజీ ఎంపీపీలు యాదగిరి యాదవ్, శ్రీశైలం యాదవ్, దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, దశరథ్ రెడ్డి, సిఐలు వినాయక రెడ్డి, లాలు నాయక్, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, మండల విద్యాశాఖ అధికారులు పిపి రాథోడ్, నాగేశ్వర్ రావు నాయక్, బండి శంకర్, తదితరులు పాల్గొన్నారు.






క్రమశిక్షణకు మారుపేరు

# విజయ్ కుమార్..

- జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి

**ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 3:** క్రమశిక్షణకు మారుపేరు సిద్దిపేట ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ అని జిల్లా విద్యాశాఖ అధికారి ఈ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. విజయ్ కుమార్ ఉద్యోగ విరమణ అభినందన సభకు పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు జి. తిరుపతిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి ఈ. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విజయ్ కుమార్ ప్రభుత్వ నూతనోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుడిగా క్రమశిక్షణతో అంకితభావంతో పని చేశారన్నారు. 33 సంవత్సరాలుగా విద్యారంగానికి విశేష సేవలందించారన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగ వారిని ఘనంగా సన్మానించారు. ఈ అభినందన సభలో విజయ్ కుమార్ కుటుంబ సభ్యులు, నూతనోన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం వెంకటరమణ, శ్రీనివాస్, శ్రీదేవి, నరసింహారెడ్డి, రాజ్ కుమార్, గోవర్ధన్, వజ్రమ్మ, సాగర్, కనకయ్య, జ్యోత్స్న ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గీతాదేవి, ధర్మాజీపేట ఉన్నత ప్రధానోపాధ్యాయులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



# వరదరాజపురం వీరాంజనేయ ఆలయంలో పూర్వాభాద్ర నక్షత్ర పూజ

- స్వామివారికి 13 కిలోల వెండి కవచం, కిరీటం అలంకరణ

**ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 3:** నియోజకవర్గంలోని మర్కుక్ మండలం వరదరాజపురం గ్రామంలో పూర్వాభద్ర నక్షత్రం పురస్కరించుకొని, వీరాంజనేయస్వామికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి, దాతల సహకారంతో స్వామికి13 కిలోల బరువు గల వెండి కవచాలు, కిరీటం అలంకరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ప్రొద్దుటూరు గోపాలకృష్ణ, ఆలయ అర్చకులు గుండు శ్రీను, గోపాల్ శర్మ, రామ్మోహన్ శర్మ, రావికంటి అభిలాష్ గుప్తా మాట్లాడుతూ వరదరాజపురం ఆంజనేయస్వామిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం అని దాదాపు 52 నెలలుగా ప్రతినెల పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అమర నాగేందర్, రావికంటి శ్రీనివాస్, రావికంటి ప్రసాద్, వెంకటేశం, అంతని నర్సింలు, చేతిరెడ్డి రంగారెడ్డి, గొడుగు నరసింహులు, మాచర్ల సిద్దేశ్వర, ఆర్యవైశ్యులు,మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.




# సిద్దిపేటలో బీసీ రిజర్వేషన్ల సాధన సమితి వినతి

**ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 3:** బీసీలకు రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయం సాధించాలని బీసీ నాయకులు కోరారు. 42% బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అర్బన్ తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ప్రభుత్వము విద్యా, ఉద్యోగ రంగాలలో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ ఆమోదించిన బిల్లులు కేంద్రానికి పంపిన ఏడునెలలు అయినా 9వ షెడ్యూల్లో చేర్చలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులను వెంటనే పార్లమెంట్లో చేర్చి చట్టరూపం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవిలు, మాజీ జస్టిస్ ఈశ్వరయ్య, డా. విశారదన్ మహారాజ్, బాలగోని బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# 'తన్నీరు'ను పరామర్శించిన బక్కి వెంకటయ్య

**ప్రతిపక్షం, దుబ్బాక, నవంబర్ 3:** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి సత్యనారాయణ రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని సోమవారం రాష్ట ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హైద్రాబాద్ లోని వారి నివాసంలో మాజీ మంత్రి హరీష్‌రావు ను పరామర్శించారు. ఆయన తండ్రి సత్యనారాయణ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అలాగే వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వెంకటయ్య తో పాటు కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, జిల్లా శంకర్, కొంకటి లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలి

- తూప్రాన్ లో ఏబీవీపీ భారీ ర్యాలీ

**ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 3:** విద్యార్థులకు రావలసిన ఉపకార వేతనాలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తూప్రాన్ మండల కేంద్రంలో విద్యార్థులు ఆందోళన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏబీవీపీ రాష్ట్ర నాయకులు బండారు ప్రశాంత్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న 800 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో విద్యార్థులు ఆందోళన కార్యక్రమం చేపడతారని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాల లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 3:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం కొరివి పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. నేపాల్ రాష్ట్రానికి చెందిన లాలు మండల్ (42) వద్ద కొనుగోలు కేంద్రానికి హమాలీ కార్మికుడిగా ఎనిమిది రోజుల క్రితం వచ్చి పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి కిరాణం షాప్ కు నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.




# అవినీతిని ఉపేక్షించేది లేదు

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 3:** జిల్లాలోని అన్ని శాఖలపై తాను ప్రత్యేక దృష్టి సారించానని, ఎవరైనా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసినా, ఏలాంటి ఆరోపణలు ఎదుర్కొన్న వారిని ఉపేక్షించేది లేదని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఎవరైనా అధికారులు, లేదా వాళ్ల సిబ్బంది అవినీతికి పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజల వద్ద నుంచి డబ్బులను తీసుకోవడం చాలా ప్రమాదం అన్నారు. అవినీతి అనేది ఒక సర్కిల్ లాగా రోజువారీగా తిరుగుతుందని దానిని అంత మొందించకపోతే అది అందరిని ప్రభావితం చేస్తుందన్నారు. వ్యక్తులు చేసే అనైతిక పనుల వల్ల వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం పోతుందని, ప్రజలకు భరోసాగా నిలువవలసిన బాధ్యత అందరి అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఏ శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ అధికారి భుజంగారావు, జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.



నష్టపోయిన రైతులకు

# 50 వేలు పరిహారం ఇవ్వాలి

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ డిమాండ్

**ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 3:** పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారం అందించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడపట్ల ఈశ్వర్ డిమాండ్ డిమాండ్ చేశారు. బహుజన సమాజ్ పార్టీ సిద్దిపేట పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడపట్ల ఈశ్వర్ హాజరై మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో కురిసిన వర్షానికి పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 50వేల రూపాయలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని లేని పక్షంలో బహుజన సమాజ్ పార్టీ దీనిపైన పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని హెచ్చరించారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి, జిల్లా ఇన్చార్జులు డేగల వెంకటేశ్వర్, గజ్జల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండనోళ్ల నరేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్ల మల్లేశం ముదిరాజ్, జిల్లా కార్యదర్శి జే రవీందర్, నాలుగు నియోజకవర్గ ఇన్చార్జిలు పంగబాబు, మేధోజు మహేష్ మోతె నర్సింలు, అసెంబ్లీ అధ్యక్షులు కొండపలకల సంపత్, పోతారం రాజు, కొమ్ము చంద్రం, వేల్పుల రాజు, నాయకులు కిరణ్, బండ నర్సింహులు, స్వామి, కనక ప్రసాద్, స్వామి, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

# మొంథా తుఫానుతో 55 శాతం పంటలకు నష్టం

- కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఇష్టారీతిగా వ్యవహరించ వద్దు
- రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుంది
- టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి



**ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 3:** మొంథా తుఫాన్ ప్రభావంతో సుమారు 55 శాతం మేర పంట నష్టం వాటిల్లి రైతులకు తీవ్ర దుఃఖాన్ని మిగిల్చిందని టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి విచారం వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో తుఫాన్ వల్ల పాడైన పంటలను పరిశీలించారు. సందర్భంగా దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ పంట నష్టం జరిగిన ప్రతి రైతుకు ప్రభుత్వం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటుందని రైతులకు హామీ ఇచ్చారు. పంట నష్టాన్ని వ్యవసాయ శాఖ అధికారులు సమగ్రంగా సర్వే చేసి ప్రభుత్వానికి పంపిస్తారని తెలిపారు. ఏ రైతు కూడా ఆందోళన చెందవద్దని రైతులకు భరోసా కల్పించారు. ధాన్యం కొనుగోలు సెంటర్ల నిర్వాహకుల నిర్లక్ష్యం మూలంగానే నేడు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. కొనుగోలు సెంటర్ల నిర్వాహకుల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వాన్ని బద్నాం చేయడం సరైంది కాదని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ కొనుగోలు సెంటర్ల ఇంచార్జీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు సెంటర్ల నిర్వాహకులు కొందరు రాజకీయ నాయకులతో కుమ్మకై కావాలని రైతుల పై రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రైతులపై రాజకీయాలు మానుకుని కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా చూడాలని కొనుగోలు సెంటర్ల నిర్వాహకులను హెచ్చరించారు. రైతులు ఎవరు అధైర్య పడవద్దని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాగుల కృష్ణ, యాదగిరి, వెంకట్ రెడ్డి, జంగిడి శీను, నాగరాజు, కనకయ్య, కిషన్, శీను, రాజశేఖర్ పాల్గొన్నారు.

“



పులికాట్ సరస్సుకు శీతాకాలం అతిథులైన ఫ్లెమింగ్ పక్షుల రాక మొదలైంది. ఎకో టూరిజం గమ్యస్థానంగా పులికాట్‌ను మారుస్తాం. ఫ్లెమింగోలు ఆహారం, విశ్రాంతి కోసం అక్టోబరులో వచ్చి మార్చిలో తిరిగి వెళ్లిపోతాయి. వాటికి ఇబ్బందులు కలగకుండా కొంత కాలంగా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఈసారి 3 రోజుల పండుగతో సరిపెట్టకుండా ఎకో టూరిజాన్ని విస్తరిస్తాం.
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్

ప్రాంతీయం

# స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలకోసం ఆందోళనలు

- వెంటనే విడుదల చేయాలి: ఎఐఎస్ఎఫ్ఐ
- యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉరితాళ్లతో నిరసన




**ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 3:** రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ప్రైవేట్ కళాశాలలు ఫీజు బకాయిల కారణంగా బంద్ చేయడం విద్యార్థుల భవిష్యత్తును సవాలుగా మార్చిందని ఎఐఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక తెలంగాణ చౌక్‌లో ఏఐఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తమ చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఖండించారు. ''విద్యార్థులకు న్యాయం చేయాలి'', ''ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలి'' అంటూ నినాదాలు చేశారు.

**ఉరితాళ్లతో నిరసన**

రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని యూఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. కరీంనగర్‌లో యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉరితాళ్లతో నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ నాయకుడు మారం తిరుపతి మాట్లాడుతూ ప్రైవేట్ కళాశాలలు ఫీజు బకాయిల కారణంగా బంద్ చేయడం విద్యార్థుల భవిష్యత్తును సవాలుగా మార్చిందన్నారు. విద్యార్థులు పెడదారిన పోయే అవకాశముందన్నారు. ఈ నేపథ్యంలో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు.

**ఎస్ఎఫ్ఐ నిరసన ఆందోళన**

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ ) ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని, విద్యార్థిని విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, యాజమాన్యాలకు రావాల్సిన బకాయిలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోవడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థిని, విద్యార్థులు చదువులకు దూరం అయ్యే పరిస్థితి ఏర్పడుతుందని దీని ద్వారా చదువులకు విద్యార్థులు దూరమయ్యే స్థితి వస్తుందని పేర్కొన్నారు.




## ప్రేమ వివాహం చేసుకున్న యువకుడి ఇంటిపై
# అమ్మాయి బంధువుల దాడి

- ఇంటికి నిప్ప పెట్టడంతో పక్కనే నిల్వ ఉన్న పత్తి దగ్ధం
- మంటలను అదుపులో చేసిన ఫైర్ సిబ్బంది

**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 3 :** సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలోని కక్కెరవాడ గ్రామంలో సోమవారం ఉదయం 8:30 సమయంలో ఝరాసంగం మండలం కక్కెరవాడ గ్రామంలో బోయిని నగేష్ తండ్రి రాములు (24) తన ఇంటి వద్ద తన రోజు వారి పనులు చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన గొల్ల విటల్ తండ్రి నర్సింలు మరియు అతని కొడుకు అయిన గొల్ల పాండు ఇద్దరు కలిసి విఠల్ కూతురు అయిన మౌనిక మరియు బోయిని రాములు కుమారుడు రాధాకిష్ణ ప్రేమ వివాహం నచ్చకపోవడంతో తండ్రి కొడుకులు బోయిని నగేష్ మరియు భోగి రాములపై దాడి చేయడం తో . ఈ దాడిలో బోయిని నగేష్ కు మూగ దెబ్బలు తగలగా తండ్రి రాములకు రక్త గాయాలు కావడం తో గొల్ల విఠల్ ఇదే విషయం మనసులో పెట్టుకొని బోయిని రాములు యొక్క గుడిసెకు నిప్పు పెట్టడం జరిగింది. ఈ విషయంలో బోయిని రాములుకు సంబందించిన కొన్నివస్తువులు కాలిపోవడం జరిగింది. బోయిన నాగేష్ ఇచ్చిన దరఖాస్తు తో వ్యక్తుల పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వివాహిత మహిళకు వేధింపులు

- ఎవరికి చెప్పకోలేక నరకయాతన
- వాట్సాప్ కాల్ ను స్వయంగా పరిశీలించిన సీపీ
- డెంటల్ డాక్టర్, రియల్టర్ పై కేసు నమోదు చేయాలని ఆదేశాలు



**ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 3:** నగరానికి చెందిన ఓ వివాహితను డెంటల్ డాక్టర్, రియాల్టర్ వేదింపులకు గురిచేశారు. దీనిపై బాధితురాలు సీపీకి ఫిర్యాదు చేస్తున్న సమయంలో రియాల్టర్ మరోమారు వాట్సాప్ కాల్ చేయటంతో సీపీ సాయి చైతన్య స్వయంగా ఆ కాల్ ను పరిశీలించి వారిపై వెంటనే కేసు నమోదుకు ఆదేశాలు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ నగరానికి చెందిన ఓ యువతి తన వివాహానికి ముందు ట్రావెల్ కార్యాలయంలో రిసెప్షనిస్టుగా పని చేసేది. ఈమెకు ఏడాది క్రితం వివాహం జరుగగా, భర్త కోరిక మేరకు ఆ జాబ్ ను వదిలేసి ఇంటి వద్దే ఖాళీగా ఉంటుంది. తాను ట్రావెల్ ఏజంట్ కార్యాలయంలో పని చేసే చోట యజమాని బావమరిది (శ్రీనగర్ కాలనీకి చెందిన వ్యక్తి) తాను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నామని యువతితో మాటలు కలిపి ఆమె ఫోన్ నంబర్ తీసుకుని వెకిలి చేష్టలు చేయటం మొదలు పెట్టాడు. ఈ విషయాన్ని తన యజమానికి చెబితే ఎక్కడ తన ఉద్యోగం తీసేస్తాడేమోనని భయం. మరోపక్క ఇంట్లో చెబితే ఉద్యోగం మానేయాలని కుటుంబ సభ్యులు చెబుతారేమోనని భయపడి తనలో తానే కుమిలిపోయింది. ఖలీల్ వాడికి చెందిన డెంటల్ డాక్టర్ టూరిస్టు వీసా కోసం ట్రావెల్ కార్యాలయంకు వచ్చి యువతి నంబర్ తీసుకున్నాడు. అతను కూడా యువతిని తరుచుగా వేదించడం ప్రారంభించాడు. ఒక వైపు రియాల్టర్, మరో వైపు డెంటల్ డాక్టర్ వేదింపులు భరించలేక ఏడాది క్రితం ఉద్యోగం మానేసి వివాహం చేసుకుంది. ఇటీవల కాలంలో పెళ్లయిన వివాహితకు రియల్ ఎస్టేట్ వ్యాపారి, దంత వైద్యుడి వేదింపులు ఎక్కువయ్యాయి. న్యూడ్ కాల్ చేస్తే రూ.5 వేలు ఇస్తామని, గెస్ట్ హౌజ్ కు వస్తే రూ.10 వేలు ఇస్తామని వాట్సాప్ కాల్, వీడియో కాల్స్ చేసి వేదించడం మొదలు పెట్టారు. నగరంలోని స్టార్ హోటల్ ను బుక్ చేసామని రావాలని కోరుతూ కాల్స్ చేసి వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం బాధితురాలు పోలీస్ ప్రజావాణిలో పోలీస్ కమిషనర్ కు తన గోడును వెళ్లబోసుకుంది. అదే సమయంలో ఆమెకు వాట్సాప్ కాల్ రాగా, సీపీ స్వయంగా ఆ కాల్ ను పరిశీలించారు. కాల్ చేసిన వ్యక్తిపై వెంటనే కేసు నమోదు చేయాలని సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ వోను ఆదేశించారు.



## అయ్యప్ప స్వామి దేవాలయం
# భూమి పూజ

- కోటి 35 లక్షల రూపాయల వ్యయంతో ఆలయ నిర్మాణం

**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 3:** అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం గుట్ట పైన ఒక కోటి 35 లక్షల రూపాయల అంచనా వ్యయంతో అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మించబోతున్నట్లు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, అయ్యప్ప భక్తుల సమక్షంలో వేద పండితుల వేద మంత్రోచ్చరణల మధ్య ఎమ్మెల్యే జిఎంఆర్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ప్రజలలో భక్తి భావం పెంపొందించడంలో నూతన దేవాలయాల నిర్మాణాలు ఎంతగానో ఉపకరిస్తాయని తెలిపారు. అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, సీఐ నరేష్, అయ్యప్ప భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




# నల్లా కనెక్షన్ కు ట్యాన్ నెంబర్ తప్పని సరి

- పాస్ బుక్ లేకుంటే అక్రమ నల్ల కనెక్షన్ గానే గుర్తించాలి
- నీటి సరఫరా అధికారులతో కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

**ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 3:** నల్లా కనెక్షన్ కు ట్యాన్ నెంబర్, తప్పని సరి అని, పాస్ బుక్ లేకుంటే అక్రమ నల్ల కనెక్షన్ గానే గుర్తించాలని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ నీటి సరఫరా ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ అధికారులు, నీటి సరఫరా విభాగం పిట్టర్లు, లైన్ మెన్ సిబ్బంది తో సమీక్ష సమావేశం జరిగింది. నగరపాలక సంస్థ పరిదిలో నల్లా కనెక్షన్ల పై చేస్తున్న ఇంటింటి సర్వే జరుగుతున్న తీరుతో పాటు సర్వే లో తలెత్తే సమస్యల వివరాలు అడిగి తెలుసుకున్నారు.. లీగల్, ఇల్లీగల్ నల్లా కనెక్షన్ల తో పాటు నల్లా పన్నుల బకాయి తదితర అంశాలపై చర్చించారు. నల్లా కనెక్షన్ల సర్వే పై పలు సూచనలు చేస్తూ.... అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ విలీన గ్రామాల డివిజన్లతో సహా నగర వ్యాప్తంగా నల్లా కనెక్షన్ల సర్వేను పది రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఇచ్చిన ఫ్రొఫార్మా ప్రకారం నల్లా కనెక్షన్ల సరైన వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఇచ్చిన వివరాల్లో ఎలాంటి తప్పుడు వివరాలు ఉన్న అలాంటి వారి పై చర్యలు తీస్కుంటామని హెచ్చరించారు. ఇంటికి ఎన్ని నల్లా కనెక్షన్లు ఉన్నాయి అనేది గుర్తించి వాటికి ట్యాన్ నెంబర్ లేదా పాస్ బుక్ ఉందా లేదా వివరాలను రాయలని అన్నారు. పాస్ బుక్ ట్యాన్ నెంబర్ లేకుంటే అక్రమ నల్లాగా రాసి నోటీసులు జారీ చేయాలన్నారు. నోటీసు ఇచ్చిన ఏడు రోజుల గడువు లోగా సరైన డాక్యూమెంట్స్ చూపిస్తే రెగ్యులర్ చేయాలని లేకుంటే నల్లా కనెక్షన్ తొలగించాలని ఆదేశించారు. అందే కాకుండా ఉన్నా నల్లా పై ఎంత బకాయి ఉంది ఇన్న వివరాలను కూడ సేకరించాలని ఆదేశించారు. సర్వే పై ఏఈ, డీఈ అధికారుల పర్యవేక్షణ తప్పని సరిగా ఉండాలని, ప్రతి రోజు మీ డివిజన్ వారిగా ఫీల్డ్ లెవల్ సర్వే తీరు పై తనిఖీ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ లు సంజీవ్, శివానందం, డీఈ ల, ఏఈలు, వాటర్ సప్లై పిట్టర్లు, లైన్ మెన్ లు పాల్గొన్నారు.




# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- నిజామాబాద్‌సీపీ సాయి చైతన్య

**ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 3:** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే దేశ భవిష్యత్తు బాగుంటుందని సీపీ సాయి చైతన్య అన్నారు. ఆర్మూర్ డివిజన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్ మైదానంలో 28 స్కూల్స్ నుండి 120 టీంలను ఏర్పాటు చేసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండేందుకు యువత కోసం కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి సీపీ సాయి చైతన్య హాజరయ్యారు. సీపీ మాట్లాడుతూ యువత ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొని, ఆటలో స్ఫూర్తిని చూపించినందులకు ప్రతీ ఒక్కరికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సమాజంలో యువత పెద్ద ఎత్తున మత్తుపదార్థాల వైపు ఆకర్షితమవుతోందని, ఇది ఒక ప్రమాదకరమైన మార్గమని అన్నారు. మన బాధ్యతలు మనమే గుర్తించాలి, మంచి స్నేహితులను, మంచి అలవాట్లను ఎంచుకోవాలి, మీరు చేసిన ప్రతి మంచి పని మీ కుటుంబాన్ని, సమాజాన్ని గర్వపడేలా చేస్తుందని అన్నారు. అనంతరం క్రీడాకారులకు సీపీ బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ ఎస్ హెచ్ఓ పి. సత్యనారాయణ గౌడ్, హెడ్ మాస్టర్ కన్వీనర్ లక్ష్మీనరసయ్య, మండలాధికారి రాజ గంగారం, 28 జట్ల యువత, ఆర్మూర్ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# బీసీ బిల్లును పెండింగ్ లో పెట్టడం బాధాకరం

**ప్రతిపక్షం, నిర్మల్, నవంబర్ 3:** గత ఏడు నెలల క్రితం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రానికి పంపిన బిల్లును పెండింగ్లో పెట్టడం చాలా బాధాకరమని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్ యాటగారి సాయన్న ముదిరాజ్ అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని అర్బన్,రూరల్ తహసిల్దారులకు 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మెమోరాండం లు అందజేశారు. ఈ కార్యక్రమంలో 42 శాతం రిజర్వేషన్ల సాధన సమితి జిల్లా సభ్యులు పాతర్ల హరీష్ ముదిరాజ్, రామగిరి రవీందర్, ప్రభాకర్, అడ్వకేట్ బోండ్ల గంగాధర్, మొగిలి రాములు, నరహరి, చిన్నయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.




# ఫీజు బకాయిలు వచ్చే వరకు కాలేజీలను తెరవం

- మా ఓపిక నశించింది
- ప్రయివేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యం

**ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 3:** ఫీజు రియంబర్స్మెంట్ ప్రయివేట్ వచ్చే వరకు కాలేజీలను తెరిచే ప్రసక్తి లేదని ప్రయివేటు కళాశాలల యాజమాన్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జైపాల్ రెడ్డి, నరాల సుధాకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారంలో రాకముందు ఫీజు రియంబర్స్మెంట్ పైన మాకు ఎన్నో ఆశలను రేకెత్తించిందని, గత ప్రభుత్వం ఒక సంవత్సరం ఫీజులను మరొక సంవత్సరం ఇవ్వడంతోనే ఎన్నో ఇబ్బందులకు ఎదుర్కొన్నామన్నారు. ఈ ప్రభుత్వంపై గంపెడు ఆశలతో మేము విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాం కానీ, ఈ ప్రభుత్వం వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు పూర్తి అవుతున్నా పాత బిల్లులకు మోక్షం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మేము ఎన్ని విధాలుగా విన్నవించుకున్నా మా అభ్యర్థనలను ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. న్యాయంగా మాకు రావలసిన స్కాలర్షిప్ డబ్బుల కొరకు గతంలో కళాశాల లను బందు పెడితే ప్రభుత్వం మాతో మాట్లాడింది. స్కాలర్షిప్ డబ్బుల పై హామీ ఇవ్వడంతో మేము వారిని నమ్మి గతంలో మా సమ్మెను విరమిచాం కానీ, ఇప్పటివరకు మాకు రావాల్సిన బకాయిల్లో నుండి కనీసం 10శాతం డబ్బులు కూడా రాలేదన్నారు. ప్రతి నెల మేము ఒక కాలేజీ నడపడానికి రూ.5 లక్షల నుండి రూ.10 లక్షల రూపాయల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మా దగ్గర ఉన్న ఫిక్స్ డిపాజిట్ డబ్బులు అయిపోయాయి. మా పర్సనల్ బంగారు నగలను తాకట్టు పెట్టి ఇన్ని రోజులు కళాశాలలను నడిపాం. ఇకముందు నడపడానికి మా దగ్గర ఎటువంటి ఆదాయ వనరు లేవని, ఏ ఆధారం లేనందున కాలేజీలను మూసివేశామన్నారు. ఇక మమ్మల్ని నీట ముంచినా పాలముంచిన ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మారయ్య గౌడ్, దాసరి శంకర్, సూర్య ప్రకాష్,దత్తు, శ్రీనివాస్ బాలకృష్ణ, శంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలతో దెబ్బతిన్న ప్రభుత్వ నిర్మాణాల
# శాశ్వత నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్ కె. హేమావతి



**ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 3:** సిద్దిపేట జిల్లాలో అధిక వర్షాలతో దెబ్బతిన్న ప్రభుత్వ నిర్మాణాల శాశ్వత నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కె. హేమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ జిల్లాలో కురిసిన అధిక వర్షానికి దెబ్బతిన్న పంచాయతీరాజ్ మరియు ఆర్ అండ్ బి లో లెవెల్ వంతెనలు, కల్వర్టులు, రోడ్ల శాశ్వత నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. అదేవిధంగా అధిక వర్షాలతో దెబ్బతిన్న ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, మున్సిపాలిటీలో వివిధ నిర్మాణాల మరమ్మత్తుల కొరకు ప్రతి పాదనలు సిద్ధం చేయాలని అన్నారు. ధాన్యం కోసిన వెంటనే నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి నిర్ణీత తేమశాతం వచ్చేవరకు కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుతున్నారని, కానీ అకాల వర్షాలు సంభవించినప్పుడు ఆ ధాన్యం తడిసిపోవడం జరుగుతుందని, కాబట్టి రైతులు ధాన్యం కోసం వెంటనే కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రాకుండా నిర్ణీత తేమశాతం వచ్చేవరకు ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా వ్యవసాయ ఇతర అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్, డిఆర్ఓ నాగరాజమ్మ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ భవ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా తులసీ కళ్యాణం

**ప్రతిపక్షం, చేర్యాల, అక్టోబర్ 3:** కార్తీక శుద్ధ ద్వాదశి పురస్కరించుకుని చేర్యాలలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో నిన్న తులసి ఉసిరల ధాత్రీ నారాయణ కళ్యాణం అశేష భక్తుల అత్యంత భక్తి శ్రద్ధలతో అర్చకస్వాములు శేష చార్యులు రాజు స్వామీ వేణుగోపాలాచారి అభిషేకం, జీలకర్ర బెల్లం యజ్ఞోపవీత ధారణ, మంగళసూత్రం దీపోత్సవాన్ని నిర్వహించారు. దీపాలను స్వస్తిక్ తిరునామాల రూపంలో కోవెల అంతా వెలిగించారు. ఈ కళ్యాణోత్సవంలో సరోజని, పద్మ, సరస్వతి, లక్ష్మి, లత, కరుణ, సానిత, గందే నర్సయ్య, భాగ్య లక్ష్మి, నర్సింహులు, విజయ, రాజేశం, నరేందర్, శీను, అనిల్, భార్గవి, భక్తులు పాల్గొన్నారు.

“



బిహార్ ఎన్నికల్లో 'ఇండీ' కూటమి ఓట్లు చీల్చేందుకే పోటీ చేస్తున్నామనడం సరికాదు. 2020లో 5 సీట్లు గెలిచాం. పోటీచేసిన మిగతా 14లో 9 ఎంజీబీ గెలిచింది. 2024లో కిషన్‌గంజ్ ఎంపీ సీటులో 2 లక్షలకుపైగా ఓట్లు సాధించాం. మేం ఆ ఒక్క సీట్లో పోటీచేసినా బీజేపీ అనేక చోట్ల గెలిచింది. గుత్తాధిపత్యాన్ని బ్రేక్ చేయడానికే తమ పోటీ.

- ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ

ప్రాంతీయం



## 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

- బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి పత్రం

**ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 3:** బీసీల 42% రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చట్టపరంగా చేర్చాలని. బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ ఆధ్వర్యంలో నారాయణపేట తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. నారాయణపేట జిల్లా జేఏసీ కో కన్వీనర్ నరేష్ ముదిరాజు మాట్లాడుతూ బీసీలకు 42% రిజర్వేషన్లు అమలయితే వారి జీవితాలలో విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో సంపూర్ణ హక్కులు దక్కుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా నాయకులు, బీసీ ఐక్యవేదిక జిల్లా నాయకులు సీతారామ ముదిరాజు, మరికల్ మండల బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ అధ్యక్షులు కాస్తుల ఆంజనేయులు, ధర్మ సమాజ పార్టీ జిల్లా నాయకులు పొర్ల డేవిడ్, మల్లికార్జున మహారాజు, ఊట్కూరు మండల నాయకులు వేణు మహారాజు, అంజి మహారాజు, ధన్వాడ మండల నాయకులు సిహెచ్ నరేష్, బాలరాజు, అంజి, గణేష్, జంగం రాజు, శీను తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య కార్మిక కుటుంబాల అభ్యున్నతే లక్ష్యం

- జిల్లాలో 1కోటి48 లక్షల పిల్లలు విడుదల చేస్తాం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- మల్కపేట రిజర్వాయర్ లో ఉచిత చేపపిల్లల విడుదల
- హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 3:** మత్స్య కార్మిక కుటుంబాల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో మల్కపేట రిజర్వాయర్ లో ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మత్స్యకారులకు 100% సబ్సిడీతో ఉచిత చేప బిల్లులను పంపిణీ చేసే కార్యక్రమాన్ని యజ్ఞంలా నిర్వహిస్తున్నారని తెలిపారు. చేపలను తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. మత్స్యకారులు అన్ని అవకాశాలను అందిపుచ్చుకోనికి ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని 456 చెరువుల్లో రూ. కోటి 78 లక్షల విలువైన 1కోటి 48 లక్షల చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో నిర్వహించనున్నామని తెలిపారు. మల్కపేట రిజర్వాయర్లో మొత్తం 7 లక్షల 50 వేల చేపపిల్లలు పోసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. 80 నుంచి 100 ఎం ఎం సైజ్ ఉన్న 1,74, 674 చేప పిల్లలు పోశారు. మత్స్య కారులకు ఉపాధి కల్పించేందుకు కేజ్ కల్చర్, ఇతర విధానాలు అమలు చేస్తామని వివరించారు. ఈ ప్రాంత అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. మల్కపేట రిజర్వాయర్ పనులను పూర్తి చేసి ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట మండలంలోని గ్రామాల పొలాలకు సాగు నీరు విడుదల చేశామని గుర్తు చేశారు. మల్కపేట రిజర్వాయర్ పైకి వెళ్లే సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు.

**ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి**

జిల్లా ఇంఛార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మల్కపేట జలాశయంలో 7 లక్షల 50 వేలకు పైగా చేప పిల్లలను విడుదల చేయడానికి సన్నాహాలు చేయడం జరిగిందని తెలిపారు. 100 శాతం సబ్సిడీతో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని చెరువుల్లో వచ్చే 10 రోజుల్లోగా చేప పిల్లలను విడుదల చేస్తామని అన్నారు. దీనికోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్, డీఏఓ అఫ్జల్ బేగం తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధిపై ప్రశ్నిస్తే దాడులకు దిగడం పద్ధతి కాదు

- గుండాల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తెల్లం భాస్కర్

**ప్రతిపక్షం, గుండాల, నవంబర్ 3:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని గుండాల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తెల్లం భాస్కర్ కోరారు.సోమవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు.రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. అభివృద్ధి ప్రశ్నించేవారిపై విమర్శలు, దాడులు కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను సమర్థవంతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో పార్టీ ప్రతినిధులు టి.రాము, సయ్యద్ అజ్జు, గడ్డం రమేష్, లక్ష్మీనారాయణ, రాములు, గడ్డం వీరన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ తో కలిసి ఆయన ప్రజల ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షం, నిర్మల్



## వరద బాధితులను ఆదుకుంటాం

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 3:** వరద ప్రభావిత ప్రాంతాల బాధితుల సహాయార్థం టీఎన్జీవో, టీజీవో, ట్రెస్స,జిల్లా అధికారుల వెల్ఫేర్ సంఘం, పంచాయతీ రాజ్ , భగీరథ మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్,ఐటిఐ తదితర సంఘాల సహకారంతో 500 నిత్యవసర సరుకుల కిట్స్ మరియు బెడ్ షీట్స్ పంపిణీ చేసేందుకు ఏర్పాటుచేసిన వాహనాన్ని కలెక్టర్ స్నేహ శబరిష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఉద్యోగులు వరద ప్రభావిత ప్రాంతాల ప్రజల కొరకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వారికి కావలసిన నిత్యవసర సరుకులు మరియు బెడ్ షీట్స్ అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లాలోని ఉద్యోగులు సామాజిక బాధ్యతగా వరద ప్రభావిత ప్రాంతాల ప్రజల కొరకు ముందుకు వచ్చేలా చేసిన టీఎన్జీవో, టీజీవో, ట్రెస్సా, పంచాయతీరాజ్ మిషన్ భగీరథ, తదితర సంఘాల నేతలను అభినందించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ కలెక్టర్ టీఎన్జీవో మరియు టీజీవో నేతలను పిలిచి మన వంతుగా వరద ప్రభావిత ప్రాంతాల ప్రజల కొరకు సహాయం అందించాలని కోరడం తో వెంటనే ఉద్యోగులు మనస్ఫూర్తిగా ముందుకు వచ్చారని పేర్కొన్నారు. సందర్భంగా కలెక్టర్ ఇంత చక్కటి కార్యక్రమంలో ఉద్యోగులను భాగస్వామ్యం చేయడం హర్షనీయమని వారికి ఉద్యోగ సంఘాల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో యూనియన్ అధ్యక్షులు ఆకుల రాజేందర్, టీజీవో అధ్యక్షులు ఆకవరం శ్రీనివాస కుమార్, సహకార శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నమనేని జగన్మోహన్రావు, డి ఆర్ డి ఓ పిడి మేన శ్రీనివాస్, ట్రెస్సా అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, కాజీపేట ఎమ్మార్వో బావూసింగ్,ఆసనాల శ్రీనివాస్ ,జిల్లా ఉద్యోగ సంఘాల నేతలు డాక్టర్ ప్రవీణ్, బైరి సోమయ్య, పుల్లూరు వేణుగోపాల్, పనికిల రాజేష్, పోలురాజు, దాస్య నాయక్, రాజ్యలక్ష్మి , ఎంపిడిఓ ల సంఘం కూతురు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవోల సంఘం రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీకి

## అజయ్ రాజీనామా

**ప్రతిపక్షం, గుండాల, నవంబర్ 3:** సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి వాంకుడోత్ అజయ్ (బీకోజీ) పార్టీ సభ్యత్వానికి, జిల్లా కమిటీ పదవికి రాజీనామా చేస్తున్నట్టు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2007 నుంచి పార్టీలో పనిచేస్తున్న అజయ్, ఆరోగ్య, కుటుంబ, ఆర్థిక కారణాలతో పార్టీ కార్యక్రమాలను కొనసాగించలేక పోతున్నానని పేర్కొన్నారు. ఇప్పటివరకు తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



## గురుకుల పాఠశాలలో తల్లితండ్రులతో సమావేశం

- హాజరైన హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

**ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 3:** తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల వంగర లో జరిగిన తల్లి తండ్రుల సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి పాల్గొని తల్లితండ్రులకు మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ గురుకుల పాఠశాల ల అభివృద్ధి కి, విద్యార్థుల ప్రగతి కి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, గురుకుల పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి నిష్ణాతులైన ఉపాధ్యాయుల ను నియమించిందని చెప్పారు. విద్యార్థుల శరీరక పెరుగుదలకు మంచి ఆహారాన్ని అందిస్తుందని చెప్పారు. ఇంతమంచి పాఠశాల లో చదువుకోవడం మన అదృష్టం గా భావిస్తూ మంచి లక్ష్యం ను ఏర్పరచుకొని ప్రణాళికయుతంగా చదవాలని చెప్పారు. మంచి చెడు ల విచక్షణ కలిగి తల్లితండ్రుల, ఉపాధ్యాయుల మార్గదర్శనం లో ఆనందకరమైన జీవితాన్ని ఏర్పరచుకొనుటకు ఈ బడి పునాది వేస్తుందని చెప్పారు. గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ వారి సమస్యల పరిష్కారం చూపాలని అన్నారు. మాతృప్రేమను చూపిస్తూ వారిని కంటికి రెప్పలా కాపాడాలని సూచించారు. వారి శారీరక, మానసిక రుగ్మతలు ఏమైనా కనిపిస్తే వెంటనే అందుబాటులో గల ప్రభుత్వ వైద్యులకు సమాచారం ఇవ్వాలని కోరారు ఈ కార్యక్రమం లో డిఎంహెచ్ఓ డా .అల్లెం అప్పయ్య, సీఎంవో బద్దం సుదర్శన్ రెడ్డి, ఎంఈఓ సునీత రాణి, ఎస్ఐ దివ్య, ప్రేరణ దాయక ఉపన్యాసకులు ఆచార్య రవికుమార్, సైకియాట్రిస్ట్ ప్రహసిత్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం భాస్కర్ రెడ్డి , తల్లితండ్రులు పాల్గొన్నారు.



## బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన బిసి ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు

**ప్రతిపక్షం ప్రతినిధి, ములుగు, నవంబర్ 3:** ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో 42% బీసీ రిజర్వేషన్స్ సాధన సమితి ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఆందోళనలు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక తహసీల్దార్‌కు ఐదు ముఖ్య డిమాండ్లు కలిగిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ములుగు నియోజకవర్గ బీసీ-ఎస్సీ-ఎస్టీ జేఏసీ కోఆర్డినేటర్ తరుణ్ మాట్లాడుతూ, బీసీల ఆర్థిక, సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని 42% బీసీ రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు 42% అమలు,2. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు, విద్య-ఉద్యోగాలలో బీసీ రిజర్వేషన్ బిల్లులు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ అమలు, బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చే చర్యలు లాంటి డిమాండ్లను వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు చిరంజీవి, సర్వేష్, బీసీ-ఎస్సీ-ఎస్టీ సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు, యువకులు పాల్గొన్నారు. రిజర్వేషన్ల పెంపు కోసం భవిష్యత్తులో మరింత పెద్ద స్థాయిలో ఉద్యమాలు చేపడతామని నాయకులు తెలిపారు.





## ఐటీడీఏను ముట్టడించిన ఆదివాసీ సంఘాలు

- ఎస్టీ జాబితా నుండి లంబాడిలను తొలగించాలని డిమాండ్

**ప్రతిపక్షం ప్రతినిధి, ములుగు, నవంబర్ 3:** ములుగు జిల్లాలో ఆదివాసీ సంస్థల ఆందోళన ఉధృతమైంది. ఎస్టీ జాబితా నుండి లంబాడి సమాజాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ, ఆదివాసీ సంఘాలు ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం వద్ద భారీ నిరసన చేపట్టాయి. ఉదయం నుంచే వందలాది మంది ఆదివాసీలు గుంపులుగా ఏటూరునాగారం చేరుకొని తమ ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. ఉదయం తొలుత ఏటూరునాగారం వైజంక్షన్‌లోని కొమరం భీమ్ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన నాయకులు, అక్కడి నుంచి భారీ ర్యాలీగా ఐటీడీఏ కార్యాలయం వైపు కదిలారు. 'జై ఆదివాసీ', 'మా హక్కులు - మాకు ఇవ్వాలి', 'ఎస్టీ హక్కులు రక్షించాలి' అంటూ నినాదాలతో ఊగిసలాడిన ర్యాలీ పట్టణమంతా సంచలనం సృష్టించింది. ర్యాలీలో పురుషులతోపాటు మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందస్తుగా పోలీసు శాఖ భారీ బందోబస్తు చేసింది. జిల్లా ఎస్పీ శబరిష్ ఆదేశాల మేరకు అదనపు బలగాలను మోహరించారు. ర్యాలీ మార్గమంతా పోలీసులు కఠినంగా నిఘా పెట్టారు. ఏటూరునాగారం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను కూడా నియంత్రించారు. అయితే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు నమోదుకాలేదు. తరువాత ఆదివాసీ సంఘాల ప్రధాన నేతలు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చిత్రా మిశ్రాను కలిసి తమ డిమాండ్లను వినిపించారు. ఎస్టీ హక్కుల పరిరక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం ఉన్న ఎస్టీ జాబితాలో ఇతర సమాజాల వల్ల అసలు ఆదివాసీ సమాజాలు నష్టపోతున్నాయని, అభ్యర్థనలు విన్న పీవో వాటిని పై అధికారులకు పంపిస్తానని హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ నేతలు మాట్లాడుతూ "మా హక్కులు, మా పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుంది. ఆదివాసీ గుర్తింపును బలహీనపరిచే ప్రయత్నాలను సహించము. అవసరమైతే పోరాటాన్ని స్థాయికి విస్తరిస్తాము" అని స్పష్టం చేశారు. ముట్టడి అనంతరం ఉద్రిక్తతలు లేకుండా పరిస్థితులు క్రమంగా సాధారణమయ్యాయి. పోలీసులు ఐటీడీఏ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఇంకా నిఘాను కొనసాగిస్తున్నారు.



నా ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని నిరూపిస్తే నేనే పడగొడతా. లేకపోతే అప్పా జంక్షన్‌లో కేటీఆర్ ముక్కు నేలకు రాస్తారా?. లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఎవరికిచ్చారు. 500 రోజుల్లో అధికారంలోకి వస్తామన్న మాటల వెనుక బీఆర్ఎస్ ఆలోచన ఏంటో స్పష్టంగా కనిపిస్తోంది. గులాబీ నేతల కుట్రలు, కుతంత్రాలను ప్రజలు గమనిస్తున్నారు.

\- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి


విశ్వ వీక్షణం

## ప్రైవేట్ రంగంలో పరిశోధనలకు ప్రోత్సాహం

- ఇన్నోవేషన్ కాంక్లేవ్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోడీ

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ నవంబర్ 3 :** ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్‌ని ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం భారత్ మండపంలో ప్రారంభించారు. ప్రైవేట్ రంగంలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించే వాతావరణం కల్పించేందుకు రూ. లక్ష కోట్ల నిధిని ఉపయోగించనున్నట్లు తెలిపారు. వన్డే వరల్డ్ కప్ సాధించిన భారత మహిళల జట్టును, బాహుబలి రాకెట్‌ను విజయవంతంగా నింగిలోకి పంపిన ఇస్రోను అభినందించారు. భారత్ సాధించిన అద్భుత విజయంతో సంతోషంగా ఉందని, మహిళల జట్టు తొలి ప్రపంచకప్‌ని సాధించిందని చెప్పారు. ఈ విజయం దేశంలోని కోట్లాది మంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. భారత్ శాస్త్ర సాంకేతిక రంగంలో జెండా ఎగుర వేసిందని, శాస్త్రవేత్తలు అత్యంత బరువైన కమ్యూనికేషన్ శాటిలైట్‌ను విజయవంతంగా ప్రయోగించారని ప్రధాని అన్నారు. శాస్త్రవేత్తలందరినీ తాను అభినందిస్తున్నానన్నారు. రూ. లక్ష కోట్ల నిధి ప్రయివేట్‌రంగంలో పరిశోధనలను ప్రోత్సహిస్తుందని ప్రధాని మోడీ అన్నారు. 21వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు కలిసి కొత్తతరం శాస్త్ర, సాంకేతిక రంగాలకు మార్గదర్శకత్వం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఆధునిక ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి ప్రభుత్వం గణనీయ సంస్కరణలను చేపట్టిందన్నారు.






## ఢిల్లీలో కోట్లు ఖర్చు పెట్టినా దక్కని ఫలితం

- 9 ప్రయోగాలు చేసిని వాన చుక్క పడలేదు

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ నవంబర్ 3 :** ప్రభుత్వాలు పెట్టుబడి పెడితే, ప్రజలకు ప్రయోజనం చేకూరాలని, ఆదాయం రావాలని, పర్యాటకులను ఆకర్షించాలని భావిస్తాయి. ఈ మేరకు ప్రణాళిక రూపొందిస్తాయి. బడ్జెట్ అంచనా వేస్తాయి. పనులు చేపట్టే కాంట్రాక్టర్, ఏజెన్సీ పనితీరు తెలుసుకుంటారు. తర్వాతే ముందుకు వెళ్తారు. అయితే ఢిల్లీ ప్రభుత్వం ఇవన్నీ చేసింది. కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టింది. కానీ ఫలితం మాత్రం తీవ్ర నిరాశపర్చింది. పెట్టుబడి అంతా ఆకాశంలో పోసిన పన్నీరైంది. కొన్నేండ్లుగా దేశ రాజధాని శీతాకాలంలో కాలుష్యంతో సతమతమవుతోంది. ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు. దీంతో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఢిల్లీ ప్రభుత్వం రూ.3.2 కోట్లతో క్లౌడ్ సీడింగ్ ప్రాజెక్టు చేపట్టింది. ఐఐటీ కాన్పూర్ సహకారంతో మూడు ట్రయల్స్ నిర్వహించింది. అయితే, ఒక్క చుక్క వర్షం కూడా రాలేదు. అక్కడి వాతావరణంలో తక్కువ మేఘాల తేమ (10-20 శాతం) ఉన్న కారణంగా ఈ ప్రయోగం విఫలమైంది. సాధారణంగా క్లౌడ్ సీడింగ్‌కు 50 శాతం పైగా తేమ అవసరం అని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ప్రతి ట్రయల్‌కి సాధారణంగా రూ.35-64 లక్షలు ఖర్చు అయ్యింది. 9 ట్రయల్స్ కోసం రూ.3.21 కోట్లు కేటాయించింది ఢిల్లీ ప్రభుత్వం. ఇది విఫలమైనా ఇంకా ప్రయోగాల కోసం ప్రణాళికలు కొనసాగడం విమర్శలకు దారితీస్తోంది. ఖర్చు చేసినప్పటికీ, ఎలాంటి వర్షం లేకపోవడం నిరాసక్తత కలిగించింది.

సింగిడి
హైదరాబాద్
మంగళవారం
04.11.2025
11
ప్రతిపక్షం
Prathipaksham.in

బరువు తగ్గేందుకు వాకింగ్ బెస్ట్ ఆప్షన్ అని మీకు తెలుసా? అవును మీరు విన్నది నిజమే, వాకింగ్‌తో బరువు తగ్గించుకోవచ్చు. వాకింగ్ సరిగ్గా చేస్తే జిమ్ వ్యాయామాల మాదిరిగానే ప్రభావవంతంగా పనిచేస్తుంది.



# బరువు తగ్గాలా? నడక సరిపోతుంది



చాలా మంది అధిక బరువు, ఊబకాయం సమస్యలతో బాధపడుతున్నారు. ఒక వ్యక్తి ఆహారపు అలవాట్లు, చెడు జీవనశైలి అతని ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయి. ఆహారపు అలవాట్ల కారణంగా అధిక బరువు, బెల్లీ ఫ్యాట్ సమస్యలతో బాధపడుతున్నారు. అయితే, బరువు తగ్గడానికి చాలా మంది నానా ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు ఆహారంలో మార్పులు చేసుకుంటే.. మరికొందరు జిమ్‌లు చుట్టూ తిరుగుతున్నారు. అయితే, చాలా మందిలో ఎక్కువ మార్పు కనిపించడం లేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా బరువు తగ్గలేకపోతున్నారు. అయితే బరువు తగ్గేందుకు వాకింగ్ బెస్ట్ ఆప్షన్ అని మీకు తెలుసా? అవును వాకింగ్‌తో బరువు తగ్గించుకోవచ్చు. వాకింగ్ సరిగ్గా చేస్తే జిమ్ వ్యాయామాల మాదిరిగానే ప్రభావవంతంగా పనిచేస్తుంది. అయితే, బరువు తగ్గాలంటే నడకలోనూ కొన్ని రూల్స్ తెలుసుకోవాలి. వాటిని ఫాలో అయితే నడక ద్వారా బరువు తగ్గవచ్చు.

నెమ్మదిగా వద్దు వేగంగా నడవండి

రోజూ వాకింగ్ చేస్తూ.. స్లోగా నడవడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు. బరువు తగ్గాలంటే బ్రిస్క్ వాకింగ్ బెస్ట్ ఆప్షన్. నిమిషానికి కనీసం 80 నుండి 100 అడుగులు వేయాలి. బ్రిస్క్ వాకింగ్ హృదయ స్పందన రేటును పెంచుతుంది. కేలరీలను వేగంగా బర్న్ చేస్తుంది. కొవ్వు తగ్గడాన్ని వేగవంతం చేస్తుంది. 30 నుండి 45 నిమిషాల నడకలో చెమట పట్టడానికి ట్రై చేయండి. అప్పుడే నడక ప్రభావం మీ బరువుపై పడుతుంది.

### సరైన సమయం

ఎప్పుడైనా నడవడం వల్ల బరువు తగ్గవచ్చని మీరు అనుకుంటే, అది పూర్తిగా నిజం కాదు. సరైన సమయంలో నడవడం వల్ల చాలా రెట్లు ఎక్కువ ఫలితాలు వస్తాయి.

ఉదయం ఖాళీ కడుపుతో నడవడం: ఇది శరీరంలో నిల్వ ఉన్న కొవ్వును శక్తిగా మార్చడానికి సహాయపడుతుంది. కొవ్వును వేగంగా బర్న్ చేస్తుంది.

రాత్రి భోజనం తర్వాత నడవడం: జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కొవ్వు నిల్వ ఉండటాన్ని ఆపుతుంది.

మధ్యాహ్నం తేలికపాటి నడక: భోజనం తర్వాత తేలికపాటి నడక జీవక్రియను పెంచుతుంది. అంతేకాకుండా శరీరం రోజంతా ఎక్కువ కేలరీలను బర్న్ చేస్తుంది.

### అడుగుల సంఖ్యను పెంచండి

బరువు తగ్గడానికి ప్రతిరోజూ కనీసం 10,000 అడుగులు పూర్తి చేయాలని ఫిట్‌నెస్ నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రారంభంలో 5000 అడుగులతో మీ వాకింగ్ ప్రారంభించండి. ఆ తర్వాత క్రమక్రమంగా అడుగుల సంఖ్యను పెంచుకోండి. ఇంట్లో లేదా ఆఫీసులో నడవడం అలవాటు చేసుకోండి. లిఫ్ట్‌కు బదులుగా మెట్లు ఎక్కండి. ఎవరితోనైనా ఫోన్ మాట్లాడేటప్పుడు వాకింగ్ చేయండి. రోజువారీ లక్ష్యాన్ని తెలుసుకోవడానికి స్మార్ట్‌వాచ్ లేదా మొబైల్ యాప్‌ని ఉపయోగించి మీ దశల్ని ట్రాక్ చేయండి.

### వంపులు తిరిగి నడవండి

రోజూ చదునైన మార్గంలో స్ట్రైట్‌గా నడస్తుంటే దానిని కొంచెం సవాలుగా మార్చుకోండి. పార్కులో వాలుగా ఉన్న ప్రదేశాన్ని ఎంచుకోండి. లేదంటే రోజూ మెట్ల ఎక్కడం, దిగడం చేయండి. ట్రెడ్‌మిల్‌పై నడుస్తుంటే ఇంక్లైన్ మోడ్‌ను సెట్ చేయండి . ఇది శరీర కండరాల్ని మరింత చురుగ్గా చేస్తుంది. ఇది కొవ్వును వేగంగా బర్న్ చేయడానికి సాయపడుతుంది.

### సరైన భంగిమలో నడవాలి

వాకింగ్ చేయడంలో భంగిమ కీలకపాత్ర పోషిస్తుందని గుర్తించుకోండి. తప్పుడు భంగిమలో నడిస్తే అది ఆరోగ్యానికి ముప్పు అని తెలుసుకోండి. చాలా మంది మెడను వంచి వాకింగ్ చేస్తారు. ఇలా చేయడం వల్ల భుజాలతో సహా మొత్తం శరీరంపై భారం పడుతుంది. దీంతో.. బాడీ తీవ్ర నొప్పికి గురయ్యే ప్రమాదముంది. మరికొందరు మొబైల్ ఫోన్‌లో చూసుకుంటూ వాకింగ్ చేస్తుంటారు. ఇది కూడా మంచి భంగిమ కాదని తెలుసుకోండి. నిటారుగా నిలబడి వాకింగ్ చేయండి. ఇలా నడవడం వల్ల మంచి ప్రయోజనాలు అందుతాయి.

### ఇంటర్వెల్ వాకింగ్


మీరు ఎల్లప్పుడూ ఒకే వేగంతో నడిస్తే, శరీరం దానికి అనుగుణంగా మారుతుంది. అంతేకాకుండా కేలరీలు వేగంగా బర్న్ అవతాయి. ఇంటర్వెల్ వాకింగ్, అంటే మారుతున్న వేగంతో నడవడం. ఇది బరువు తగ్గడానికి అత్యంత ప్రభావవంతమైన మార్గం. 30 సెకన్ల పాటు వేగంగా నడవండి. ఆ తర్వాత 1 నిమిషం పాటు సాధారణ వేగంతో నడవండి. రోజూ 20 నుండి 30 నిమిషాలు ఇలా చేయండి. ఇలా నడవడం వల్ల హృదయ స్పందన రేటు హెచ్చుతగ్గులకు గురవుతుంది. ఇది కొవ్వును వేగంగా కరిగిస్తుంది.


### సరైన బూట్లు

వాకింగ్ కోసం మంచి బూట్లు ఎంపిక చేసుకోండి. మీకు సెట్ కాని షూస్‌తో నడవడం వల్ల మోకాళ్లు, చీలమండలు, నడుముకు ప్రమాదకరం. సౌకర్యవంతమైన స్పోర్ట్స్ షూస్ ధరించండి. పాదాల నొప్పి లేదా వాపు రాకుండా ఉండాలంటే ప్రతి ఆరు నెలలకు ఒకసారి మీ బూట్లు మార్చండి. షూస్ రోజూ క్లీన్ చేసుకోండి. ఇక, నడిచిన తర్వతా కండరాలు విశ్రాంతి తీసుకోవడానికి కూల్ డౌన్ చేయండి. అంటే ఏదైనా చిన్నపాటి వ్యాయామాలు చేయండి.

### ఆహారం

80% ఆహారం, 20% వ్యాయామం.. ఇది బరువు తగ్గడానికి గోల్డెన్ రూల్. ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తినండి. జంక్ ఫుడ్, చక్కెర పదార్థాలకు దూరంగా ఉండండి. హైడ్రేటెడ్ గా ఉండటం వల్ల జీవక్రియ పెరుగుతుంది. కొవ్వు వేగంగా తగ్గుతుంది. ఇందుకోసం తగినంత నీరు తాగండి. రోజుకు కనీసం 8 గ్లాసుల వాటర్ తాగాలని నిపుణులు చెబుతున్నారు.





## అమెరికాకు 62 వేల కోట్ల నష్టం

- ఒడిదుడుకులలో అగ్రరాజ్యం ఆర్థిక వ్యవస్థ

**న్యూయార్క్ (అమెరికా), నవంబర్ 3:** ఏ ముహూర్తంలో డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయ్యాడో తెలియదు గానీ, ఆ దేశానికి ఏది కూడా కలిసి రావడం లేదు. ఆంక్షలు, సుంకాలు అంటూ ట్రంప్ ప్రపంచ దేశాలను అనేక విధాలుగా ఇబ్బంది పెడుతున్నాడు. ఒక రకంగా ప్రత్యక్ష నరకం అంటే ఏమిటో చూపిస్తున్నాడు. నిజానికి ట్రంప్ విధిస్తున్న సుంకాలతో ప్రపంచ దేశాల కంటే అమెరికాకే నష్టం ఎక్కువగా జరుగుతోంది. ఈ విషయాన్ని ట్రంప్ గుర్తించడం లేదు. ఏమాత్రం లెక్కలోకి తీసుకోవడం లేదు. డొనాల్డ్ ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు ప్రపంచ దేశాలను ఇబ్బంది పెడుతోంది. అమెరికాలోని విపక్ష పార్టీల నేతలు కూడా ట్రంప్ తీరు పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా అమెరికాలో కీలక బిల్లుల విషయంలో విపక్ష పార్టీ నిరసన వ్యక్తం చేసింది. అధికార పార్టీ తీసుకొచ్చిన విధానాలకు వ్యతిరేకంగా స్వరం వినిపించింది. దీంతో అమెరికా ప్రభుత్వం ప్రస్తుతం షట్ డౌన్ అనే పరిస్థితిని ఎదుర్కొంటున్నది. గడిచిన 31 రోజులుగా అమెరికా ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. దీని వల్ల అమెరికాలో ఏకంగా 62 వేల కోట్ల సంపద ఆవిరి అయిపోయింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే 11 బిలియన్ డాలర్ల సంపద ఆవిరి అయిపోతుందని కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ పేర్కొంది. ఈ షట్ డౌన్ చాప కింద నీరు లాగా విస్తరిస్తోందని ఆర్థిక రంగ నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలహీనంగా మారిపోవడంతోనే ఇదంతా జరుగుతోందని నిపుణులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఊహించిన దానికంటే అతిపెద్ద సమస్యగా మారే అవకాశం ఉందని అంటున్నారు.



## రాజస్థాన్ లో ఘోర రోడ్డు ప్రమాదం

- 13 మంది ప్రయాణికుల దుర్మరణం

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, జైపూర్, నవంబర్ 3 :** ఘోర రోడ్డు ప్రమాదాలు దేశమంతా ప్రయాణికులను వెంటాబుతున్నాయి. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో సోమవారం మరో రోడ్డు ప్రమాదం జరిగింది. హర్మారా ఠాణా పరిధిలోని లోహామండీ రహదారిపై వేగంగా వస్తున్న ఓ టిప్పర్ బీభత్సం సృష్టించింది. ఏకంగా 12 వాహనాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 13 మంది చనిపోయారు. అనేక మందికి గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే చౌమున్ ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారి ఉషా శర్మ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రాజస్థాన్ డిప్యూటీ సీఎం ఈ ప్రమాదంపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అత్యంత వేగంగా వచ్చిన టిప్పర్ తొలుత ఒక కారును బలంగా ఢీకొట్టి, తర్వాత మరో 11 వాహనాలను బలంగా తాకింది. దీన్ని బట్టి ఆ టిప్పర్ ఎంత వేగంగా వస్తుందో అర్థం చేసుకోవచ్చు. జైపూర్ అదనపు కమిషనర్ రాజీవ్ పచార్ మాట్లాడుతూ,సమాచారం అందుకున్న హర్మదా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారని చెప్పారు. పోలీసులు స్థానికులు సహాయంతో వాహనాలలో చిక్కుకున్న వారికి బయటకు తీసే ప్రయత్నం చేశారన్నారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారని తెలిపారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందన్నారు.




## నేపాల్ లో ఏం జరిగిందో చూశారుగా!

- పోర్న్ కంటెంట్ నిషేధంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ నవంబర్ 3 :** సోషల్ మీడియాలో అంతకంతకూ పెరిగిపోతున్న అశ్లీలతను నిషేధం విధించాలంటూ దాఖలైన పిటిషన్ పై సుప్రీం కోర్టు విభిన్నంగా స్పందించింది. దేశంలో పోర్నోగ్రఫీ విచ్చలవిడిగా అందుబాటులో ఉందని, ఇది యువతపై దుష్ప్రభావం చూపే అవకాశం ఉన్నందున తక్షణం దీనిని నిషేధించాలని కోరుతూ ఓ పిటిషన్ దాఖలైంది. అయితే, సుప్రీంకోర్టు దీని మీద కీలక వ్యాఖ్యలు చేసింది. 'నేపాల్ లో ఏం జరిగిందో చూశారుగా!' అంటూ జెన్ జీ నిరసనలను ప్రస్తావించింది. నేపాల్‌లో సోషల్ మీడియాపై బ్యాన్ విధించినపుడు అక్కడి యువత రోడ్లపైకి వచ్చి చేసి గందరగోళం సృష్టించారని గుర్తుచేసింది. ఇంటర్నెట్ లో అశ్లీల చిత్రాలు సులభంగా లభిస్తాయని, కేంద్ర ప్రభుత్వం అశ్లీల చిత్రాలను అరికట్టడానికి ఒక విధానాన్ని రూపొందించాలని పిటిషనర్ కోరారు. ప్రజలు అశ్లీల కంటెంట్‌ను యాక్సెస్ చేయకుండా నిరోధించడానికి ఒక సమర్థవంత యంత్రాంగం లేకపోవడాన్ని ప్రస్తావించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, దీనిపై వెంటనే ఉత్తర్వులు ఇవ్వబోమని తెలిపింది. నాలుగు వారాల తర్వాత ఈ పిటిషన్ పై విచారణ జరిపేందుకు అంగీకరించింది. ప్రస్తుతం మన దేశంలో అశ్లీల చిత్రాలు చూడటంపై ఎలాంటి నిషేధం లేదు. ఈ కంటెంట్ తయారీ మాత్రం చట్టవిరుద్ధం. వాణిజ్య అవసరాల కోసం పోర్న్ కంటెంట్ తయారు చేస్తే చట్ట ప్రకారం శిక్షించే అవకాశం ఉంది. దీంతో ఇప్పుడు సుప్రీంకోర్టు ఆదేశాలు కీలకంగా మారాయి.










## మహిళల వన్డే జట్టుకు బీసీసీఐ భారీ నజరానా

- 51 కోట్ల భారీ నగదు బహుమతి ప్రకటన

మహిళల వన్డే క్రికెట్ ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని జట్టుకు రూ. 51 కోట్ల భారీ నగదు బహుమతి అందజేస్తామని వెల్లడించింది. ఆదివారం నవీ ముంబైలో జరిగిన ఫైనల్ మ్యాచులో భారత అమ్మాయిల జట్టు 52 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించింది. 47 యేండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ తొలి ప్రపంచకప్‌ను అందుకుంది. గతంలో రెండు సార్లు ఫైనల్ లో ఓడినా, ఈసారి మాత్రం ఏ తప్పిదం చేయకుండా విజయబావుటా ఎగుర వేసింది. భారత మహిళలు సాధించిన ఈ చరిత్రాత్మక విజయంపై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. బీసీసీఐ కూడా జట్టుకు భారీ నజరానా ప్రకటించి ప్రోత్సహించింది. ఈ విజయం మహిళల క్రికెట్‌ను మరో స్థాయికి తీసుకెళ్తుందని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా పేర్కొన్నారు. జైషా బీసీసీఐ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత భారత మహిళల క్రికెట్‌కు ప్రాధాన్యం లభించిందని అన్నారు. ఇపుడు ఐసీసీ ఛైర్మన్‌గా మహిళల ప్రపంచకప్ ప్రైజ్‌మనీ విషయంలో జైషా మంచి నిర్ణయం తీసుకున్నారని అన్నారు. రూ.51 కోట్ల నజరానాలో క్రీడాకారులతోపాటు కోచ్, సహాయక సిబ్బందికి వాటా ఉంటుందని చెప్పారు. 1983లో కపిల్ దేవ్ నాయకత్వంలో టీమిండియా తొలిసారి ప్రపంచకప్ నెగ్గింది. అప్పటి నుంచి దేశంలో క్రికెట్‌కు విపరీతమైన క్రేజ్ పెరిగింది. ఇప్పుడు అమ్మాయిలు కూడా అద్భుతం చేసి చూపించారు.

ప్రతిపక్షం
Prathipaksham.in
12
హైదరాబాద్
మంగళవారం
04.11.2025

# సినిమా

## రికార్డులకెక్కిన భారత మహిళల కెప్టెన్ 'హర్మన్'

- ప్రతి మ్యాచులోనూ పట్టు వదలకుండా పోరాటం

వరల్డ్ కప్ సాధించడం అంటే, అది ఎవ్వరికైనా గొప్ప విషయమే. క్రికెట్ లో అయితే వన్డే వరల్డ్ కప్ అత్యంత ప్రతిష్ఠాత్మకం. తమ కెరీర్‌లో ఒక్కసారైనా వరల్డ్ కప్ ట్రోఫీని ముద్దాడాలని ప్రతి క్రీడాకారుడు అనుకుంటాడు. దశాబ్దాలుగా మహిళల జట్టుకు ఆ కల మాత్రం తీరలేదు. గతంలో రెండుసార్లు (2005, 2017) ఫైనల్‌దాకా వచ్చినా ఆశ తీరలేదు. కానీ, ఈసారి వచ్చిన అవకాశాన్ని హర్మన్‌ప్రీత్ సేన గొప్పగా అందిపుచ్చుకుంది. ఈ టోర్నీ ఆసాంతం ప్రతి మ్యాచులోనూ పట్టు వదలకుండా పోరాడింది. చివరకు సౌతాఫ్రికాతో జరిగిన తుది పోరులోనూ అదే స్ఫూర్తితో పోరాడి తొలిసారిగా కప్పును అందుకుంది. ఈ క్రమంలో భారత మహిళల క్రికెట్ చరిత్రలో హర్మన్‌ప్రీత్ కౌర్ పేరు రికార్డులకు ఎక్కింది. భారత మహిళల జట్టుకు వన్డే వరల్డ్‌కప్ అందించిన తొలి కెప్టెన్ గా ఘనతను పొందింది. భారత పురుషులు, మహిళల జట్లు ఇప్పటిదాకా ఏడుసార్లు వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకున్నాయి. పురుషుల జట్టు నాలుగుసార్లు, మహిళల మూడుసార్లు ఫైనల్‌దాకా వచ్చాయి. ఇరుజట్లు మూడుసార్లు ట్రోఫీని అందుకున్నాయి. తొలిసారి 1983లో వన్డే వరల్డ్ కప్ గెలిచింది. అప్పుడు జట్టుకు కపిల్ దేవ్ కెప్టెన్ గా ఉన్నాడు. ధోనీ కెప్టెన్సీలో టీమిండియా 2011లో విశ్వవిజేతగా నిలిచింది. తాజాగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలో భారత్ మహిళా క్రికెట్ తొలిసారి విజేతగా నిలిచింది. దీంతో భారత్‌కు వన్డే వరల్డ్ కప్ అందించిన మూడో కెప్టెన్‌గా హర్మన ఘనతను పొందింది.





## భారత అమ్మాయిల మీద ప్రశంసల వెల్లువ

- చరిత్ర సృష్టించారన్న రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ

ప్రపంచ కప్ గెలిచిన భారత మహిళాల జట్టుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ టీమిండియాకు అభినందనలు తెలిపారు. భారత అమ్మాయిలు చరిత్ర సృష్టించారని రాష్ట్రపతి ద్రౌపది కొనియాడారు. మహిళల జట్టు అసమాన ప్రతిభ, అద్వితీయ ప్రదర్శనకు తగిన ఫలితం లభించిందని ప్రధాని మోడీ అన్నారు. ఈ గెలుపు మహిళల క్రికెట్‌ను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళుతుందని పేర్కొన్నారు. అని మోడీ ట్వీట్ చేశారు. టోర్నీ ఆసాంతం ఆటగాళ్లు అసాధారణ సమష్టి కృషి, పట్టుదలను ప్రదర్శించారని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా ప్రశంసించారు. ఈ చారిత్రాత్మక విజయం భవిష్యత్తు ఛాంపియన్లకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. 'వుమెన్ ఇన్ బ్లూ చరిత్ర సృష్టించింది' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశంసించారు. మన అమ్మాయిల తెగువ, పోరాటం భారత్‌కు కీర్తిని తెచ్చిపెట్టాయని, వారు కేవలం ట్రోఫీని మాత్రమే పొందలేదని జాతీయ స్ఫూర్తిని రగిల్చారని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రశంసించారు. అమ్మాయిలు కేవలం కప్పునే కాదు, ప్రతి భారతీయుడి హృదయం గెలుచుకున్నారని కొనియాడారు. ఇదొక అద్భుత క్షణమని సచిన్ తెండూల్కర్ అభివర్ణించారు. దేశంలోని యువతులకు ఈ విజయం ప్రేరణగా ఉంటుందన్నారు. ఆట ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేసిందని విరాట్ కోహ్లీ అన్నాడు. రెండు దశాబ్దాల కలను హర్మన్‌ప్రీత్ బృందం నిజం చేసిందని భారత మహిళ క్రికెట్ దిగ్గజం మిథాలీ రాజ్ అన్నారు. చారిత్రాత్మక విజయం సాధించిన భారత జట్టుకు ఐసీసీ ఛైర్మన్ జై షా అభినందనలు తెలిపారు.



## ఆ 45 రోజులు నిదుర లేని రాత్రులు గడిపాను

- స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన భావోద్వేగం

ప్రపంచకప్‌ను గెలుచుకున్న తర్వాత స్మృతి మంధాన ఒక్కసారిగా భావోద్వేగానికి లోనైంది. భారత్ 52 పరుగుల తేడాతో గెలిచి, దేశమంతటా ఆనందోత్సాహాలను నింపింది. ప్రపంచకప్ గెలవాలంటే జట్టు అద్భుత కృషి చేయాలి. భారత్ సరిగ్గా అదే చేసింది. స్మృతి మంధాన 434 పరుగులతో అత్యధిక పరుగులు చేసింది. సెమీఫైనల్ మ్యాచులో ఆస్ట్రేలియాను ఓడించడంలో జెమీమా రోడ్రిగ్స్ (127), హర్మన్‌ప్రీత్ కౌర్ (89) గొప్ప ప్రదర్శన చేశారు. దీప్తి శర్మ 22 వికెట్ల తీసింది. అమన్‌జోత్ కౌర్, రిచా ఘోష్, షెఫాలీ వర్మ కూడా కీలక పాత్ర పోషించి భారత్‌కు చరిత్ర సృష్టించడంలో సహాయపడ్డారు. భారత్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలబడటం అంటే ఏమిటో వివరించే ప్రయత్నంలో స్మృతి మంధాన కన్నీళ్లు పెట్టుకుంది. 'ఎలా స్పందించాలో తెలియడం లేదు. ఇది ఇంకా నాకు నిదానంగా జీర్ణమవుతోంది. క్రికెట్ మైదానంలో నేను ఎప్పుడూ ఇంత భావోద్వేగానికి లోను కాలేదు. 'ఛాంపియన్స్ ఇండియా' అనడాన్ని నేను ఇంకా అర్థం చేసుకోలేకపోతున్నాను. ప్రతి ప్రపంచకప్‌కు మేము వెళ్లినప్పుడల్లా ఎన్నో గుండెకోతలు ఎదురయ్యాయి. కానీ, మహిళల క్రికెట్ సంబంధించి మాపై కీలక బాధ్యత ఉందని మేము ఎప్పుడూ నమ్ముతాం. గత 45 రోజులుగా మాకు లభించిన మద్దతును చూస్తే ఆ రోజులు ఎలా గడిచిపోయాయో వివరించలేను. ఆ 45 రోజులు నిద్రలేని రాత్రులు గడిపాను' అని స్మృతి మంధాన వివరించింది.



## మోహన్ బాబు.. 50 ఇయర్స్ ఇండస్ట్రీ

### నవంబర్ 22న గ్రాండ్ ఈవెంట్

నటుడు, నిర్మాత, విద్యా వేత్త, పద్మ శ్రీ అవార్డు గ్రహీత కలెక్షన్ కింగ్ డా. ఎం. మోహన్ బాబు ఇండస్ట్రీలోకి వచ్చి ఈ ఏడాదితో 50 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ క్రమంలో నవంబర్ 22న ఓ గ్రాండ్ ఈవెంట్‌ను నిర్వహించబోతోన్నారు. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో నవంబర్ 22న 'MB50 ఎ పెర్ల్ వైట్ ట్రిబ్యూట్' అనే గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇది దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకునేలా ఈ ఈవెంట్‌ను నిర్వహించబోతోన్నారు. ఇదొక చారిత్రాత్మకమైన ఘట్టంగా అందరికీ గుర్తుండిపోయేలా నిర్వహించేందుకు విష్ణు మంచు ఏర్పాట్లు చేస్తున్నారు. ఐదు దశాబ్దాలుగా డాక్టర్ మోహన్ బాబు ప్రేక్షకుల్ని అలరిస్తూనే ఉన్నారు. తన శక్తివంతమైన ప్రదర్శనలు, ఐకానిక్ డైలాగ్ డెలివరీ, తెరపై చూపించిన ప్రతిభ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తుంటుంది. 600కి పైగా చిత్రాల్లో అతని బహుముఖ ప్రజ్ఞ, క్రమశిక్షణ, కళ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని చాటుతాయి. MB50 అంటే కేవలం సినీ విజయాలే కాకుండా.. కళ, విద్య, దాతృత్వం పట్ల ఆయన జీవితాంతం చూపిన నిబద్ధతను కూడా సూచిస్తుంది. ఎలాంటి సినీ నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి.. తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పర్చుకున్న విలక్షణ నటుడుగా ఎదిగిన ఈ జర్నీగురించి అందరికీ మరోసారి చాటి చెప్పబోతోన్నారు.




## 'గుమ్మడి నర్సయ్య'

### దర్శకుడిని ప్రశంసించిన శ్యామలా దేవీ

ఓ వ్యక్తి జీవిత చరిత్రను తెరపైకి తీసుకు రావడం అంటే అంత సాధారణమైన విషయమేమీ కాదు. పైగా ఓ రాజకీయ నాయకుడు.. అజాత శత్రువు.. నిజాయితీ పరుడు.. ప్రజల కోసం బతికే నాయకుడైన గుమ్మడి నర్సయ్య లాంటి వ్యక్తి చరిత్రను తెరపైకి తీసుకు వస్తుండటం సాహసం అనే చెప్పాలి. ఆ సాహసాన్ని యంగ్ డైరెక్టర్ పరమేశ్వర్ హివ్రాలే చేస్తున్నారు. ఈ సాహసానికి ప్రవల్లిక ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్ తరుపున ఎన్. సురేష్ రెడ్డి అండగా నిలబడ్డారు. ఇక 'గుమ్మడి నర్సయ్య'గా కరుణాడ చక్రవర్తి శివ రాజ్ కుమార్ కనిపించబోతోన్నారు. కొన్ని రోజుల క్రితం రిలీజ్ చేసిన 'గుమ్మడి నర్సయ్య' మోషన్ పోస్టర్ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. గుమ్మడి నర్సయ్య పాత్రలో శివ రాజ్ కుమార్ ఎలా కనిపిస్తారు? ఏ మేరకు ఆకట్టుకుంటారు? అని అంతా అనుకున్నారు. కానీ అందరి అంచనాల్ని తలకిందులు చేశారు. గుమ్మడి నర్సయ్య పాత్రకు శివన్న ప్రాణం పోసేందుకు సిద్ధంగా ఉన్నారని అర్థమైంది. ఆ పాత్రకు తగ్గ ఆహార్యంతో శివన్న అందరినీ ఆకట్టుకున్నారు. చిన్న మోషన్ పోస్టర్‌తోనే దర్శకుడు పరమేశ్వర్ తన టాలెంట్ ఏంటో చూపించారు. ఇక ఈ మోషన్ పోస్టర్‌ను చూసిన శ్యామలా దేవీ దర్శకుడిని ప్రశంసలతో ముంచెత్తారు. మోషన్ పోస్టర్ గురించి శ్యామలా దేవీ మాట్లాడుతూ.. 'ఎక్సలెంట్‌గా ఉంది.. ఈ మోషన్ పోస్టర్ చూస్తేనే సినిమా ఎలా ఉండబోతోందో అర్థం అవుతోంది.. ఎన్ని అవార్డులు వస్తాయో తెలుస్తోంది.. గుమ్మడి నర్సయ్యగా శివ రాజ్ కుమార్ గారు ప్రాణం పెట్టి నటిస్తున్నట్టుగా కనిపిస్తోంది.. చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్' అని అన్నారు. నిర్మాత ఎన్. సురేష్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ ఎత్తున నిర్మించబోతోన్నారు. ఈ చిత్రానికి కెమెరామెన్‌గా సతీష్ ముత్యాల, సంగీత దర్శకుడిగా సురేష్ బొబ్బిలి, ఎడిటర్‌గా సత్య గిడుటూరి పని చేస్తున్నారు. త్వరలోనే మూవీకి సంబంధించిన ఇతర ఆర్టిస్టులకి సంబంధించిన విషయాల్ని ప్రకటించనున్నారు.

## గోండు గిరిజన మహిళగా రష్మిక మందన్నా

హీరోయిన్ రష్మిక మందన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం మైసా . ఈ చిత్రానికి సంబంధించి ఏదో ఒక వార్త నెట్టింట రౌండప్ చేస్తూ అభిమానులు, మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. రష్మిక మందన్నా టీం అధికారికంగా షూటింగ్ మొదలుపెట్టేసినట్టు తాజాగా వార్త తెరపైకి వచ్చింది. కేరళలోని అథిరప్పిల్లీలో అధికారికంగా నేడు షూటింగ్ మొదలైనట్టు ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అంతేకాదు ఈ చిత్రంలో రష్మిక మందన్నా గోండ్ గిరిజన మహిళగా కనిపించనుందట. ఇప్పటికే విడుదల చేసిన రష్మిక మందన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇదివరకెన్నడూ కనిపించని నయా అవతార్‌లో మెస్మరైజ్ చేయబోతున్నట్టు ఫస్ట్ లుక్ హింట్ ఇచ్చేస్తుంది. మైసా సినిమాతో డైరెక్టర్‌గా పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ఈ డెబ్యూ డైరెక్టర్ ఇటీవలే మైసా నుంచి రష్మిక మందన్నా అగ్రెసివ్ లుక్ లాంచ్ చేసి హైప్ క్రియేట్ చేస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. పుష్ప ఫ్రాంచైజీలో శ్రీవల్లిగా డీగ్లామరస్ రోల్‌లో ఇరగదీసిన రష్మిక మందన్నా మరి గోండు గిరిజన మహిళగా మైసా సినిమాలో ఎలా మెప్పించబోతున్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది.




## 'కృష్ణ లీల'కి కథే హీరో

### హీరో, డైరెక్టర్ దేవన్

**యంగ్ హీరో దేవన్ హీరోగా, ఆయన స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న సూపర్ నేచురల్ లవ్ స్టొరీ 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం'అనేది ట్యాగ్ లైన్. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్ గా నటిస్తోంది. బేబీ వైష్ణవి సమర్పణలో మహాసేన్ విజువల్స్ బ్యానర్ పై జ్యోత్స్న జి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కథ & మాటలు- అనిల్ కిరణ్ కుమార్ జి అందించారు. ఈ సినిమా, టీజర్, ట్రైలర్ కి అద్భుతమైన స్పందన వచ్చింది. 'కృష్ణ లీల' నవంబర్ 7న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో, డైరెక్టర్ దేవన్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.**

**కృష్ణ లీల సినిమా ఎలా మొదలైంది?**

నేను సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తూనే సినిమా ప్రయత్నాలు చేసేవాడిని. రెండు సినిమాల్లో మంచి పాత్రలు చేశాను. ఆ తర్వాత అదే తరహా పాత్రలు రావడంతో కొత్త క్యారెక్టర్స్ కోసం ఎదురు చూస్తున్నప్పుడు నిర్మాత జోష్న, రైటర్ అనిల్ గారు ఈ కథ చెప్పారు. కథ విని ఒక వారం రోజుల తర్వాత ఈ జనరేషన్ కి ఈ కథని ఎలా చెప్పొచ్చో కొన్ని మార్పులు చేసి ఒక కొత్త రకం స్క్రీన్ ప్లేతో చెప్పాను. అది వారికి చాలా నచ్చింది. ఎవరు డైరెక్ట్ చేస్తారు అన్నప్పుడు నేనే డైరెక్ట్ చేస్తానని చెప్పాను. వాళ్లు చాలా హ్యాపీగా ఫీల య్యారు. నాకు డైరెక్షన్లో అనుభవం లేదు. కానీ కథ, స్క్రీన్ ప్లే మీద చిన్నప్పటినుంచి మంచి అవగాహన ఉంది అదే నమ్మకంతో డిఓపి చోటా కె నాయుడు గారి దగ్గరికి వీళ్లను ఈ కథని. డీవోపీ చోటా గారిని కలిశాను. నేనే డైరెక్ట్ చేస్తానని ఆయనకు చెప్పాను ఆయన కథ విన్నారు. చాలా ఎక్సైట్ అయ్యారు. తప్పకుండా తన సపోర్ట్ వుంటుందని చెప్పారు. అలా ఈ సినిమా ప్రారంభమైంది.

**కృష్ణ లీలా ఎలా ఉండబోతుంది?**

కృష్ణ లీల.. తిరిగి వచ్చిన కాలం .. లీల అంటే ఆట. ఆయన ఒక ప్రేమ కథని ఎలా ఆడారు? ఎలా ఆడించారనేది కృష్ణ లీల. మనిషి కాలాన్ని వెనక్కి తిరిగి తీసుకురాలేడు. కానీ ఒక దైవత్వంతో కాలం మళ్ళీ తిరిగి వస్తే ఎలా ఉంటుంది అనేది చాలా ఆసక్తికరంగా చూపించడం జరిగింది. మన ప్రతి పనికి ఒక డెస్టిని ఉంటుంది. మనం కలిసే ప్రతి వ్యక్తితో మనకు ఒక అటాచ్మెంట్ ఉంటుంది. ఈ జన్మలో నీతో ప్రయాణించే ప్రతి వ్యక్తి గత జన్మలో నీతో అనుబంధం కలిగి ఉంటారు. వాళ్లకి ప్రేమని పంచు అనేది భగవద్గీత చెప్తుంది. ఇందులో ఆ ఎలిమెంట్ ని చాలా కొత్తగా చూపించాం.

**క్రిష్ణ తత్వం చాలా పెద్ద సబ్జెక్టు కదా.. జనాలకు అర్థమయ్యేలా ఎలా చెప్పారు?**

కృష్ణ తత్వం అనేది ఒక మహా సముద్రం. భగవద్గీతలో చెప్పే వాక్యాలు ఈ కథకి చాలా అద్భుతంగా కనెక్ట్ అయ్యాయి. నేను గంగాధర శాస్త్రి గారి ప్రవచనాలు ఎక్కువగా వినేవాడి. ఆయనకి కథ చెప్పినప్పుడు నాకున్న చాలా సందేహాల్ని ఆయన నివృత్తి చేశారు. ఈ కథ విషయంలో హెల్ప్ చేశారు. ఇది కంటెంట్ పరంగా చాలా పవర్ ఫుల్ గా ఉంటుంది. మేము పేపర్ మీద ఎలా అనుకున్నమో తెరమీద అలా అద్భుతంగా చూపించాను. చాలా నిజాయితీ ఉన్న కథ ఇది. కథనే హీరోగా నమ్ముకున్నాను.

**ధన్య బాలకృష్ణ గురించి?**

ఈ కథ చెప్పినప్పుడు అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. నేను చెప్పిన కథను చాలా అద్భుతంగా పట్టుకున్నారు. చాలా మంచి పెర్ఫార్మర్. పృథ్వీ గారు తులసి గారు ఇలా చాలా మంచి నటులు ఉన్నారు. వాళ్ళ ఎక్స్పీరియన్స్ మాకు ఎంతగానో ఉపయోగపడింది. సినిమాని మేము అనుకున్నది అనుకున్నట్లుగా పూర్తి చేసాము. అందరూ కూడా చాలా అద్భుతమైన సపోర్ట్ ఇచ్చారు.

**ఆడియన్స్ కి ఏం చెప్తారు?**

ప్రేమ అనేది చాలా గొప్ప ఎమోషన్. అది భార్యాభర్తలు, తండ్రి కొడుకులు, మనకి మన ఫ్రెండ్స్ కి, మనకి జంతువులకు మధ్య ఉన్నది ఏదైనా కూడా ప్రేమే. ఈ సినిమా చూసిన తర్వాత మన ఫ్రెండ్, మనతో పరిచయమున్న వ్యక్తులు అందరి పట్ల మనకి ఒక గొప్ప అనుబంధాన్ని ఫీల్ అవుతాము. చోటా గారు నాకు చాలా కాన్ఫిడెన్స్ ఇచ్చారు. ఆయన ఇచ్చిన కాన్ఫిడెన్స్ తోనే ఈ సినిమా తీశాను, ఈ సినిమా కోసం డిఓపిగా సతీష్ ముత్యాల గారు పనిచేశారు. చాలా అద్భుతమైన వర్క్ ఇచ్చారు. నేను పేపర్ మీద ఏదైతే అనుకున్నానో స్క్రీన్ మీద దాన్ని తీసుకురాగలిగాము. భీమ్స్ చాలా వండర్ ఫుల్ మ్యూజిక్ ఇచ్చారు. ఆర్ఆర్ కూడా చాలా అద్భుతంగా వచ్చింది.

**మీరు డైరెక్టర్, హీరో.. ఎందులో కొనసాగుతారు?**

అది కాలమే నిర్ణయిస్తుంది. ప్రస్తుతానికైతే ఈ సినిమాని ఆడియన్స్ కి దగ్గరికి తీసుకెళ్లాలనే సంకల్పంతో ఉన్నాను.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200